



ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ | 06-10-2026 మంగళవారం సంపుటి : 11 | సంచిక : 293 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur Follow us on






### తప్పుడు వివరాలతో

## కఠిన చర్యలు

**హైదరాబాద్, అక్టోబర్ 5 (వుదయం)**

ఓటర్ల జాబితా నుంచి పేర్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించేందుకు నకిలీ దరఖాస్తులు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లతో పాటు జిల్లాల ఎన్నికల అధికారులకు, కలెక్టర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో ముందుగానే అచ్చు వేయించిన నమూనా పత్రాల ఆధారంగా ఓట్ల తొలగింపు దరఖాస్తులను భారీ స్థాయిలో అందజేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు సమర్పించే వారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధారణంగా అనర్హులైన వ్యక్తుల ఓట్లను తొలగించమని కోరేందుకు దరఖాస్తు ఫారాలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే రాజధాని నగరంలోని ముషీరాబాద్, గోషామహల్, చంద్రాయణగుట్ట వంటి నియోజకవర్గాలలో నిజమైన ఓటర్ల ఓట్లను సైతం తొలగించేందుకు కుట్రపూరితంగా అక్రమ దరఖాస్తులు సమర్పిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఇటీవలే ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో అప్రమత్తమైన సీఈవో కార్యాలయం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నికల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. అధికారులకు అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట మాత్రమే ఓటు తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఓట్ల తొలగింపుకే కాకుండా కొత్త ఓటు నమోదు దరఖాస్తులు, ఇతర సవరణల అభ్యర్థనలలో సైతం అసత్య సమాచారం ఇచ్చినా, తప్పుడు అంగీకార పత్రాలు ఇచ్చినా చట్టరీత్యా చర్యలు చేపడతామని వెల్లడించారు.

## బాధితులకు న్యాయం చేయాలి

**ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారు?**

**కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని పోలీసుల తీరుపై రాహుల్‌గాంధీ ధ్వజం**

**ఢిల్లీలో మహిళలపై పోలీసుల దురుసు ప్రవర్తనపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ఎఎంఎస్) :**

ప్రశ్నించే నైజం ఉన్న మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. దేశ రాజధానిలో మహిళలను అణచివేసే వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇటీవల ఢిల్లీ వేదికగా మహిళలపై, విలేకరులపై పోలీసులు అనాగరికంగా ప్రవర్తించారనే ఆరోపణల నేపథ్యంలో బాధితులకు తక్షణమే న్యాయం అందించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. బాధితులైన విలేకరులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో తాను జరిపిన ముఖాముఖి సంభాషణ దృశ్యాలను ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పంచుకున్నారు. బాధ్యతాయుతమైన విలేకరుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరుపై వారు తనతో ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ప్రసార పరికరాలను లాక్కోవడమే కాకుండా, వారిని ఈడ్చుకెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంతటి దారుణం జరిగినా బాధితుల ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక సమాచార నివేదిక కూడా నమోదు చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. రక్షణ కల్పించాల్సిన రక్షక భటులే ముప్పుగా పరిణమిస్తున్నారని, న్యాయం కోసం మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అక్కడే ఇలాంటి అన్యాయాలు జరగడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. సాకేత్ పోలీస్ స్టేషన్‌లోని నిఘా కెమెరా దృశ్యాలను తక్షణమే బయటపెట్టాలని, అక్రమాలకు పాల్పడిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను కోరుతూ జరిగిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న మహిళలు, వార్తా సేకరణకు వెళ్లిన మహిళా విలేకరుల పట్ల పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని, అనుచిత ప్రవర్తనను ప్రదర్శించారనే వార్తలు కలకలం రేపిన సంగతి తెలిసిందే.

## స్విస్ పెట్టుబడులే లక్ష్యంగా భారత్ ముందడుగు



**100 బిలియన్ డాలర్ల సాధనే ధ్యేయం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ఎఎంఎస్) :**

భారత్, స్విట్జర్లాండ్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. భారత పర్యటనకు విచ్చేసిన స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పర్మెలిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూఢిల్లీలో జరిపిన కీలక చర్చల అనంతరం రెండు దేశాలు ఐదు ముఖ్యమైన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వలసలుచలనశీలత భాగస్వామ్యం, యువ నిపుణుల మార్పిడి, రవాణా సాంకేతికతలురవాణా వ్యవస్థలు మౌలిక సదుపాయాల ప్రమోషన్ మరియు సహకారం, భారత ప్రభుత్వ విజ్ఞానసాంకేతిక మంత్రిత్వ శాఖ మరియు స్విస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ మధ్య అంగీకార పత్రం, అలాగే ఆవిష్కరణలుసాంకేతిక బదిలీసాహస సంస్థల రంగానికి సంబంధించిన సహకార ప్రణాళిక ఒప్పందాలు వీటిలో ఉన్నాయి .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, స్విస్ అధ్యక్షుడు గై పర్మెలిన్ ప్రతిపాదించిన భాగస్వామ్య దృక్పథాన్ని కొనియాడారు. యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య కూటమితో (ఈఎఫ్టీఏ) భారత్ గతేడాది అక్టోబరులో చారిత్రాత్మక వాణిజ్యఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని (టెపా) అమలులోకి తెచ్చిందని గుర్తుచేశారు. ఒక ఐరోపా ఆర్థిక కూటమితో భారత్ కుదుర్చుకున్న తొలి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇదేనని వ్యాఖ్యానించారు. రాబోయే 15 ఏళ్లలో ఈ ఒప్పందం ద్వారా 100 బిలియన్ అమెరికా డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, దాదాపు 10 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు.

## రాష్ట్ర రహదారుల ప్రగతికి కేంద్ర సహకారం



**గుజరాత్, అక్టోబర్ 5 (ఎఎంఎస్) :**

గుజరాత్‌లోని నర్మదా జిల్లా ఎక్తా కప్ ప్రాంతంలో గల స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద నిర్వహించిన 'చింతన్ శివిర్-2026' రెండవ రోజు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలనం చేసి ఈ సదస్సును ప్రారంభించారు. రెండు రోజుల పాటు సాగే ఈ సమావేశాలలో భాగంగా తొలిరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రహదారుల సమన్వయంపై కీలక చర్చలు జరిగాయి. అనంతరం కేంద్రమంత్రి గడ్కరీతో మంత్రి కోమటి రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం రహదారుల మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, సేతు బంధన్, సి.ఆర్.ఐ.ఎఫ్ (CRIF) పథకాల కింద మంజూరు చేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య రాకపోకలను సులభతరం చేయడం, రాజధాని హైదరాబాద్‌లో వాహనాల రద్దీని నివారించడం, ఆధ్యాత్మిక ప్రదేశాలకు రవాణా సదుపాయాలు మెరుగుపరచడమే లక్ష్యంగా పలు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**ఎల్బీనగర్ - హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్:**

హైదరాబాద్ తూర్పు భాగంలో ఎదురవుతున్న తీవ్ర రద్దీని అధిగమించడానికి ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే జాతీయ రహదారి65లో భాగంగా ఎల్బీనగర్మల్కాపూర్ వరకు రూ.545 కోట్లతో ఆరు వరుసల విస్తరణకు నిధులు వచ్చిన దాఖలాలు ఉన్నందున, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆర్.ఇ గోడల కంటే వయాడక్ట్ విధానంలోనే నిర్మించాలని విన్నవించారు. మెట్రో రెండో దశ విస్తరణను దృష్టిలో ఉంచుకుని ఈ కారిడార్‌ను 2026-27 వార్షిక ప్రణాళికలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

**పార్వతమాల కింద 5 రోప్‌వేలు:**

పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను అనుసంధానించే క్రమంలో రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులను మంజూరు చేయాలని కోరారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్ నుంచి నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి ఖిల్లా, నిజామాబాద్ కిల్లా రామాలయంలలో వీటిని ప్రతిపాదించినట్లు వివరించారు.

**మూడు ఆర్ఓబీ/ఆర్‌యుబీ పనులు:**

2026-27 ఆర్థిక సంవత్సరంలో సేతు బంధన్ పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద నాలుగు వరుసల వంతెన, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ వద్ద రెండు వరుసల వంతెన, నల్గొండ జిల్లా పగిడిపల్లి-నడికుడి మార్గంలో నాలుగు వరుసల రైల్వే వంతెనల నిర్మాణాలకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

**జాతీయ రహదారి65 విస్తరణ ప్రక్రియ :**

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం మార్గంలో రోజుకు 1.20 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున, రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ఈ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక ఆమోదాలు పూర్తయి కేంద్ర మంత్రిమండలి పరిశీలనలో ఉన్నందున, తుది అనుమతులు త్వరిత గతిన ఇచ్చేలా చూడాలని కోరారు.

## ఒక్కొక్కరికి రూ.1,10,250 బోనస్

**రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి బకాయిలు రూ.60 వేల కోట్లు వెంటనే చెల్లించాలి**

**కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్, అక్టోబర్ 5 (వుదయం)**

విజయదశమి, దీపావళి పండగల వేళ సింగరేణి బొగ్గు గని కార్మికులకు శుభవార్త అందింది. పండగ పురస్కారంగా ప్రతీ కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. అహోరాత్రులు శ్రమిస్తూ దేశానికి వెలుగులు నింపుతున్న సింగరేణి శ్రామికుల కష్టానికి వెలకట్టలేమని సామాజిక మాధ్యమ వేదికగా కొనియాడారు. సింగరేణి కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి కొంగుబంగారం వంటిదని వ్యాఖ్యానించారు. లక్షలాది కుటుంబాలకు ఈ సంస్థ జీవనాధారంగా నిలుస్తోందని ప్రశంసించారు. దేశ ప్రగతిలోనూ, రాష్ట్ర అభివృద్ధిలోనూ సింగరేణి అత్యంత కీలకమైన భాగస్వామి అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు ప్రయోజనాల పరిరక్షణ దిశగా యాజమాన్యం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సరైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఇదే సమయంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులందరికీ దసరా, దీపావళి పండగల సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేసీఆర్ కుటుంబం తర్వాత రేవంత్ సోదరుల పరిపాలన



**హైదరాబాద్, అక్టోబర్ 5 (వుదయం)**

నెహ్రూ వంశానికి చెందిన వ్యక్తి దేశ ప్రధాన మంత్రి పీఠాన్ని అధిరోహించలేకపోతున్నారనే నెపంతోనే కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసహనానికి గురవుతున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. ఆ అపజయాలను కప్పిపుచ్చుకోవడానికే భాజపాపై అక్రమ గెలుపు నిందలు మోపుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నట్లుగానే ఎన్నికలు అక్రమంగా జరిగి ఉంటే, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పొందిన విజయం కూడా చట్టవిరుద్ధమే అవుతుందని, అందువల్ల ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే సూత్రంతో కేరళ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులచేత కూడా రాజీనామాలు చేయించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తలు, పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలనలో కేసీఆర్ కుటుంబం, ప్రస్తుత పాలనలో రేవంత్ రెడ్డి సోదరులు మాత్రమే లబ్ధి పొందుతున్నారని, సాధారణ తెలంగాణ ప్రజలకు ఎలాంటి మేలు జరగడంలేదని రామచందర్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి వేతనాలు చెల్లించడానికి ఖజానాలో నిధులు లేవు కానీ, ఢిల్లీ పెద్దలకు మూటలు పంపడానికి మాత్రం సొమ్ములు సమకూరుస్తున్నారా అని ప్రశ్నించారు.

## ఇంతే కదా...!




## ఢిల్లీ రెసిడెంట్ కమిషనర్ గా అద్వైత్ కుమార్ సింగ్



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**

ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా (ఆర్‌సీ) ఐఏఎస్ అధికారి(2013 బ్యాచ్) అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో కేంద్ర ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఆయనకు ఆర్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయన తన ప్రస్తుత బాధ్యతలతో పాటు ఆర్‌సీగానూ సేవలు అందించనున్నారు.







## కోహిర్‌లో మండల స్థాయి ప్రజావాణి



- 19 మంది అధికారులు హాజరు.. రెండు పిటిషన్లు స్వీకరణ

కోహిర్, అక్టోబరు 5 (వుదయం ప్రతినిధి):

కోహిర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీవో ఎం. ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు మొత్తం 19 మంది హాజరయ్యారు.వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను కలిసి తమ సమస్యలను వివరించారు.ప్రజల నుంచి మొత్తం రెండు పిటిషన్లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.పిటిషన్లను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులను సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతోంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి ప్రజలు తమ సమస్యలతో హాజరు కావాలని అధికారులు సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన పిటిషన్లపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

# నీటి కోసం గ్రామస్తుల ఆందోళన

- 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్
- సబ్‌స్టేషన్ వద్ద నిరసన
- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 5, వుదయం:



సాగునీటి సమస్యతో పంట పొలాలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. వరి పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో విద్యుత్ కోతలతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్పూర్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రైతులు నిరసన చేపట్టారు. కనీసం 10 గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు వాపోయారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో సాగునీరు అందక పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వరి పంటకు సరిపడా విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు.

**ఎస్ఐ హామీతో ఆందోళన విరమణ**

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్ఐ కీర్తిరాజు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీతో ఫోన్‌లో సంప్రదించి రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

**ఖాళీ బిందెలతో మహిళల నిరసన**

అంతకుముందు గంభీర్పూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యపై మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. రోజుల తరబడి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకుని కాలనీకి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

## డెంగ్యూ నివారణ పరీక్షలు



అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 05 ( వుదయం ప్రతినిధి )

సీజనల్ మార్పుల నేపథ్యంలో గ్రామంలో డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర జ్వరాలు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉప సర్పంచ్ దోర్నాల యాదగిరి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంతూరి బాబు అన్నారు.సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో ని డెంగ్యూ నివారణ కోసం ఏఎన్ఎం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ దోర్నాల యాదగిరి మాట్లాడుతూ ..ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. జ్వరం, ఒంటినొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఏఎన్ఎంను సంప్రదించి ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులను కోరారు.

# పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ స్వామి చేయూత

- గాజులపల్లి పాఠశాలలో బోర్ మరమ్మతుకు స్వయంగా శ్రమించిన గ్రామ ప్రథమ పౌరుడు

దౌల్తాబాద్, అక్టోబరు 5(వుదయం):

గ్రామాభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి కూడా ప్రాధాన్యమిస్తూ గాజులపల్లి గ్రామ సర్పంచ్ పంజ స్వామి తనవంతు సహకారం అందిస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోలిస్తే అభివృద్ధి పనుల్లో ముందంజలో ఉండటంతోపాటు, స్థానిక పాఠశాల సమస్యల పరిష్కారానికి సైతం చొరవ చూపుతున్నారు.గాజులపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తిందని ప్రధానోపాధ్యాయుడు త్యాగరాజు సర్పంచ్ పంజ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బోర్ మరమ్మతు పనులను చేపట్టారు. గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్నప్పటికీ, కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా తల్లిదండ్రులతో కలిసి స్వయంగా బోర్ మరమ్మతు పనుల్లో పాల్గొని శ్రమించారు. దీంతో సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.పాత బోర్ స్థానంలో కొత్త బోర్ మోటారు ఏర్పాటు చేయించేందుకు కూడా సర్పంచ్ స్వామి చర్యలు చేపట్టారు. విద్యార్థులకు నీటి ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా ఈ



పనులు చేపట్టడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా గతంలోనూ పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ పంజ స్వామి తనవంతు సహకారం అందించారు. పాఠశాల ఆవరణలో రంగురంగుల బొమ్మలతో ఆకర్షణీయమైన పెయింటింగ్ వేయించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న సర్పంచ్ పంజ స్వామికి విద్యార్థుల తరఫున, పాఠశాల బృందం తరఫున ప్రధానోపాధ్యాయుడు త్యాగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రామాలయ భూములను రక్షించండి
# ప్రజావాణిలో ఫిర్యాదు.!



- గుడి మాన్యం భూములను సర్వే చేయాలని వినతి
- 5 ఎకరాల 12 గుంటల భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడండి

అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 05 ( వుదయం ప్రతినిధి )

పోతరెడ్డిపేట రామాలయ దేవస్థానానికి సంబంధించిన గుడి మాన్యం భూములను సర్వే చేసి, సరిహద్దులను కాపాడాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. పోతరెడ్డిపేట గ్రామంలోని రామాలయ దేవస్థానానికి సర్వే నంబర్లు 1472, 1756, 1528/, 1525/అ, పరిధిలో సుమారు 5 ఎకరాల 12 గుంటల విస్తీర్ణంలో గుడి మాన్యం భూములు ఉన్నట్లు తమ వద్ద ఉన్న రికార్డుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం సదరు దేవస్థాన భూములకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన హద్దులు లేకపోవడంతో, భూముల స్థితిగతులు సరిగ్గా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల భవిష్యత్తులో ఈ ఆలయ భూములు అన్యాక్రాంతానికి గురయ్యే ప్రమాదం ఉందని భక్తులు, గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.దేవాలయ భూముల సంరక్షణ కోసం తక్షణమే సంబంధిత రెవెన్యూ అధికారులు,సర్వేయర్ ద్వారా సమగ్ర భూ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం రామాలయ భూములను గుర్తించి, ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. సర్వే అనంతరం ఆ వివరాలను అధికారికంగా నమోదు చేసి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి, వెంటనే సర్వేయర్‌ను నియమించి ఆలయ భూములను పరిరక్షించాలని గ్రామస్థులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ దమ్మగౌని స్వామి గౌడ్, క్యాషియర్ ఎర్రోళ్ల రాజు పోతరెడ్డిపేట గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి సభకు భారీగా తరలిన ఆర్టీసీ కార్మికులు

- ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం: టీడబ్ల్యూయూ రాష్ట్ర నేత నాగయ్య గౌడ్

అచ్చంపేట, అక్టోబరు 5 (వుదయం ప్రతినిధి):




అచ్చంపేట నియోజకవర్గంలోని ఆర్టీసీ డిపోకు చెందిన టీడబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆర్టీసీ కార్మికులు సోమవారం అచ్చంపేట బస్టాండ్ నుంచి వనపర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు తరలివెళ్లారు.ఈ సందర్భంగా టీడబ్ల్యూయూ రాష్ట్ర నేత నాగయ్య గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఆర్టీసీ కార్మికుల ఎన్నికలపై నిషేధం విధించి, వారి సమస్యలను పట్టించుకోలేదని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు కార్మికుల సమస్యల పరిష్కారం, ఎన్నికల పునరుద్ధరణ, ఆర్టీసీ విలీనం వంటి అంశాలపై హామీలు ఇచ్చిందన్నారు. ఇటీవల జరిగిన సమ్మె అనంతరం పీఆర్‌సీతో పాటు గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులు జరగడంతో ప్రభుత్వంపై కార్మికుల్లో విశ్వాసం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు వెంకటయ్య, ఎస్.ఆర్. నారాయణ, ఇంద్రమ్మ, భాగ్యమ్మ, చంద్రయ్య, ఎం. నారాయణ, అంబయ్య, కరీం సభకు తరలివెళ్లారు.

# పెండింగ్ ఆర్జీలపై కొరడా!

- ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం

గద్వాల, అక్టోబర్ 05 (వుదయం బ్యూరో)

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండిం గ్‌లో ఉంచితే సహించేది లేదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే ప్రతి ఆర్జీని అధికారులు బాధ్యతగా తీసుకుని, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగ రావుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.94 ఆర్జీలు పెండింగ్ జిల్లా ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 94 ఆర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. ఈ వారం నిర్వహించిన ప్రజావాణిలో 44 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నందున, వారి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఆర్జీ పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయిలోనూ సమీక్షలు మండల స్థాయిలో ప్రజావాణికి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.



సంబంధిత శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి పెండింగ్ ఫిర్యాదులపై కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. ప్రజావాణి ఉద్దేశం ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడమేనని, ఆర్జీలను కేవలం స్వీకరించి వదిలేయకుండా వాటి పరిష్కారం వరకు అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో
# ఉద్యమాన్ని ఆపలేరు



- బీఆర్ఎస్వీ నేత దారమేని గణేష్

కల్వకుర్తి, అక్టోబరు 5 (వుదయం ప్రతినిధి):

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమేని గణేష్ అన్నారు.సోమవారం 2 లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన ఆయనను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని నిలువరించలేరని, భారత రాష్ట్ర సమితికి ఈ అరెస్టులు కొత్తేమీ కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసులు, అరెస్టులు, లాఠీ దెబ్బలు తిన్నా నిరంతరం ఉద్యమాన్ని కొనసాగించామని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు, యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీల హామీలను నెరవేర్చకపోతే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

# నీటి చుక్కను ఒడిసిపట్టాలి.. భవిష్యత్తును కాపాడాలి

- ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జల సంరక్షణకు పెద్దపీట
- వసతి గృహాలు, గురుకులాలు, ఆసుపత్రులపై నిరంతర పర్యవేక్షణ
- శాఖల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల, అక్టోబర్ 05 (వుదయం బ్యూరో)



ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ.. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వీఎంజీ రాంజీ పథకం కింద జల సంరక్షణ పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని సూచిం చారు. నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం జల జీవన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరేలా పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోందని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రస్తుత అవసరాలను తీర్చడమే కాకుండా రానున్న తరాలను దృష్టిలో ఉంచుకుని జల వనరుల పరిరక్షణకు దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. వసతి గృహాలపై నిఘాజిల్లాలోని వసతి గృహాలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర పాఠశాలలు, ఆసుపత్రులపై సంబంధిత శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా సంస్థల్లో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించి సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పనుల పురోగతిపై నివేదికలు పీఎండీకే వై కింద జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశం చారు. ప్రతి శాఖ తన పరిధిలో చేపడు తున్న పనుల పురోగతి, నాణ్యత, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార చర్యలకు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో అందజేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు విస్తృతంగా పర్యటిస్తూ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై అభిమానం చాటుకున్న కమ్మెట చెన్నారెడ్డి



వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 5)

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు పటాన్‌చెరు బీఆర్ఎస్వీ అధ్యక్షుడు కమ్మెట చెన్నారెడ్డి. గత నెల ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ఒడిశాలోని పూరీ బీచ్‌లో ప్రత్యేకంగా మట్టితో తయారు చేయించిన జిమ్మెర్ గుర్తు ఉన్న ఫొటోను కానుకగా అందించిన చెన్నారెడ్డి, సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అదే జ్ఞాపకాన్ని చిత్రపటంగా మరోసారి అందజేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కమ్మెట చెన్నారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ యువ నాయకులు, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను
# సత్వరం పరిష్కరించాలి




మహబూబ్ నగర్

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.
- ప్రజావాణికి 100 పిర్యాదుల స్వీకరణ

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.

ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 100 వినతులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్.పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- పశువుల శాంపిల్స్ సేకరణ, రవాణాకు ప్రత్యేక వాహనం ప్రారంభం
- వేగవంతమైన ల్యాబ్ పరీక్షలతో సకాలంలో వ్యాధి నిర్ధారణే లక్ష్యం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్



గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన పాడి రైతులకు అండగా నిలుస్తూ, మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ, శాంపిల్స్ సేకరణ, సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాహనం (TS09UC4288)ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి యెన్నం శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు అకస్మాత్తుగా వ్యాధులు సోకినప్పుడు వ్యాధి నిర్ధారణలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక వాహనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో పశువుల నుంచి రక్తం, మూత్రం, ఇతర నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, అవి పాడవకుండా ప్రయోగశాలకు తరలించడం ద్వారా సకాలంలో వ్యాధులను గుర్తించి, తక్షణ చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పశువుల ఆరోగ్య పరిరక్షణకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను ప్రయోగశాలలో వేగవంతంగా పరీక్షించి, పరీక్షా ఫలితాలను వెంటనే సంబంధిత పశువైద్యులకు చేరవేసేలా సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనివల్ల పశువులకు సకాలంలో సరైన చికిత్స అందించడంతో పాటు అంటువ్యాధులు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు వీలవుతుందని అన్నారు. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, , జిల్లా గొర్రెల కాపరులు సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, ల్యాబ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## చిన్నంబావి మండల కేంద్రం లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

- మండల కేంద్రం లో మత్తు పదార్థాల కట్టడికి పోలీసుల చర్యలు

చిన్నంబావి మండలం 05 వుదయం రిపోర్టర్



చిన్నంబావి మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు చిన్నంబావి పోలీసులు వనపర్తి స్పెషల్ బ్రాంచ్ పోలీస్ లు సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో మండలంలోని పలు షాపులలో, హోటల్ లలో, వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. రహదారి వెంట ఉన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఆరా తీశారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై, అనుమాన వ్యక్తులు సంచారం పై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు సూచించారు. తనిఖీల్లో స్పెషల్ బ్రాంచ్ అధికారి గోపాల్, శేఖర్, కర్ణాకర్‌తో పాటు చిన్నంబావి మండలం పోలీసులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## పి.ఆర్. గౌతమ్ రాజును ఈ.సి మెంబర్ గా నియమితం



**ముషీరాబాద్, అక్టోబర్ 5(వుదయం)**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ (ధార్మిక)లో పి.ఆర్. గౌతమ్ రాజును శుక్రవారం రోజున ఈ .సి మెంబర్‌గా నియమిస్తూ పార్టీ ఎండోమెంట్ సెల్ తెలంగాణ నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్ సెంట్రల్ జిల్లాపరిధిలోని ఖైరతాబాద్, నాంపల్లి ప్రాంతాలకు సంబంధించిన బాధ్యతలను ఆయనకు ఎండోమెంట్ సెల్ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, ప్రజల సమస్యలపై పనిచేస్తూ సంస్థాగతంగా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని లేఖలో సూచించారు.

ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన శ్రీ పి.ఆర్. గౌతమ్ రాజుకు అభినందనలు తెలిపారు.

## సేవా కార్యక్రమం వెనుక భగవత్ సంకల్పం

- **పేద కుటుంబాలు, అనాథాశ్రమాలు, వేద పాఠశాలలకు 3,200 కిలోల బియ్యం పంపిణీ**
- **13 మంది పేద మెరిట్ విద్యార్థులకు రూ.45 వేల ఆర్థిక సహాయం**

**ముషీరాబాద్, అక్టోబర్ 05(వుదయం)**



గాంధీనగర్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో శ్రీ శారద వాణీ ఆధ్వర్యంలో 18వ సేవా కార్యక్రమాన్ని ఎర్రమిల్లి శిరీష నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.

**ఈ సందర్భంగా పేద కుటుంబాలు, అనాథాశ్రమాలు, వేద పాఠశాలలకు 3,200 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు.**

అలాగే మెరిట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 13 మంది పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఎర్రమిల్లి శిరీష మాట్లాడుతూ..

**సమాజంలోని నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో**

సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.

**"ఈ సేవా కార్యక్రమం వెనుక భగవత్ సంకల్పం ఉంది.**

సేవ చేయడానికి అవకాశం రావడం కూడా ఒక అదృష్టమే" అని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అవసరమైన వారికి బియ్యం, విద్యా సహాయం అందిస్తున్నామని తెలిపారు.

**పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మెరిట్ విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.**

ఈ సేవా కార్యక్రమం తన ఒక్కరి కృషితో కాకుండా, తనతో పాటు అనేక మంది దాతలు, సేవాభిమానుల సహకారంతో కొనసాగుతోందని ఎర్రమిల్లి శిరీష తెలిపారు.

**భవిష్యత్తులోనూ మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టి సమాజంలోని పేదలు, విద్యార్థులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.**

కార్యక్రమంలో శిరీష,రాఘవేంద్ర,పద్మిని, వల్లి, కాంతి, వర్ష, విజయ, పూనమ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు...

## శంకర్ పల్లి ప్రజావాణిలో 8 దరఖాస్తులు..



**ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్..**

**శంకర్ పల్లి అక్టోబర్ 05 (వుదయం)**

శంకర్ పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఎనిమిది దరఖాస్తులు వచ్చాయని స్థానిక

**ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు.**

ఆరు దరఖాస్తులు రెవెన్యూ కు సంబంధించినవి రాగా, ఒకటి ఆర్ అండ్ బి శాఖ, మరొకటి మున్సిపాలిటీకి సంబంధించి దరఖాస్తు వచ్చిందని చెప్పారు.

**ఈ దరఖాస్తులు సంబంధిత అధికారులకు ఆన్లైన్లో పంపడం జరిగిందన్నారు.**

ఈ ప్రజావాణి కార్యక్రమంలో 19 మంది వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరయ్యారని తెలిపారు.

## ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించండి



**మేడ్చల్**

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఐఏఎస్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే

**పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని**

మను చౌదరి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 110 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల**

నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

**స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు**

చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హౌస్ ఫెడ్ నూతన చైర్మన్

- **వైస్ చైర్మన్‌గా బ్రహ్మాండబేరి గోపరాజు ఎన్నిక**
- **ఫెడరేషన్ బలోపేతమే లక్ష్యం.. సొసైటీల అభివృద్ధికి సమష్టి కృషి**
- **హౌసింగ్ సొసైటీలకు రుణ సదుపాయాలు సులభతరం చేస్తాం**

**ముషీరాబాద్, అక్టోబర్ 5 (వుదయం)**

తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ (తెలంగాణ హౌస్ ఫెడ్) నూతన చైర్మన్‌గా ముదిగంటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బ్రహ్మాండబేరి గోపరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన

**తెలంగాణ హౌస్ ఫెడ్ డైరెక్టర్ల ఎన్నికల్లో విజయం సాధించిన డైరెక్టర్లు సోమవారం సమావేశమై నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.**

డైరెక్టర్లు పట్లోళ్ల శంకర్ రెడ్డి, పామర్తి అంకినేడు ప్రసాద్ ఎన్నికల ప్రక్రియకు మద్దతు తెలిపారు.ఎన్నికల అనంతరం నూతన చైర్మన్ ముదిగంటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు తెలంగాణ హౌస్ ఫెడ్ ను ఆర్థికంగా,

**పరిపాలనాపరంగా మరింత పటిష్టం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.**

ఫెడరేషన్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రభుత్వ సహకారంతో అవసరమైన నిధులను సమకూర్చుకుని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.హౌసింగ్ సొసైటీలకు అవసరమైన రుణ సదుపాయాలను మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రుణ ప్రక్రియను సులభతరం చేసి వేగవంతం చేస్తామని తెలిపారు.

**ప్రతి సొసైటీ సభ్యుడికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే తెలంగాణ**

హౌస్ ఫెడ్ లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.సొసైటీలు కూడా ఫెడరేషన్ నుంచి పొందుతున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తూ ఫెడరేషన్ ఆర్థిక బలోపేతానికి సహకరించాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. సొసైటీలు బలోపేతం అయితేనే ఫెడరేషన్ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.





**గోపరాజునూతన వైస్ చైర్మన్ బ్రహ్మాండబేరి గోపరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్న డైరెక్టర్లకు,**

ఎన్నికకు సహకరించిన రాష్ట్రంలోని హౌసింగ్ సొసైటీల అధ్యక్షులు, ప్రతినిధులు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ ముదిగంటి శ్రీనివాస్ రెడ్డితో పాటు డైరెక్టర్లందరితో సమన్వయంతో పనిచేస్తూ తెలంగాణ హౌస్ ఫెడ్ ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల సమస్యలను గుర్తించి వాటిలకు రుణ సదుపాయాలను మరింత సులభతరం చేయడంతో పాటు, సొసైటీల కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు ఫెడరేషన్ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని గోపరాజు పేర్కొన్నారు.

**ప్రతి సభ్యుడి సొంతింటి కల నెరవేరేలా ఫెడరేషన్‌ను మరింత ప్రజలకు చేరువ చేస్తామని అన్నారు.**

ప్రభుత్వ సహకారంతో ఫెడరేషన్‌కు అవసరమైన వనరులను సమకూర్చుకుని, రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ సొసైటీలను బలోపేతం చేసేందుకు నూతన పాలకవర్గం, డైరెక్టర్లు సమష్టిగా పనిచేస్తారని తెలిపారు.

**ఎన్నికల ప్రక్రియను నిర్వహించిన ఎన్నికల అధికారి చంద్రమోహన్ రెడ్డి నూతన చైర్మన్ ముదిగంటి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ బ్రహ్మాండబేరి గోపరాజులకు నియామక పత్రాలను అందజేశారు.**

ఈ సందర్భంగా తెలంగాణ ఎండీ జి. లక్ష్మీభాయి నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందించారు.

**కార్యక్రమంలో డైరెక్టర్లు పట్లోళ్ల శంకర్ రెడ్డి, పామర్తి అంకినేడు ప్రసాద్, కిషన్‌రావు, రవీందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.**

నూతన పాలకవర్గం ఎన్నికతో తెలంగాణ హౌస్ ఫెడ్ మరింత సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రంలోని కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల అభివృద్ధికి దోహదపడుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.ఇది పేపర్‌లో నేరుగా వేసుకునేలా హెడ్డింగ్‌లు, సబ్ హెడ్డింగ్‌లు, కోట్స్, ముగింపు బలంగా ఉండేలా కుదిర్చాను.

## విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కేటాయింపు

- **ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి..**
- **కొల్లూరులో స్థానిక అవసరాలకే మిగులు భూమి వినియోగించాలని**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశం**

**పటాన్చెరు (వుదయం):**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.సోమవారం సాయంత్రం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కేటాయింపు..నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు.స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ తరఫున పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని వివరించారు.ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలుఇస్నాపూర్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కొల్లూరు భూములు స్థానిక అవసరాలకేతెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు.సర్వే నంబర్ 203లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొంటూ, ఆ భూమిని ఇతర అవసరాలకు కేటాయించే బదులు స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.ముఖ్యంగా కొల్లూరులో మోడల్ మార్కెట్ ఏర్పాటు, హిందూ-ముస్లిం-క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు వంటి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూమిని వినియోగించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలిప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై కూడా సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## హాజరు వేయని టీచర్లకు నోటీసులు

**రంగారెడ్డి జిల్లా**

రంగారెడ్డి జిల్లాలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు నమోదును పర్యవేక్షిస్తున్న ఎఫ్ఆర్ఎస్ (FRS) విధానంలో గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని 68 మంది ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎస్. వెంకటేశ్వర్లు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ, గత నెల రోజులుగా హాజరు నమోదు చేయని ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. హాజరు నమోదులో నిర్లక్ష్యం వహించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు సమర్పించే వివరణలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.FRS హాజరు నమోదును ఆధారంగా చేసుకుని ఉపాధ్యాయుల జీతాల విడుదల చేపట్టాలని పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, బోధనా ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని డీఈఓ స్పష్టం చేశారు.

FRS హాజరు నమోదులో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు విధులకు సమయానికి హాజరై, తప్పనిసరిగా FRSలో హాజరు నమోదు చేయాలని డీఈఓ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు. పాఠశాలల్లో క్రమశిక్షణ, సమయపాలన, బోధనా నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు లేకుండా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఇంద్రేశంలో వారాహి బ్యాంకెట్ హాల్



- **శుభాకాంక్షలు తెలిపిన మెదక్ ఎంపీ**

**పటాన్చెరు (వుదయం):**

పటాన్చెరు మండలంలోని ఇంద్రేశంలో మకుట అరుణలో నూతనంగా నిర్మించిన శ్రీ వారాహి బ్యాంకెట్ హాల్‌ను మెదక్ పార్లమెంట్

**సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఘనంగా ప్రారంభించారు.**

వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని బ్యాంకెట్ హాల్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా

**ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంద్రేశం**

ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శ్రీ వారాహి బ్యాంకెట్ హాల్ స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వివాహాలు, శుభకార్యాలు, సామాజిక మరియు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇది ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**ఇలాంటి సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడటమే** కాకుండా ప్రజల మధ్య సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,

**గ్రామ పెద్దలు మరియు ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.**

శ్రీ వారాహి బ్యాంకెట్ హాల్ ప్రారంభంతో ఇంద్రేశం ప్రాంత ప్రజలకు మరో ఆధునిక సౌకర్యవంతమైన శుభకార్యాల వేదిక అందుబాటులోకి వచ్చినట్లు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చికిత్స పొందుతున్న కమ్లి నీ పరామర్శ



- **రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**వెల్దండ అక్టోబర్ 5 ,(వు దయం)**

మండల పరిధిలోని నారాయణపూర్ తండాకు చెందిన బాణావత్ కమ్లి గుండెపోటుతో బాధపడుతూ మన్నెగూడ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి గారు ర్శించారు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5,000/రూపాయలు భర్త శంకర్ నాయక్ కి అందజేశారు నారాయణపూర్ గ్రామ మాజీ సర్పంచ్ అంజి నాయక్, శ్రీను, బర్కం గణేష్,మణిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్లకు ప్రభుత్వ స్థలాలు కేటాయించండి

- **ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి..**
- **కొల్లూరులో స్థానిక అవసరాలకే మిగులు భూమి వినియోగించాలని కోరిన**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశం**

**పటాన్చెరు (వుదయం):**



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.సోమవారం సాయంత్రం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల

**సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన**

పలు కీలక అంశాలపై చర్చించారు.విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కేటాయింపు..నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, రియల్ ఎస్టేట్ అభివృద్ధి నేపథ్యంలో ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరారు.స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ తరఫున పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని వివరించారు.**

ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలుఇస్నాపూర్ పరిధిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కొల్లూరు భూములు స్థానిక అవసరాలకేతెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్**

ఇళ్ల కోసం కేటాయించిన భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు.సర్వే నంబర్ 203లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొంటూ, ఆ భూమిని ఇతర అవసరాలకు కేటాయించే బదులు స్థానిక ప్రజల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.ముఖ్యంగా కొల్లూరులో మోడల్ మార్కెట్ ఏర్పాటు, హిందూ-ముస్లిం-క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు వంటి ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూమిని వినియోగించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

**అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలిప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా**

పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై కూడా సానుకూలంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం:

**కలెక్టర్ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన**

అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పాస్‌పోర్ట్ పోయింది

నాగారం గ్రామానికి చెందిన రేణు సంజీవ్ పాస్‌పోర్ట్ సెప్టెంబర్ 28న నాగారం నుంచి ధర్మపురికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో పోయింది. పాస్‌పోర్ట్ నంబర్ S1093711.పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికితే 7416031265 నంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వా లని కోరారు.పాస్‌పోర్ట్ అందజేసిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

**IN THE COURT OF THE HON'BLE 3rd JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT ,AT HYDERABAD**
**O.S. No. 3044 of 2026**

Betw een :-
Nirmala Devi &4 others. **...PLAINTIFFS**

**And**

1. The Tahsildar (MRO), Nampally Mandal Hyderabad.
2. All Concerned. **...DEFENDANTS**

**NOTICE TO DEFENDANT NO.2**

It is here by informed that Nirmala Devi W/o Late Narayan Singh Thakur alias Narayan Singgh Thakur and 4 others have filed the above case for declaring them as Legal heirs of **Late Narayan Singh Thakur alias Narayan Singgh Thakur** .The above case stands posted on 27.10.2026 for further hearing. If any body is having any dispute/objections they may appear before the above court. i.e., THE Hon'ble 3rd Junior Civil Judge Court, City Civil Court ,At Hyderabad and submit their grievances.

**\\ by order of the Court//**
**Sd/-**
**N.Vasudeva Rao**
**Advocate**
**Counsel for the Plaintiffs**
**Plot No.A-69,Street No.3**
**Raghavendra Colony,**
**Kondapur, Hyderabad-84.**
**Cell no. 98481 28702.**

**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM- II ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTAT HYDERABAD.**
**O.P. No. 2478 of 2025**

Betw een :-
Pasham Jaipal Reddy, & another **... Petitioners**

**And**

1. Maddula Pulla Reddy.
2. Maddula Hanuman Reddy.
3. Cholamandalam MS General Insurance Company Ltd. **... Respondents**

TO,
(R-1) Maddula Pulla Reddy, S/o M. Chinna Koti Reddy, Age: Major, Occu: Driver, R/o H. No. 2-20-8/27/1,Adarshnager Colony, Uppal, Medchel.(Driver of Motor Car No. TS 07 JN 5505)

Take notice that the above Petitioners have filed the above case for compensation, against you Respondent No. 1, and the Respondent Nos. 2 & 3, for the death of wife of the petitioner No. 1, in a road accident that occurred on 16-09- 2025. The above case is posted to 05-11-2026, for your appearance. Therefore, you are hereby informed and required to appear before the Hon'ble court On 05-11- 2026, at about 10-30 AM, by person or through pleader, failing which orders will be passed in your absence.

**// BY ORDER OF THE HON'BLE COURT //**
**Gulam Amjad**
**Advocate for Petitioner,**
**F. No. 405, Safa Tower, Tolichowki, Hyderabad. Cell No. 9440423753.UIA**
**Email: customercare@we ne No.: 033-71500618, arlal Nehru Road,**

**IN THE COURT OF THE HON'BLE. PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT KUKUTPALLY/ RR DIST**
**O. S No. 4028 Of 2026**

**Between :**
1.Smt DASARI RAJULA SHIRISHA, W/O LATE DASARI RAJULA SHIVAKUMAR, Age 30 Years, Occ House wife
2.DASARI RAJULA PRASHANTH, S/O LATE DASARI RAJULA SHIVA KUMAR, Age 11 Yrs,
3. DASARI RAJULA CHARITHA, D/O LATE DASARI RAJULA SHIVA KUMAR, Age 07 Yrs 2&3,are Minors, Rep by Mother, Plaintiff No.1,
All R/O HNO 6-47/15, Pent house, Road No.6, Chandanagar, RANGAREDDY Dist, TELANGANA-500050. **......Plaintiffs**

**AND**

1.THE TEHSILDAR SERILINGAMPALLY MANDAL.
2.ALL CONCERNED **...... Defendants**

**PUBLIC NOTICE**

To
All Concerned
This is to inform to general public that the Plaintiffs have filled suit for Declaration to declare the as Legal heir of deceased Person LATE DASARI SHIVA KUMAR S/O DASARI BALA SWAMY, died on. 26 th DECEMBER 2022, As such general public are hereby informed you that if any body having any objection kindly appear before the above Hon'ble Court on 29-10-2026,at 10.30 A.M either in person or through Advocate, Failing which matter will be decided as per law. Hence this notice.

**// BY ORDER OF THE COURT//**
**Sd/-**
**MOHD HAMEED KHAN**
**M B SANTOSH KUMAR**
**M S ROHITH KUMAR,**
**Advocates**
**Office: 3-41-1, Ashwini nagar Colony ,West Marred pally, Secunderabad 500026,**
**CELL NO 9391358882**



" భారత అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు కీలక దశకు చేరుకున్నాయి. ఇరుదేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నప్పటికీ మరిన్ని రాయితీలు ఇవ్వడం లేదా తీసుకోవడం కష్టంగా మారింది. ఇరుపక్షాల ఈ చర్చల్లో కీలక స్థాయికి చేరుకున్నాయి. భారత్ అమెరికా ఒప్పందం అత్యంత కఠినంగా, విస్తృతంగా చర్చించిన ఒప్పందం. ఇంకా వరుసైపులా చర్చలకు అవకాశం ఉంటే ముందుకు సాగుతాయి. గతంలో టారిఫ్‌లు వాణిజ్య చర్చల్లో ఒక సాధంగా ఉండేవి. ఇప్పుడు అవి ఆయుధంగా మారుతున్నాయి. వాణిజ్య అసమతుల్యతలను సుంకాల ద్వారా ఒత్తిడికి గురి చేయడం కంటే మార్కెట్ అవకాశాలు, పరస్పర రాయితీలపై చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. "

**- నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి**

## వే'మన' పద్యం

మగని కాలమందు మగువ కష్టించిన
సుతుల కాలమందు సుఖమునందు
కలిమిలేమి రెండు గల వెంతవారికీ
విశ్వదాభిరామ వినురవేమ



# సంపాదకీయం

## నిరసనలను అణచివేత అప్రజాస్వామికం

ప్రజాస్వామ్యంలో ప్రజల అసంతృప్తికి, డిమాండ్లకు, ఆవేదనకు శాంతియుత నిరసన ఒక రాజ్యాంగబద్ధమైన మార్గం. ఓటు వేసిన తర్వాత ప్రజల పాత్ర ముగిసిపోదు. పాలకుల విధానాలను ప్రశ్నించడం, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో అంతర్భాగమే. అయితే భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, అధికారంలో ఏ పార్టీ ఉన్నా నిరసనల విషయంలో ఒకే తరహా ధోరణి కనిపిస్తుంటుంది. ప్రజల ఆందోళనలకు వెంటనే స్పందించి పరిష్కారం చూపడం కంటే, సమయం గడిచేకొద్దీ ఉద్యమం నీరుగారిపోతుందని భావించి కాలయాపన చేయడం ఎక్కువగా కనిపిస్తుంది. అరెస్టులు, ఆంక్షలు, పరిపాలనా నియంత్రణలు వంటి చర్యలతో ఉద్యమాన్ని అదుపులోకి తీసుకురావచ్చని ప్రభుత్వాలు భావిస్తాయి. కానీ సమస్యకు పరిష్కారం చూపకుండా ఉద్యమాన్ని అణచివేయడం తాత్కాలిక ఉపశమనాన్ని ఇవ్వవచ్చేమో గానీ, ప్రజల అసంతృప్తిని శాశ్వతంగా తొలగించదు. మణిపూర్‌కు చెందిన ఐరమ్ షర్మిలా చేపట్టిన దీర్ఘకాల నిరాహార దీక్ష ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం రద్దు కోసం ఆమె పదహారేళ్లపాటు పోరాడారు. ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. ఆమె డిమాండ్‌కు తక్షణ పరిష్కారం లభించకపోయినా, ఆ ఉద్యమం దేశవ్యాప్తంగా ఒక కీలక రాజకీయ, మానవ హక్కుల చర్చకు దారితీసింది. లద్దాఖ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఆందోళనలు కూడా ఇదే ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బాధ్యత కేవలం శాంతిభద్రతలను కాపాడటంతోనే ముగుస్తుందా? లేక ప్రజలతో మాట్లాడి, వారి ఆందోళనల వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడమూ ప్రభుత్వ బాధ్యతేనా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రభుత్వానికి చట్టవ్యవస్థను, ప్రజా శాంతిని కాపాడే బాధ్యత ఎంత ముఖ్యమో, శాంతియుతంగా నిరసన తెలిపే పౌరుల హక్కును గౌరవించడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటి మధ్య సమతుల్యత కోల్పోతే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది. బలప్రయోగంతో ఒక నిరసనను తాత్కాలికంగా అణచవచ్చు. కానీ దాని వెనుక ఉన్న సమస్యను మాత్రం అణచలేరు. రైతు ఉద్యమం ఇందుకు మరో స్పష్టమైన ఉదాహరణ. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మదు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఆందోళన తొలిదశలో పెద్దగా పట్టించుకోబడలేదు. కానీ కాలక్రమంలో అది దేశవ్యాప్తంగా విస్తరించింది. సుదీర్ఘంగా కొనసాగిన ఉద్యమం చివరకు ఆ మదు చట్టాలను వెనక్కి తీసుకునే పరిస్థితికి ప్రభుత్వాన్ని తెచ్చింది.

ప్రజాస్వామ్యంలో నిరంతర, శాంతియుత ప్రజా ఉద్యమాలకు ఉండే ప్రభావాన్ని ఈ పరిణామం స్పష్టం చేసింది. అయితే దీనికి మరో కోణం కూడా ఉంది. ప్రతి నిరసన న్యాయమైనదేనా? ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే అంగీకరించాలా? అనేది కూడా సముచితమైన ప్రశ్నే. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విలువ. కానీ విధాన నిర్ణయాలు చట్టపరమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియల ద్వారానే జరగాలి. అందుకే పరిష్కారం నిరసనలను అణచడంలో లేదు, ప్రతి డిమాండ్‌కు తలొగ్గడంలోనూ లేదు. సంభాషణలో ఉంది. సోషల్ మీడియా విస్తరణతో ఈ పరిస్థితి మరింత మారింది. గతంలో ఒక ప్రాంతానికే పరిమితమైన ఉద్యమం ఇప్పుడు కొన్ని గంటల్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రజల స్పందన ఉద్యమాలకు కొత్త శక్తిని ఇస్తున్నాయి. అందువల్ల కేవలం పోలీసు చర్యలతో ప్రజా ఉద్యమాలను నియంత్రించాలనే పాత వ్యూహం ఇప్పుడు అంత సులభంగా పనిచేయదు. 'కాలం గడిస్తే ఉద్యమం చల్లారిపోతుంది' అనే ప్రభుత్వ అంచనా ప్రతిసారీ నిజం కావాలని అవసరం లేదు. సమస్య ప్రజల జీవితాలకు సంబంధించినదైతే, నాయకత్వంపై నమ్మకం ఉంటే, ఉద్యమం మరింత బలపడవచ్చు. అందుకే పాలకులు కాలయాపన కంటే సంప్రదింపులు, పారదర్శకత, స్పష్టమైన హామీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను కేవలం రాజకీయ లాభాల కోసం ఉపయోగించకుండా, వాటికి పరిష్కారం లభించేలా ప్రభుత్వంపై నిర్మాణాత్మక ఒత్తిడి తీసుకురావాలి. ప్రతి నిరసనను ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం ఎంత తప్పో, ప్రతి విమర్శను దేశద్రోహంగా లేదా విదేశీ కుట్రగా చిత్రీకరించడం కూడా అంతే ప్రమాదకరం. విమర్శను ఎదుర్కొనే సామర్థ్యం, భిన్నాభిప్రాయాలను గౌరవించే సంస్కృతి ప్రజాస్వామ్యానికి ప్రాణం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు సాగిన ఉద్యమాలు ఒక మౌలిక సత్యాన్ని గుర్తుచేస్తున్నాయి: అధికారాలు శాశ్వతం కావు, ప్రజల ఆకాంక్షలు మాత్రమే నిరంతరం ఉంటాయి. నిరసనలను అణచివేయడం ద్వారా సమస్యలు ముగిసిపోవు. ప్రజల గొంతును వినడం, వారి ఆందోళనలకు అర్థం చేసుకోవడం, సాధ్యమైన పరిష్కారాలను చూపించడం ద్వారానే ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వం, ప్రతిపక్షం, ప్రజలు ముగ్గురూ సంభాషణను ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా భావించినప్పుడే విభేదాలు ఘర్షణలుగా కాకుండా పరిష్కారాలుగా మారతాయి.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయ పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఎన్నికల అధికారా – మోదీ ప్రభుత్వ ఏజంటా !

ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్, ఎన్నికల నిర్వహణ లోనూ, సర్ వెరిఫికేషన్ లోనూ తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ, మోదీ ప్రభుత్వ ప్రయోజనాలే పరమావధి గా పని చేస్తున్నాడు. ముగ్గురు సభ్యులు ఉన్న ఎన్నికల సంఘంలో, మిగతా ఇద్దరు సభ్యులతో చర్చించకుండానే, వారి అభిప్రాయాలు తీసుకోకుండా 'సర్' కార్యక్రమ నిర్వహణలో అనేక ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని, ఎన్నికల్లో మోదీ నాయకత్వాన ఉన్న ఎన్ డి ఏ కు ప్రయోజనం కలిగేలా చేస్తున్నాడు. ఆయన ఏక పక్ష నిర్ణయాలపై కమిటీ లోని మిగతా సభ్యులు సుఖబీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లు 10 నెలల్లో, 14 అంతర్గత అభ్యంతరాలను వ్యక్తం చేశారు.

ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ పై మిగతా ఇద్దరు సభ్యులు చేసిన ప్రధాన ఆరోపణలు ఇలా ఉన్నాయి. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే 'ఫామ్ 6' లో చట్ట సవరణలు లేకుండానే మార్పులు చేశారు అనేది వారి ప్రధాన ఆరోపణ. 18 సంవత్సరాలు దాటిన వారు ఓటు కోసం నమోదు చేసుకునే 'ఫామ్ 6' లో, వారి కుటుంబ సభ్యుల (తల్లిదండ్రుల, తాతల) పేర్లు పాత ఓటర్ల జాబితాలో ఎక్కడ ఉన్నాయో వెతికి, ఆ వివరాలు నమోదు చేయడానికి సాఫ్ట్ వేర్ లో తప్పని చేశారు. కొత్త ఓటర్ల నమోదు చేసుకునే సమయానికి వారి తాతలు చనిపోయే అవకాశం ఉండి వారి ఓట్లు తొలగించబడి ఉంటాయి. అలాంటప్పుడు వారి ఓట్లను ఎలా నమోదు చేయగలుగుతారు. కొందరి తల్లిదండ్రులు కూడా వివిధ కారణాల వల్ల చనిపోయి ఓటర్ల జాబితా నుంచి వారి ఓట్లను తొలగించడం జరుగుతుంది. అలాంటప్పుడు వారి ఓటు ఎక్కడ ఉంది కనుక్కోవడం పెద్ద సమస్య గా మారుతుంది. ఈ నిబంధన అనాథలు మరియు పూర్వీకుల వివరాలు లేని అర్హులైన ఓటర్ల హక్కులను కాలరాయడమేనని ఇద్దరు ఎన్నికల సంఘం సభ్యులు అభ్యంతరం తెలిపారు. అసలు ఈ నిబంధనే పనికిరానిది. భారతీయ పౌరుడై ఉండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటు హక్కు పొందడానికి అర్హుడే. ఆ అర్హతను 'ఫామ్ 6' లో పెట్టిన నిబంధన హరిస్తుంది. యువత మోదీకి వ్యతిరేకంగా ఉన్నారు. వారు ఓటర్లుగా మారితే ఎన్నికల్లో ఎన్ డి ఏ కి వ్యతిరేకంగా ఓటు వేస్తారు అని భావించిన జ్ఞానేష్ కుమార్ కొత్త ఓటర్ల నమోదులో మెలికలు పెట్టి యువత ఓటు హక్కును అడ్డుకుంటున్నాడు.

గతంలో వికేంద్రీకరణ పద్ధతుల్లో నియోజకవర్గ స్థాయిలో ఉండే డేటా బేస్ నియంత్రణ యాక్సెస్ ను ఢిల్లీ లోని కేంద్ర ఐ టీ విభాగానికి పూర్తిగా అప్పగించే మార్పులను జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా తీసుకున్నారు. దీనివల్ల డేటా భద్రత లోపిస్తుందని, ఒకే కేంద్రం నుండి ఓటర్ల జాబితాలను మేనిప్యులేట్ చేసే ప్రమాదం ఉందని కమీషనర్ వివేక్ జోషి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఐ ఐ టీ నిపుణులతో ఎక్స్ టర్నల్ సెక్యూరిటీ ఆడిట్ జరపాలని ఆయన ప్రతిపాదనను సీ ఇ సీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా తోసిపుచ్చారు. గత పద్ధతిలో మార్పుల వల్ల ఎన్నికల్లో అక్రమాలు జరుగుతూ ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు మొదలైన రాష్ట్రాల్లో పోలైన ఓట్ల కంటే లక్షలాది ఓట్లు ఎక్కువగా ఉండటమే అందుకు నిదర్శనం.

దేశ వ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) ప్రక్రియలో, తొలగింపుకి సంబంధించిన గైడ్ లైన్స్ మరియు హ్యాండిల్ చేసే అంతరంగిక సాఫ్ట్ మాడ్యూల్స్ ను ఇద్దరు కమీషనర్లకు తెలియకుండా జ్ఞానేష్ కుమార్ మార్పులు చేశారు. అర్హులైన ఓటర్లు తొలగించినప్పుడు, వాటిని సరిదిద్దుకునేందుకు సాఫ్ట్ వేర్ లో కావాలనే ఆప్షన్లు లేకుండా చేశారని గోవా వంటి రాష్ట్రాలు నుంచి అధికారులు మొర పెట్టుకున్నా ఐ టీ విభాగం సరి చేయ లేదని నివేదికలు పేర్కొంటున్నాయి. దీన్ని గమనిస్తే ఓట్ల తొలగింపు అనేది ప్రతిపక్ష పార్టీల మరియు కొన్న మతాల వారి ఓట్ల తొలగింపు లక్ష్యంగా జ్ఞానేష్ కుమార్ సర్ కార్యక్రమాన్ని చేపట్టాడు.

ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష విధానాలపైన, చర్యలపైనా సుఖ బీర్ సింగ్ సంధు మరియు వివేక్ జోషి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, ఆయన నిర్ణయాలు చట్ట విరుద్ధమని పేర్కొంటూ ఏకంగా క్యాబినెట్ సెక్రటరీ టి వి సోమనాథ్ కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఇద్దరు కమీషనర్లు సంయుక్తంగా ఆ ఏకపక్ష ఉత్తర్వులను క్యాష్ (Nullified) చేశారు. ఎన్నికల ప్రధాన అధికారికి వ్యతిరేకంగా ఇద్దరు ఎన్నికల కమీషనర్లు వ్యక్తం చేసిన అభిప్రాయాలు బయటకు రావడంతో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాతంత్ర వాదులు, బొద్దింకల జనతా పార్టీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధం అవుతున్నారు. ఆయన అనుసరిస్తున్న విధానాల పై దేశ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత దేశ రాజ్యాంగంలోని పతి అంగాన్ని అధికారంలో ఉన్న ప్రభుత్వం, పాలక పార్టీ తమకు అనుకూలంగా మార్చు కొంటూ, వారు చెప్పే 'పవిత్ర' రాజ్యాంగాన్ని వారే వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల సంఘం కూడా రాజ్యాంగంలో ఒక భాగం. రాజ్యాంగం ప్రకారం భారత ఎన్నికల కమీషన్ కు ఒక విధానమంటూ లేదు. 1952 నుంచి ప్రధాన మంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ సిఫార్సుల ఆధారంగా, రాష్ట్రపతి కమీషనర్ ను మాత్రమే నియమిస్తూ వస్తున్నారు. ఆర్టికల్ 342(5) ప్రకారం ఇసి సభ్యుల సర్వీస్ షరతులు మరియు పదవీ కాలం నిబంధనలను నియంత్రించే అధికారం పార్లమెంటుకు ఉంది. రాజ్యాంగ సభల్లో చర్చ జరిగిన తర్వాత ఎన్నికల కమీషన్ నియామకాలు నిర్ణయించే బాధ్యత 1991లో ప్రభుత్వానికి ఏర్పడింది. అప్పటి నుండి ముగ్గురు సభ్యుల ఎన్నికల కమీషన్ ఎన్నిక జరుగుతున్నది. 70 సంవత్సరాల పాటు ఎన్నికల కమీషన్ ను ప్రధాన మంత్రే ఎన్నిక చేసే ప్రక్రియను తప్పుబడుతూ, 2015 నుండి సుప్రీమ్ కోర్టులో ప్రజా ప్రయోజనాల వాజ్యాలు వేస్తూనే ఉన్నారు. వాటి విచారణ సందర్భంగా సుప్రీమ్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అధికార పగ్గాలు అందిపుచ్చుకున్న రాజకీయ వ్యవస్థ ఎన్నికల కమీషన్ పై ఎలాంటి చట్టం చేయకుండా 70 సంవత్సరాలు గడిపిందని, ఇప్పటికైనా మారాలని, అది ఇప్పుడున్న నామ్ కే వాస్తే నియామకంలా, కార్యనిర్వాహక వ్యవస్థ కే కట్టబెట్టేలా ఉంటే ఉపయోగం లేదని, స్పష్టం చేసింది. కమీషన్ సభ్యుల నియామకాన్ని ప్రభుత్వ జోక్యం లేకుండా తప్పనిసరిగా నిరోధించాలని స్పష్టం చేసింది. ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి తో కూడిన సిఫార్సుల ఆధారంగా ఎన్నికల సంఘం సభ్యుల నియామకాలు రాష్ట్రపతి చేపట్టాలని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీమ్ కోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. పార్లమెంటరీ చట్టం అమల్లోకి వచ్చే వరకు ఈ సూత్రం అమల్లో ఉంటుందని పేర్కొంది. సుప్రీమ్ కోర్టు తీర్పు వల్ల ఎన్నికల సంఘాన్ని తన చెప్పు చేతుల్లో ఉంచుకోవడానికి మోదీ ప్రభుత్వానికి అడ్డంకిగా మారింది. ఈ భయంతో హడావుడిగా ఎన్నికల కమీషన్ సభ్యుల నియామక బిల్లును రాజ్యసభ లో ప్రవేశ పెట్టింది. కమీషన్ సభ్యులను నిర్ణయించే వారి నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించడం, ఆయన స్థానంలో ప్రధాని సూచించిన కేంద్ర మంత్రిని ప్రతిపాదించడం జరిగింది. ఇది సుప్రీమ్ కోర్టు అధికారాలను కదించడమే కాకుండా, ముగ్గురు సభ్యుల నియామకంలో ప్రభుత్వం నుంచి ఇద్దరు ఉండటంలో ఎన్నికల సంఘంలో తనకు ఇష్టమైన వారిని నియమించుకునే అధికారం ప్రభుత్వానికి లభిస్తుంది. ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా జ్ఞానేష్ కుమార్ నియామకం అందులో భాగమే. ఫలితంగా ఆయన మోదీకీ అనుకూలంగా ఓట్ల తొలగింపు, ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడుతున్నాడు. ఎన్నికల సంఘాన్ని మోదీ ప్రభుత్వానికి అనుబంధంగా మార్చాడు. భారతదేశం లో అమలు జరుపుతున్న ఎన్నికల విధానమే భూటకంగా మారింది. డబ్బులు, రిగ్గింగ్, గూండాయిజం లేకుండా ఎన్నికల్లో గెలుపు అసాధ్యంగా మారింది. జ్ఞానేష్ కుమార్ లాంటి ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల నిర్వహణను మరింత అపహాస్యం గా మార్చారు. మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నికల నిర్వహణను, ఓట్ల తొలగింపుతో పాటు కొత్తగా ఓట్ల కోసం నమోదు చేసుకునే వారికి అడ్డంకులు సృష్టిస్తున్న ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, తొలగించిన ఓట్లను వెంటనే తిరిగి పునరుద్ధరించాలని, ప్రభుత్వ పాత్ర లేకుండా ఎన్నికల సంఘం సభ్యుల నియామకం జరగాలని అవకతవకలు లేకుండా ఎన్నికల నిర్వహించాలని ప్రజా ఉద్యమం ముందుకు రావాలి.



బొల్లిముంత సాంబశివరావు
సెల్ :9885983526

## నాగోయా నుంచి లాస్ ఏంజెల్స్ వరకు ఆధిపత్యానికి పయనం

నాగోయా ఆసియా క్రీడలు భారత క్రీడా ప్రస్థానానికి ఒకేసారి గర్వాన్నీ, గుణపాఠాన్నీ అందించాయి. చివరి క్షణాల్లో అద్భుతంగా పుంజుకుని పతకాల పట్టికలో నాలుగో స్థానాన్ని నిలబెట్టుకోవడం అభినందనీయం. కానీ నేడు భారత క్రీడల ముందున్న ప్రశ్న ఒక్కటే. ఆసియాలో పోటీ పడే దేశంగా కొనసాగాలా? లేక ఆసియాను నడిపించే క్రీడా శక్తిగా ఎదగాలా? సమాధానం రెండో దానికే అనుకూలంగా ఉండాలి.

> *2026 ఆసియా క్రీడల్లో భారత్ 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు సాధించింది. నాలుగో స్థానం నిలబెట్టుకున్నప్పటికీ, హాంగ్‌జౌలో 2022లో నమోదైన 107 పతకాలు, 28 స్వర్ణాలతో పోలిస్తే ఇది వెనుకంజే. తొలి వారంలో స్వర్ణ పతకాల కోసం భారత్ ఎదురుచూడాల్సి రావడం ఆందోళన కలిగించింది. చివరి దశలో ఆర్చర్లు, బాక్సర్లు, రెజ్లర్లు, హాకీ క్రీడాకారులు పరిస్థితిని చక్కదిద్దారు. కానీ ఒక క్రీడా మహాశక్తి చివరి రోజుల కోసం ఎదురుచూడదు. మొదటి రోజు నుంచే తన ఆధిపత్యాన్ని చాటుతుంది.*

> *అయితే నాగోయా భారత క్రీడల భవిష్యత్తుపై అపారమైన ఆశలను కూడా రేకెత్తించింది. మహిళల హాకీ జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించి స్వర్ణ పతకం సాధించింది. యువ ఆర్చర్ కుమ్‌కుమ్ మొహోద్ కొరియా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ చరిత్ర సృష్టించింది. బాక్సింగ్, రెజ్లింగ్ జట్లు మళ్లీ తమ పాత పటిమను గుర్తుచేశాయి. దృఢత్వ శిక్షణ వంటి అంశాలను జాతీయ ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ వంటి ఒలింపిక్ పతకాల సామర్థ్యం ఉన్న విభాగాలపై మరింత దృష్టి పెట్టాలి.*

2026 ఆసియా క్రీడల్లో భారత్ 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు సాధించింది. నాలుగో స్థానం నిలబెట్టుకున్నప్పటికీ, హాంగ్‌జౌలో 2022లో నమోదైన 107 పతకాలు, 28 స్వర్ణాలతో పోలిస్తే ఇది వెనుకంజే. తొలి వారంలో స్వర్ణ పతకాల కోసం భారత్ ఎదురుచూడాల్సి రావడం ఆందోళన కలిగించింది. చివరి దశలో ఆర్చర్లు, బాక్సర్లు, రెజ్లర్లు, హాకీ క్రీడాకారులు పరిస్థితిని చక్కదిద్దారు. కానీ ఒక క్రీడా మహాశక్తి చివరి రోజుల కోసం ఎదురుచూడదు. మొదటి రోజు నుంచే తన ఆధిపత్యాన్ని చాటుతుంది.

అయితే నాగోయా భారత క్రీడల భవిష్యత్తుపై అపారమైన ఆశలను కూడా రేకెత్తించింది. మహిళల హాకీ జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించి స్వర్ణ పతకం సాధించింది. యువ ఆర్చర్ కుమ్‌కుమ్ మొహోద్ కొరియా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ చరిత్ర సృష్టించింది. బాక్సింగ్, రెజ్లింగ్ జట్లు మళ్లీ తమ పాత పటిమను గుర్తుచేశాయి. ఇవన్నీ భారత క్రీడా సంస్కృతిలో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పులకు నిదర్శనం. అవకాశాలు కల్పిస్తే భారత యువత ప్రపంచాన్ని ఆశ్చర్యపరచగలదని మరోసారి రుజువైంది.

అయితే విజయాల ఆనందంలో వాస్తవాలను మరచిపోవద్దు. నాగోయాలో చైనా ఏకంగా 169 స్వర్ణ పతకాలు సాధించింది. ఆతిథ్య దేశం జపాన్ కూడా స్వర్ణాల సంఖ్యలో భారత్ కంటే ఎంతో ముందంజలో నిలిచింది. ఈ సంఖ్యలు ఒక కఠినమైన నిజాన్ని మన ముందుంచుతున్నాయి. భారత్ ప్రతిభలో వెనుకబడలేదు. కానీ ప్రతిభను పద్ధతిగా స్వర్ణ పతకాలుగా మలిచే వ్యవస్థలో ఇంకా వెనుకబడి ఉంది. ఒక దేశం క్రీడా శక్తిగా ఎదగడానికి కొన్ని స్టార్ క్రీడాకారులు సరిపోరు. గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ వేదిక వరకు నిరంతర ప్రతిభా గొలుసు అవసరం.

గత కొన్నేళ్లుగా ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్, ఆధునిక శిక్షణా కేంద్రాల ద్వారా ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెట్టింది. ఫలితాలు కూడా కనిపిస్తున్నాయి. కానీ ఇకపై లక్ష్యం పతకాల సంఖ్య పెరగడం మాత్రమే కాకూడదు. స్వర్ణ పతకాల వాటా పెరగాలి. ప్రతి జిల్లాలో క్రీడా అకాడమీలు, పాఠశాల స్థాయిలో ప్రతిభ గుర్తింపు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, డేటా అనలిటిక్స్, మానసిక దృఢత్వ శిక్షణ వంటి అంశాలను జాతీయ ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ వంటి ఒలింపిక్ పతకాల సామర్థ్యం ఉన్న విభాగాలపై మరింత దృష్టి పెట్టాలి.

ఇప్పుడు చూపులన్నీ 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌పైనే ఉన్నాయి. ఆసియా క్రీడల్లో నాలుగో స్థానం ఒక విజయమే. కానీ ఒలింపిక్స్‌లో పతకాల పట్టికలో ప్రభావం చూపలేకపోతే ఆసియా స్థాయి విజయాలు అసంపూర్ణంగానే మిగిలిపోతాయి. పారిస్‌లో స్వర్ణ పతకం అందని ద్రాక్షగా మిగిలింది. లాస్ ఏంజెల్స్‌లో కూడా అదే పరిస్థితి పునరావృతమైతే అది వనరుల కొరత కాదు, దూరదృష్టి లోపంగా చరిత్ర గుర్తుంచుకుంటుంది.

నాగోయా మనకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత్‌కు ప్రతిభ ఉంది. సంకల్పం ఉంది. మౌలిక వసతులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పుడు అవసరమైనది స్వర్ణ లక్ష్యంతో కూడిన నిర్దాక్షిణ్యమైన క్రీడా సంస్కృతి. పాల్గొనే దేశం నుంచి పోటీని శాసించే దేశంగా, పోటీని శాసించే దేశం నుంచి స్వర్ణాలను శాసించే దేశంగా భారత్ రూపాంతరం చెందాల్సిన సమయం ఆసన్నమైంది. నాగోయా ఒక అధ్యాయం ముగింపు కాదు. భారత క్రీడా స్వర్ణయుగానికి అది నాంది మాత్రమే.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

# భారతీయ శిక్షాస్మృతి సృష్టికర్త మెకాలే

భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ ఐ పి సి) భారత ప్రభుత్వ ధర్మ శాస్త్రం. భారత దేశంలో నేరాలు చేసిన వారికి దీనిని అనుసరిం చే శిక్ష వేస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ (భారతీయ శిక్షాస్మృతి) 1860 1860 అక్టోబరు 6 నాడు (1860 లో చేసిన 45 వ చట్టం) మొద లైంది. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలు లో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. రన్‌బీర్ పీనల్ కోడ్ (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలు లోకి వచ్చింది. మొట్టమొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమాయిషిలో జరిగింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (జ 1800 అక్టోబరు 25 మరణం 1859 డిసెంబరు 28)). (ఈయనే భారత దేశంలో ఆంగ్ల విద్యా బోధనకు పునాది వేసిన వాడు). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్స రంలో, అమలు లోకి వచ్చింది. నాటి నుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, సముద్రాలలో, సముద్ర గర్భాలలో, రోదసీ లోను, ప్రయాణ వాహనాల లోను, న్యాయపరంగా, వైద్యరంగం లోను, ఉద్యోగ రంగం లోను, బాంక్ లావాదేవీలు (ఏ.టి.ఎమ్), సెల్ ఫోన్లు, సైబర్ నేరాలు, కంప్యూటర్ రంగాలలో జరిగిన సమస్తమైన మార్పు లను, మన భారతీయ శిక్షా స్మృతి అనే కమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. గృహ హింస సెక్షన్ 498ఎ ఒక ఉదాహరణ. మన భారతీయ శిక్షాస్మృతిలో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం ఛట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షా స్మృతిలో లేవు. లార్డ్ మెకాలే, నాటి ఫ్రెంచి పీనల్ కోడ్, లివింగ్‌స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసుకుని, మన ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తు ప్రతి' ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మను స్మృతిని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసుకున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆచార వ్యవహా రాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. 1860 నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తు ప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయ శాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ని యధా తధంగా



పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు పాకిస్తాన్ పీనల్ కోడ్ (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా బంగ్లాదేస్ పీనల్ కోడ్ పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్, మలేసియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా మన ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతధంగా (మక్కికి, మక్కి) అమలు చేస్తున్నాయి. లార్డ్ మెకాలే తయారు చేసిన 'చిత్తుప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘం గా, పరిశీలించి, పరీక్షించాడు. వారి పరిశీలన తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. దురదృష్ట వశాత్తు, ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే తన కృషి, చట్టమై, అమలు జరగటం చూడలేదు. కారణం మెకాలే 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణిం చాడు. ఆయన అవివా హితుడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. 1830కి ముందు, భారత దేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్ లలో (బొంబాయి, కలకత్తా, మద్రాసు అమలు జరిగేది.

ఈ ఇండియన్ పీనల్ కోడ్ ప్రపంచమే కుగ్రామంగా మారినా, జీవితం వేగవంత మైనా, సమాజాలు మారుతున్నా, ప్రపంచమే మారి పోతున్నా కూడా, 162 సంవత్సరాల నుంచి చెక్కు చెదరకుండా, ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి. ఆయన మేధస్సు అనితర సాధ్యం. మరో పది దేశాలకు కూడా తన గ్రంథం ఆయా దేశాలకు వేదం, బైబిల్, ఖురాను అయ్యింది.ఇండియన్ పీనల్ కోడ్ ( భారతీయ శిక్షాస్మృతి ), 1860, నేరాలపరంపరను సేకరించి , వాటికి పడే శిక్షలకు అనుగుణంగా నేరాల విభజన (వర్గీకరణ )ను చేసింది. నేర పరిశోధనను, ప్రాసిక్యూషన్ ను విభజించ మని (బ్రిటన్ లోని సి.పి.ఎస్.న్ వలె) దానివలన నేరాలు , శిక్షలు తొందరగా పరిష్కారం అవుతాయని పేర్కొంది. న్యాయ శాస్త్రం లోని పదాల అర్థాల వివరణ, శిక్షలు గురించిన వివరణ, సాధారణమైన మినహాయింపులు, స్వీయ రక్షణ హక్కు నుంచి, అబెట్మెంట్ , (నేరానికి సహకరించుట), నేరపూరితమైన కుట్ర , చట్టము అతిక్రమించు కుట్ర, దేశానికి వ్యతిరేకంగా (దేశ ద్రోహం) చేసే నేరాలు, పదాతి దళం (ఆర్మీ), నౌకాదళం (నేవీ), వాయుసేనా దళం (ఏర్ ఫోర్స్), ఈ మూడు దళాలకి సంబదించిన నేరాలు. (1917లో నేవీ (నౌకాదళం), ఏర్ ఫోర్స్ (వాయుసేనా దళం), సైన్య వ్యతిరేక నేరములు, ప్రజల శాంతి , భద్రతలకు భంగం కలిగించే, ప్రజా సేవకులైన ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన నేరాలు, ప్రభుత్వ ఉద్యోగులు చేసే నేరాలు, ఎన్నికలు వాటికి సంబంధించిన నేరములు, కోర్టు ధిక్కరణ నేరాలు (కంటెంప్ట్స్ ఆఫ్ లాఫుల్ అథారిటి ఆఫ్ పబ్లిక్ సర్వెంట్స్), తప్పుడు సాక్ష్యాలు, పబ్లిక్ జస్టిస్ కి వ్యతిరేకంగా చేసే నేరాలు, నాణెములు (ప్రభుత్వ ధనము), ప్రభుత్వము ముద్రించే స్టాంపులు, తూనికలు మరియు కొలతలు సంబంధించిన నేరాలు, ప్రజల ఆరోగ్యము, భద్రత, సౌకర్యము, మర్యాద, నీతి కి సంబంధించిన నేరాలు, మతానికి సంబంధమైన నేరాలు, మానవ శరీరానికి హాని కలిగించే నేరాలు. 1.ప్రాణ హాని ( హత్య తో కలిసి), కల్పబుల్, హోమిసైడ్, 2.గర్భస్రావం కలిగించటం, పుట్టబోయే (ఇంకా పుట్టని) బిడ్డలకు హాని చేయటం (గాయ పరచటం), ఎక్స్పోజర్ ఆఫ్ ఇన్ఫేంట్స్, కన్సీల్మెంట్ ఆఫ్ బర్త్స్ (పిల్లల పుట్టుకను వెల్లడించ కుండా దాచటం), 3.గాయపరచటం, 4.అనధి కారకంగా అడ్డుకోవటం,బందించటం (నిర్బంధించటం)5. నేరపూరితంగా దాడి చేయటం, గాయ పరచటం, 6.కిడ్నాపింగ్ (మనిషిని బలవంతంగా గాని, మోసపూరితంగా గాని ఎత్తుకు పోవటం), అబ్డక్షన్, బానిసత్వం , వెట్టి చాకిరి (బలవంతంగా, బల ప్రయోగం తో పని చేయించు కోవటం), 7.లైంగిక వేధింపులు (అత్యా చారం లేదా మానభంగం ( రేప్ ) తో సహా) సంబంధించిన నేరాలు, 8.అసహజమైన నేరాలు (సెక్షన్ 377), ఆస్తులకు సంబందించిన నేరాలు 1.దొంగతనం, 2.ఎక్స్టార్షన్, 3.రోబరీ , దోపిడీలు, 4.ఆస్తులకు సంబందించిన విషయాలను తారు మారు చేయటం (క్రిమినల్ మిస్ అప్రోప్రియేషన్ ఆఫ్ ప్రాపర్టీ), 5.నమ్మకం వమ్ము చేయటం (నమ్మించి మోసం చేయటం) (కిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), 6.దొంగతనం చేసిన సొమ్ముని, వస్తువులను (దొంగసొత్తు ), కొనటం, స్వీకరించటం, 7.మోసం చేయటం, 8.తప్పుడు పనుల (తప్పుడు పత్రాల) ద్వారా ఆస్తులను అమ్మటం (ఫ్రాడ్యు లెంట్స్ డీడ్ అండ్ డిస్పొజిషన్ ఆఫ్ ప్రాపర్టీ), 9.అల్లర్లు, అల్లరి పనులు చేయటం, 10.హక్కు ( అనుమతి ) లేకుండా, ఇతరుల ఇళ్ళలోకి, భూములలోకి ప్రవేశించటం, ఆస్తి పత్రాలకు సంబంధించిన నేరాలు, ఆస్తుల (భూములు, ఇళ్ళు) హద్దులకు సంబంధిం చిన నేరాలు: 1.ఆస్తులు (భూములు, ఇళ్ళు), ఇతర హద్దులకు సంబంధించిన నేరాలు, 2. కరెన్సీ నోట్లు, బాంక్ నోట్లు సంబంధించిన నేరాలు, 1958 లో చేర్చారు. క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ కంట్రాక్ట్స్ ఆఫ్ సర్వీస్, పెళ్ళి (వివాహం) కు సంబంధించిన నేరాలు. భర్త, భర్త తాలూకు బందువుల హింస (కౄరత్వం). గృహ హింస చట్టాన్ని 1983 లో చేర్చారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం



## ప్లేగు లీక్: రష్యాలో కలకలం!





**రష్యా**

ప్రమాదకరమైన ప్లేగు (Plague) వ్యాధి వ్యాప్తి భయాలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సైబీరియాలోని యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేసే 28 ఏళ్ల షిపిలోవా అనే మహిళా ల్యాబ్ టెక్నీషియన్ మృతి చెందడం తీవ్ర చర్చకు దారితీసింది.

**ప్లేగు వ్యాప్తి కారణంగానే ఆమె మృతిచెందినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.**

రష్యా(Russia) ప్రజారోగ్య అధికారులు మాత్రం ఆమె మృతికి నిమోనియా కారణమని చెబుతున్నారు. ఆమె శరీరంలో ప్రమాదకర సూక్ష్మజీవులను గుర్తించలేదని వెల్లడించారు.

**సెప్టెంబరు 25న ప్రయోగశాలలో ప్లేగు బ్యాక్టీరియా ఉన్న టెస్ట్ ట్యూబ్ పగిలినట్లు సమాచారం.**

"ఆ తర్వాత షిపిలోవా అనారోగ్యానికి గురయ్యారు. పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చేర్చారు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ మృతి చెందారు"

**అంటూ స్థానిక మీడియాలో వార్తలు వచ్చాయి.**

ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు.. ఆమెతో సన్నిహితంగా ఉన్న కుటుంబసభ్యులు, సిబ్బంది

**దాదాపు 200 మందిని వైద్య పర్యవేక్షణలో ఉంచారు.**

పలు ఆసుపత్రుల్లో క్వారంటైన్ చర్యలు చేపట్టారు.

**ఐదు ఆసుపత్రులను తాత్కాలికంగా మూసివేసినట్లు తెలుస్తోంది.**

అయితే క్వారంటైన్(Quarantine)లో ఉన్నవారిలో ఇప్పటివరకు వ్యాధి లక్షణాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. ప్లేగు వ్యాప్తిపై ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ.. వ్యాధి వ్యాపించినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

## వరద బాధితులపై పిస్టల్ గురిపెట్టిన ఎస్ఐ

**పాట్నా :**

వరదల్లో సర్వం పోగొట్టుకుని, సహాయక సామగ్రి కోసం వరుసలో నించున్న బాధితులపై సారన్ జిల్లా మేకర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒ, సబ్ ఇన్‌స్పెక్టర్ సంగ్రామ్ కుమార్ సింగ్ పిస్టల్ గురిపెట్టారు.

**రేవా ఘాట్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.**

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న హాయక సామగ్రి కోసం వరద బాధితులు వరుసలో నిల్చున్నారు. అయితే కొందరు బాధితులు రేషన్ తీసుకునేందుకు వరుస నుంచి బయటకు రావడంతో ఎస్ఐ వారిపై వాగ్వివాదానికి దిగారు. వారికి మొదట తన పాదరక్షలను చూపించారు. అనంతరం పిస్టల్‌ను గురిపెడుతూ వారిపై బెదిరింపులకు దిగారు.

**ఈ ఘటనపై ప్రతిపక్ష ఆర్‌జెడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది.**

సామాన్య ప్రజల పట్ల అధికారులు, పోలీసులు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడింది. వరద బాధితులకి ముందుగా చెప్పును చూపించారు, ఆ తర్వాత అహంకారంతో పిస్టల్‌ను గురిపెట్టారు.

**ముఖ్యమంత్రి ఎలా వ్యవహరిస్తున్నారో, పోలీసులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారని అన్నారు.**

ఇంతటి అహంకారం, దర్పం ఎక్కడి నుండి వచ్చాయని నిలదీశారు. ఒకరు ఎకె47తో కాల్పులు జరుపుతారని,



మరొకరు పిస్టల్‌ను గురిపెడతారని అన్నారు.

**బిజెపి-జెడియు నేతృత్వంలోని ప్రభుత్వంలో నేతలు, అధికారులు,**

పోలీసులు సామాన్య ప్రజలను పురుగుల మాదిరిగా చూస్తున్నారని దుయ్యబట్టింది.వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వం కంటి తుడుపు చర్యలు తీసుకుంది.

**ఎస్ఐని సస్పెండ్ చేస్తున్నట్లు సారన్ అదనపు ఎస్‌పి రోషన్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.**

విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, క్రమశిక్షణారాహిత్యం, నిరంకుశ వైఖరిని ప్రదర్శించినందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సస్పెన్షన్ కాలంలో అతనిని పోలీసు ప్రధాన కార్యాలయంలో నియమించి, జీవనభృతి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

**వరదల నిర్వహణలో నిర్లక్ష్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఏడుగురు ఇంజినీర్లను**

ప్రభుత్వం సస్పెండ్ చేయడంతో పాటు మరో అధికారిపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

**ఇటీవల నేపాల్ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షా లతో గండక్ నదిలో నీటిమట్టం**

పెరిగి కట్టలు తెగిపోవడంతో బీహార్‌లోని ఆరు జిల్లాల్లో భారీగా వరదలు సంభవించాయి. పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, గోపాల్‌గంజ్, సారన్, దర్భంగా, ముజఫర్‌పూర్ జిల్లాల్లోని 30 బ్లాకుల పరిధిలో 169 గ్రామ పంచాయతీలకు చెందిన సుమారు 9.87 లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారు.

## సిఇసి జ్ఞానేష్ కుమార్‌కి సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ :**

భారత ఎన్నికల సంఘంలోని ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలపై స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

**అయితే సిఇసిని సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరిన పిటిషనర్ల అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది.**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.ఎన్నికల సంఘం స్పందనను పరిశీలించిన అనంతరం,

**ఇతర ఎన్నికల కమిషనర్ల అవసరమైన ఏకాభిప్రాయం**

లేకుండానే సిఇసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తేలితే, వాటిని పునఃపరిశీలించేందుకు లేదా ఉపసంహరించుకునేందుకు ఆదేశాలు ఇవ్వవచ్చని ధర్మాసనం సూచించింది. ఏకాభిప్రాయం లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు నిరూపితమైతే ఆ నిర్ణయాలను వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది.

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి**

ఎన్నికల సంఘం తీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. బహుళసభ్యుల రాజ్యాంగ సంస్థగా ఎన్నికల సంఘానికి సంక్రమించిన అధికారాలను,

**చట్టం నిర్దేశించిన సామూహిక నిర్ణయాధికార విధానాన్ని పాటించకుండా**

సిఇసి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వీటిపై సిఇసిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది.

## 'లోరా' క్షిపణి: సైన్యానికి కొత్త సవాల్

**జమ్మూకశ్మీర్**

అడవుల్లో ఉగ్రవాదుల ఏరివేతకు ప్రయత్నిస్తోన్న భద్రతా బలగాలకు కొత్త సవాల్ ఎదురైంది. సైన్యం కంట పడకుండా ఉండేందుకు ఉగ్రవాదులు ఓ సరికొత్త ఘోస్ట్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నట్లు తెలిసింది.

**అదే 'లోరా- లాంగ్ రేంజ్, లో పవర్' ఆయుధం.**

ఎలాంటి సిమ్ కార్డు, మొబైల్ టవర్, వైఫై అవసరం లేని ఈ నెట్‌వర్క్‌ను (LoRa) గుర్తించడం భద్రతా బలగాలకు (Security Forces) అసాధ్యంగా మారుతోందని సెక్యూరిటీ ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. మూసా ఎన్‌కౌంటర్‌తో..జమ్మూకశ్మీర్‌లోని బద్గాం జిల్లాలో ఇటీవల లష్కరే తయ్యిబా చీఫ్ ఆపరేషనల్ కమాండర్ మహమ్మద్ ఆసిఫ్ అలియాస్ హాషిం మూసాను భద్రతా బలగాలు మట్టుబెట్టిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం వద్ద ఓ ఎలక్ట్రానిక్ పరికరం లభించింది. అది స్మార్ట్‌ఫోన్ కాదని, 'లోరా ఆల్ట్రా' పేరుతో ఉన్న డివైజ్ అని ఓ భద్రతా అధికారి వెల్లడించారు. "ఇది సాధారణ వాకీటాకీ కాదు. ఎన్‌క్రిప్ట్ చేసిన వైర్‌లెస్ కమ్యూనికేషన్ డివైజ్. ఒక్కో హ్యాండ్‌సెట్ స్వయంగా టవర్‌లా కూడా పనిచేస్తుంది. దీనికి సిమ్ కార్డు అక్కర్లేదు.

**రీఛార్జ్ చేయనవసరం లేదు" అని సదరు అధికారి వివరించారు.బుల్లెట్ గాయాలకు తేనె చికిత్స..**

కశ్మీర్ అడవుల్లో ఉగ్రవాది మూసా ఆయుర్వేద చిట్కాకిలోమీటర్ల దూరానికి కమ్యూనికేషన్..ఈ 'లోరా' డివైజ్‌లు.. తక్కువ శక్తి గల రేడియో ఫ్రీక్వెన్సీని ఉపయోగించుకుని 1015 కిలోమీటర్ల దూరంలో ఉన్న డివైజ్‌లకు టెక్స్ట్ మెసేజ్‌లు, జీపీఎస్ లొకేషన్లు,



అత్యవసర అలర్ట్‌లను పంపించగలవు. రేడియో సిగ్నల్స్‌పై ఆధారపడే ఈ డివైజ్‌లతో ఉగ్రవాదులు దట్టమైన అడవుల్లో ఓ ప్రైవేట్ నెట్‌వర్క్‌ను సృష్టించుకున్నారని భద్రతా అధికారులు తెలిపారు.

**అందువల్ల సాధారణ ట్రాకింగ్ వ్యవస్థలకు ఇవి చిక్కట్లేదని పేర్కొన్నారు.**

వీటి సాయంతోనే కశ్మీర్ అడవుల నుంచి ఉగ్రవాదులు నియంత్రణరేఖకు ఆవల ఉన్న తమ పెద్దలతో సంభాషణలు సాగిస్తున్నట్లు తెలిపారు.

**పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఎత్తైన కొండల ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది**

'ఆపరేషన్ మహదేవ్'ను చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో పలువురు ఉగ్రవాదులను మట్టుబెట్టగా.. ఘటనా స్థలాల్లో ఎన్‌క్రిప్టెడ్ లోరా పరికరాలు, సిమ్ రహిత బర్నర్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పాక్‌చైనా లింక్..?

**ఈ డివైజ్‌లను నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ తనిఖీ చేయగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.**

"వీటిని మన దేశంలో అసెంబ్లింగ్ చేసినట్లు కన్పించడం లేదు. వీటిని ముందుగానే ఎన్‌క్రిప్ట్ చేసి, కాన్ఫిగర్ చేశారు. పాక్ నుంచి వీటిని మన దేశంలోకి పంపిస్తున్నట్లుగా అనిపిస్తోంది. దీని వెనుక చైనా టెక్నాలజీ సాయం ఉండొచ్చు"

**అని భద్రతా సిబ్బంది అనుమానిస్తున్నారు.**

ఈ డివైజ్‌లను గుర్తించేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. స్పెక్ట్రమ్ స్కానర్లు, జామర్లను ఉపయోగించి లోరా రేడియో ఫ్రీక్వెన్సీలను కనుగొనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

## సీఈసీ వివాదం: సుప్రీం కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,**

'సర్' అంశంపై ఎన్నికల కమిషన్ లో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు (కీలక వ్యాఖ్యలు చేసింది.

**ఒక వార్తాపత్రిక కథనం ఆధారంగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది.**

మిగిలిన అధికారులకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వినియోగించుకోవచ్చా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తామంది. అంతకంటే ముందు ఈ వార్తలపై ఎన్నికల ం స్పందనను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేసింది.

**ఓట్ల తొలగింపు నిర్ణయాలను సీఈసీ ఏకపక్షంగా తీసుకున్నారని నిరూపిస్తే..**

తదుపరి చర్యలకు ఆదేశిస్తామని పేర్కొంది.ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

**అందులో 2025 జూన్ నుంచి ఇప్పటిదాకా సర్‌లో భాగంగా...**

పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలగించిన 13 కోట్లకు పైగా ఓట్లపై సిట్ ద్వారా విచారణ జరపాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు.

**సీఈసీ నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు.**

క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలి: అత్యాచార ఘటనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలుసర్ ప్రక్రియలో భాగంగా ఓట్ల తొలగింపు,

**చేర్పులపై గత 10 నెలల్లో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సంధూ, జోషి అభ్యంతరాలు వ్యక్తంచేశారని ఇటీవల జాతీయ మీడియాలో కథనం వెలువడింది.**

దీంతో సీఈసీ ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, విద్యార్థి నేతలు, సామాజిక కార్యకర్తలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలపడం గమనార్హం.

## ఢిల్లీ అల్లర్ల పిటిషన్లు కొట్టివేత



**న్యూఢిల్లీ :**

2020 ఢిల్లీ అల్లర్లు, సిఎఎ వ్యతిరేక నిరసనల నేపథ్యంలో జామియా మిలియా ఇస్లామియాలో

**2019లో చెలరేగిన హింసపై సిట్ దర్యాప్తు కోరుతూ దాఖలైన**

పలు పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. తీర్పులో పేర్కొన్న కారణాల దృష్ట్యా, అన్ని పిటిషన్లను కొట్టివేస్తున్నామని జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

**ఈ కేసులను రెండు భాగాలుగా విభజించామని,**

ఒకటి ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించినది కాగా, మరొకటి జామియా మిలియా అల్లర్లకు

**సంబంధించినదని తీర్పును ప్రకటిస్తూ ధర్మాసనం తెలిపింది. వివరణాత్మక తీర్పు వెలువడాల్సి వుంది.**

**ఈ పిటిషన్లపై కోర్టు జులై 24న తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే.**

ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన వ్యవహారంలో, సిట్ , విచారణ కమిషన్ లేదా వాస్తవాలను నిర్ధారించే కమిటీని ఏర్పాటు చేయడం, వైద్య చికిత్స, పరిహారం మంజూరు,

**బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్‌ల నమోదు వంటి అంశాలపై ఆదేశాలు కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ జరుపుతోంది.**

విద్వేషపూరిత ప్రసంగాలపై రాజకీయ నేతలపై కేసులు నమోదు చేయాలని, హింసపై దర్యాప్తు చేయడానికి, పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేయాలని కొన్ని పిటిషన్లలో కోరారు.

## 'మెదడు గుట్టు' అధ్యయనంపై ముగ్గురికి నోబెల్

**స్టాక్ హోమ్ :**

2026 ఏడాదికి గానూ నోబెల్ పురస్కారాలను సోమవారం నుండి జ్యూరీ ప్రకటించింది. వైద్యశాస్త్రంలో ముగ్గురిని నోబెల్ బహుమతి వరించింది. మెదడు గుట్టుపై అధ్యయనం చేపట్టిన కార్ల్ డిసెరోత్, పీటర్ హేగ్‌మాన్, జార్జ్ నగేల్‌లు ..

**2026 వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్నారు.**

ఐయాన్ ఛానల్స్‌తో పాటు ఆప్టో జెనటిక్స్‌లో ఆ ముగ్గురు శాస్త్రవేత్తలు కొత్త డిస్కవరీ చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. మెదడులో కలిగే ఆలోచనలు, జ్ఞపకాలు,

**భావోద్వేగాలు, ప్రవర్తనల గురించి పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు.**

అయితే తాజాగా ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు ఆప్టోజెనటిక్స్‌లో కొత్త విషయాన్ని కొనుగొన్నారు. మెదడులో ఉన్న నాడీ కణాల స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ యాక్టివిటీ గురించి ఈ శాస్త్రవేత్తలు తేల్చారు.

**అయితే వీళ్లు కనుగొన్న పద్ధతుల్లోనే వివిధ దేశాల్లోనూ ల్యాబ్‌ల్లో మెదడు మిస్టరీని స్టడీ చేస్తున్నట్లు నోబెల్ కమిటీ పేర్కొంది.**

గతేడాది కూడా వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వరించింది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో విశేష కృషి చేసిన వారి పేర్లను వెల్లడించనున్నారు.

శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్‌పై ప్రకటన రానుంది. నోబెల్ ప్రైజ్ మనీ విలువ 12 లక్షల డాలర్లు (రూ.11.5 కోట్లు).

## పశ్చిమాసియా రణరంగం: చేతుల్లో తుపాకులు!

**పశ్చిమాసియా**

ప్రస్తుతం బాంబుల వర్షం కురవట్లేదు కానీ.. యుద్ధ వాతావరణం మాత్రం అలాగే ఉంది. ఏ క్షణం ఎటునుంచి ఎవరు దాడిచేస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

**ఇరాన్ విషయంలో తాను త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అమెరికా**

అధ్యక్షుడు ట్రంప్ (Donald Trump) హెచ్చరించిన నేపథ్యంలో..

**టెహ్రాన్ నుంచి కొన్ని దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.**

ఆ దేశ మహిళల చేతుల్లో తుపాకులు కనిపించాయి. అమెరికా (USA),

**ఇజ్రాయెల్ (Israel) దేశాలు భూతల దాడులు చేపట్టొచ్చనే భయాలతో ఇరాన్ సైన్యం మహిళలకు మిలిటరీ శిక్షణను మొదలుపెట్టినట్లు కనిపిస్తోంది.**

టెహ్రాన్‌లోని ఇమామ్ హుస్సేన్ స్క్వేర్‌లోని సైనిక కేంద్రంలో ఇరాన్ మహిళలకు

**శిక్షణా కార్యక్రమం జరుగుతోందని అంతర్జాతీయ**

మీడియా కథనాలు వెల్లడించాయి. హ్యాండ్‌గన్ సహా ఇతర ఆయుధాలు ఎలా వాడాలో నేర్పుతున్నారు. యుద్ధ సమయంలో కుటుంబాలను, చుట్టుపక్కలవారిని ఎలా రక్షించుకోవాలో నేర్చుకోవడం వల్ల

**తమ భయాలు కాస్త తగ్గుతున్నాయని ఆ మహిళలు చెప్తున్నారు.**

ఉగ్రదాడి భయం.. యూకే ఫెయిర్‌ఫోర్డ్‌ను వీడిన అమెరికా బీ1 బాంబర్లు మరోవైపు

**ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ (Iran) గట్టి బదులు ఇస్తోంది.**

ఆంక్షలు, సైనిక బలప్రయోగం ద్వారా ఘర్షణలకు ముగింపు లభించదని విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. న్యాయం, నిష్పక్షపాతంగా జరిగే చర్చలతోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**అణుబాంబు తయారీ దిశగా ఇరాన్..?**

అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (NPT) నుంచి వైదొలగే అంశాన్ని ఇరాన్ పరిశీలిస్తోంది.

**ఈ అంశం పార్లమెంట్ అజెండాలో ఉందని ఎంపీ అలీరెజా సలిమీ వెల్లడించారు.**

అలాగే తమ దేశం శుద్ధి చేసిన యురేనియాన్ని వదులుకోదని స్పష్టం చేశారు.

## ఎసిపిపై ఎఫ్ఐఆర్: జర్నలిస్టు అరెస్టు

- మహిళా జర్నలిస్ట్‌తో పాటు 18 మంది పోలీసుల అదుపులో
- నిరసనకారులపై దారుణంగా దాడి చేశారని ఎక్స్ (X) లో ఆరోపణ
- పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన, భారీగా మోహరించిన పోలీసులు
- అక్టోబర్ 3న నిరసనను కవర్ చేస్తుండగా లైంగిక వేధింపుల ఆరోపణ
- కేసుల నమోదును తిరస్కరించిన పోలీసులు, విచారణ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ

**న్యూఢిల్లీ :**

ఎసిపి వివేక్ భగత్ తనను లైంగికంగా వేధించారని, అనుచితంగా ప్రవర్తించారని వెల్లడించిన మహిళా జర్నలిస్ట్‌ను సోమవారం ఉదయం పోలీసులు మరోసారి అదుపులోకి తీసుకున్నారు.

**జర్నలిస్టుతో పాటు మరో 17మందిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.**

వారిపై పోలీసులు దాడిచేసి, దారుణంగా కొట్టారని సిజెపి న్యాయవ్యవహారాల అధ్యక్షుడు రత్నసింగ్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. తమ వారిని కాపాడుకునేందుకు పోలీసులు బాధితురాలిపై, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న వారిపై దాడి చేస్తున్నారని అన్నారు.

**ఎసిపిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ,**

స్వతంత్ర జర్నలిస్టులు, కార్యకర్తలు పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వెలుపల బారికేడ్ల మధ్య వారు నిరసన చేపడుతున్నారు. ఆదివారం రాత్రంతా అక్కడే



ఉన్నారు. నిరసన నిరసనకారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తుండటంతో స్టేషన్ చుట్టూ భారీగా పోలీసు సిబ్బందిని మోహరించారు.

**అరెస్టు చేసిన మహిళా జర్నలిస్టును ఢిల్లీ కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారని సహ జర్నలిస్టులు తెలిపారు.**

ఎసిపి వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఒక మహిళా జర్నలిస్ట్ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో కొన్ని గంటల పాటు వేచి చూసిన అనంతరం ఈ నిరసన ప్రారంభమైంది. అక్టోబర్ 3న సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ జరిగిన నిరసనను తాను కవర్ చేస్తుండగా, ఆ ని మహిళా జర్నలిస్ట్ పేర్కొన్నారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను అదుపులోకి తీసుకోవడాన్ని తాను రికార్డ్ చేస్తుండగా ఈ సంఘటన జరిగిందని ఆ జర్నలిస్ట్ ఆరోపించారు.

నిరసన సందర్భంగా పోలీసు అధికారులు లైంగిక వేధింపులకు, దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ముగ్గురు మహిళా జర్నలిస్టులు ఫిర్యాదులు చేశారని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

**నిరసన సమయంలో పోలీసులు శాంతిభద్రతల విధులు నిర్వర్తిస్తున్నారని,**

విధుల్లో భాగంగా తీసుకున్న చర్యలకు వారిపై కేసులు నమోదు చేయలేమని అన్నారు. విచారణ కోసం ఈ ఫిర్యాదు అన్నారు. సోమవారం ఉదయం వరకు ఈ మూడు కేసుల్లోనూ క్రైమ్ బ్రాంచ్ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం గమనార్హం.

## టైఫూన్‌గా మారిన హరికేన్ నోలో

**వాషింగ్టన్:**

పసిఫిక్ మహాసముద్రంలో అంతర్జాతీయ డేట్‌లైన్‌ను దాటిన శక్తివంతమైన హరికేన్ నోలో ఇప్పుడు టైఫూన్‌గా మారింది. ఆదివారం డేట్‌లైన్‌ను దాటిన తర్వాత దీనికి 'టైఫూన్ నోలో'గా పేరు మారింది. పేరు మారినప్పటికీ తుఫాను తీవ్రతలో పెద్దగా మార్పు లేదని వాతావరణ నిపుణులు తెలిపారు.

**అమెరికా నేషనల్ హరికేన్ సెంటర్ ప్రకారం,**

టైఫూన్ నోలో లిసియాన్స్కి ద్వీపానికి పశ్చిమనైరుతి దిశలో సుమారు 395 మైళ్ల (640 కిలోమీటర్ల) దూరంలో ఉంది.

**గంటకు 17 మైళ్ల (28 కిలోమీటర్ల) వేగంతో పశ్చిమ దిశగా కదులుతోంది.**

నోలోలో గరిష్ఠంగా గంటకు 115 మైళ్ల (185 కిలోమీటర్ల) వేగంతో గాలులు వీచినట్లు హరికేన్ సెంటర్ వెల్లడించింది. అంతకుముందు నోలో కేటగిరీ 3 హరికేన్‌గా బలపడింది.

**వారం క్రితం హవాయిని హరికేన్‌గా దాటిన ఈ తుఫాను అనంతరం బలహీనపడి ఉష్ణమండల తుఫానుగా మారింది.**



ఆ తర్వాత తిరిగి హరికేన్ స్థాయికి చేరుకుంది.

**తుఫాను ప్రస్తుతం విశాలమైన సముద్ర ప్రాంతంలో ఉండటంతో తక్షణం భూభాగానికి ముప్పు లేదని నిపుణులు తెలిపారు.**

పశ్చిమ దిశగా కదులుతున్న నోలో సమీప భవిష్యత్తులో ఏ భూభాగాన్నీ ప్రభావితం చేసే అవకాశం లేదని అంచనా వేశారు.

ఇదిలా ఉండగా, పసిఫిక్‌లోని మరో తుఫాను రాచెల్ మెక్సికోకు దూరంగా పశ్చిమ దిశగా కదులుతోంది.

**సముద్రంలోకి మరింత ముందుకు వెళ్తున్న కొద్దీ పశ్చిమ-మధ్య**

మెక్సికో తీరం, బాహా కాలిఫోర్నియా ద్వీపకల్ప ప్రాంతాల్లో ప్రమాదకరమైన అలలు, ఉప్పెనలు ఏర్పడే అవకాశం ఉందని హరికేన్ సెంటర్ హెచ్చరించింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది

**తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు.**
**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 5**



ప్రజావాణి కార్యక్రమంలో పిటిషన్ సమర్పించిన దుగ్గొండి మండలం పోనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్ సోమవారం ఆవేదనతో పెట్రోల్ పోసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిటిషనర్‌తో మాట్లాడి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన నుంచి స్వయంగా వాగ్మూలాన్ని నమోదు చేయించారు. గట్ల సురేందర్ తన సమస్య పరిష్కారం కోరుతూ ఈ ఏడాది జూలై 6న ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆగస్టు 22న జిల్లా కలెక్టరేట్‌లో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు పిటిషనర్ తమ్ముడు గట్ల రాజు హాజరయ్యారు. విచారణ సందర్భంగా సంబంధిత అంశంపై నర్సంపేట సివిల్ జడ్జి కోర్టులో కేసు నంబర్ 199/224 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సెప్టెంబర్ 30న ఎండార్స్‌మెంట్ ద్వారా పిటిషనర్‌కు తెలియజేశారు. అయినప్పటికీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో గట్ల సురేందర్ తీవ్ర ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్నాడు. అనంతరం తన చర్య పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, ఇకపై ఇలాంటి పొరపాటును పునరావృతం చేయబోనని, తనను క్షమించాలని కోరుతూ స్వయంగా వాగ్మూలం రాసి జిల్లా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ "సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. సమస్యకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడే వరకు సంయమనం పాటించాలి" అని సూచించారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయించాలని కలెక్టర్ కోరారు. ఆవేశంలో ప్రమాదకర నిర్ణయాలు తీసుకోకుండా, సమస్యలను చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

## ప్రతి రోగికి అనుగుణంగా మోకాలి మార్పిడి: డాక్టర్ అభిషేక్ బర్లీ

**రోబోట్ సర్జన్‌ను భర్తీ చేయదు..**
**మరింత ఖచ్చితత్వానికి తోడ్పడుతుంది**
**హనుమకొండ నగరంలో ఇక ప్రతి నెలా ప్రముఖ కీళ్ల మార్పిడి నిపుణుడి సేవలు**
**రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడిలో కొత్త ముందడుగు**
**హనుమకొండ సిటీ, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి) :**



మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో ఆధునిక రోబోటిక్ టెక్నాలజీ కీలక మార్పులకు దోహదపడుతోందని యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అభిషేక్ బర్లీ తెలిపారు. హనుమకొండ యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ అభిషేక్ బర్లీ మాట్లాడుతూ.. రోబోటిక్ అసిస్టెడ్ టోటల్ నీ రీప్లేస్‌మెంట్ ద్వారా ప్రతి రోగి మోకాలి నిర్మాణానికి అనుగుణంగా శస్త్రచికిత్సను వ్యక్తిగతీకరించవచ్చని తెలిపారు. కంప్యూటర్ ఆధారిత ప్లానింగ్, రోబోటిక్ టెక్నాలజీ సహాయంతో మోకాలి అలైన్‌మెంట్, ఎముకల కటింగ్, ఇంప్లాంట్ పొజిషనింగ్, లిగమెంట్ బ్యాలెన్స్ వంటి అంశాల్లో సర్జన్‌కు మరింత ఖచ్చితత్వంతో పనిచేసే అవకాశం ఉంటుందని వివరించారు.

రోబోట్ సర్జన్‌ను భర్తీ చేయదురోబోటిక్ వ్యవస్థ స్వతంత్రంగా శస్త్రచికిత్స చేయదని, మొత్తం ప్రక్రియ సర్జన్ నియంత్రణలోనే జరుగుతుందని డా. అభిషేక్ బర్లీ స్పష్టం చేశారు. రోబోటిక్ టెక్నాలజీ సర్జన్‌కు మెరుగైన సమాచారం, ఖచ్చితత్వం అందించే ఆధునిక సాధనంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి రోగి మోకాలి నిర్మాణం భిన్నంగా ఉండటంతో, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శస్త్రచికిత్స ప్రణాళిక రూపొందించడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని చెప్పారు. రోబోటిక్ విధానం ద్వారా వ్యక్తిగతీకరించిన సర్జికల్ ప్లానింగ్, ఇంప్లాంట్ పొజిషనింగ్‌లో ఖచ్చితత్వం, మోకాలి అలైన్‌మెంట్ సాఫ్ట్ టిష్యూ బ్యాలెన్స్‌ను అంచనా వేయడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

అయితే రోబోటిక్ శస్త్రచికిత్స ప్రతి రోగిలోనూ మెరుగైన ఫలితాలకు హామీ కాదని, రోగి ఎంపిక, సర్జన్ అనుభవం, ఇంప్లాంట్ ఎంపిక, శస్త్రచికిత్స అనంతర ఫిజియోథెరపీ, రోగి ఆరోగ్య పరిస్థితులు కూడా కీలకమని పేర్కొన్నారు. మోకాలి మార్పిడి శస్త్రచికిత్స ప్రధాన లక్ష్యం రోగి నొప్పిని తగ్గించి, తిరిగి స్వతంత్రంగా నడవడానికి, రోజువారీ కార్యకలాపాలను సౌకర్యవంతంగా కొనసాగించడానికి సహాయపడటమేనని డా. బర్లీ తెలిపారు. సరైన నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స, నొప్పి నియంత్రణ, ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ వరకు పూర్తి చికిత్సా ప్రక్రియ రోగి కోలుకోవడంలో కీలకమని వివరించారు. వరంగల్, పరిసర ప్రాంతాల ప్రజలకు నిపుణుల వైద్య సేవలు అందించేందుకు ఇకపై ప్రతి నెల మొదటి ఆదివారం హనుమకొండ యశోదమెడికల్ సెంటర్‌లో తాను అందుబాటులో ఉంటానని డా. అభిషేక్ బర్లీ తెలిపారు. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు తదుపరి కన్సల్టేషన్, ఫాలోఅప్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా వరంగల్‌లోనే నిపుణుల సలహాలు పొందవచ్చని చెప్పారు. వరంగల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు

ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డా. అభిషేక్ బర్లీతో పాటు అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనకు అనుకూల వాతావరణం కల్పించాలి



**ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థుల అభ్యసనకు అనుకూలమైన వాతావరణాన్ని పాఠశాలల్లో కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొనసాగుతున్న ఎస్ఏ-1 పరీక్షల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పోషకాహార తదితర అంశాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించి, వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించారు. విద్యార్థులు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించి, వారి అభ్యసన స్థాయిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 62 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. మన ఊరు-మన బడి పనుల పరిశీలన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనుల ప్రస్తుత పరిస్థితి, వాటి ద్వారా విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. ప్రీప్రైమరీ చిన్నారులకు సౌకర్యాల పరిశీలన అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. తరగతి గదుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఆటలు, బొమ్మలు, ఇతర అభ్యసన సామగ్రి వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. నాణ్యమైన పోషకాహారం అందించాలి విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారం రుచిపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఉదయం 11 గంటలకు రాగిజావ, అనంతరం మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ, ఆహార పదార్థాలు, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను వంట నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి జంకీలాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి
## జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

**జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి - ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ**
**సూర్యాపేట అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు ఇచ్చిన వినతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలు తమ వద్దకు తెచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, రక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని, ప్రజా రక్షణ కోసం పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాల పెద్దల సమక్షంలో సామరస్య పూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ అభివృద్ధికి బడ్జెట్ మంజూరు చేయాలి

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరిన మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**
**సూర్యాపేట, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి) :**



సూర్యాపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌లో వ్యాపారులు, రైతులు, వినియోగదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పన, మార్పులు, చేర్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేలా అవసరమైన పనులకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, వ్యాపారులు, ప్రజలకు మెరుగైన సేవలు అందే విధంగా మార్కెట్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కొప్పుల వేణారెడ్డి తెలిపారు.

దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి, మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు.

## పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్

**హనుమకొండ, అక్టోబర్ 05 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం హనుమకొండలో ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు. హనుమకొండ బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డెయిరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డెయిరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విజయ డెయిరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విజయ డెయిరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విజయ డెయిరీ సిబ్బందితో మాట్లాడి విక్రయ కేంద్రంలో అందుబాటులో ఉన్న పాల ఉత్పత్తులు, వాటి విక్రయ విధానం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా అవసరమైన ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ ధనరాజ్. జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## చిన్నారుల భద్రతపై అవగాహనకు 'మాట్లాడే బొమ్మ'

**మంచి స్పర్శ, చెడు స్పర్శను సులభంగా వివరించే బొమ్మను ఆవిష్కరించిన :: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**
**ములుగు, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి) :**



చిన్నారులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను సులభంగా వివరించేందుకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమకూర్చిన 'మాట్లాడే బొమ్మ'ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆవిష్కరించారు.

సోమవారం కలెక్టర్ తన కార్యాలయ గదిలో బొమ్మ పనితీరును పరిశీలించారు. బొమ్మ శరీరంలోని నిర్దేశిత భాగాలను తాకినప్పుడు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి ఎలా వివరిస్తుందో బాలల పరిరక్షణ విభాగం అధికారులు ప్రత్యక్షంగా చూపించారు. చిన్నారులకు అవగాహన కల్పించేందుకు బొమ్మ ఉపయోగకరంగా ఉందని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు తమ భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాట్లాడే బొమ్మను పాఠశాలల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో ఉపయోగించాలని సూచించారు. అసౌకర్యం కలిగించే స్పర్శ, వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేసేలా చిన్నారుల్లో ధైర్యాన్ని పెంపొందించాలన్నారు. బాల్యవివాహాల నివారణ, బాలల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు

.జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు, జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా రెండు మాట్లాడే బొమ్మలను సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఒకదాన్ని జిల్లా కోర్టుకు అందించనున్నట్లు, మరోదాన్ని బాల రక్ష భవన్‌లో ఉంచనున్నట్లు వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పాఠశాలల్లో, ఇతర అవగాహన సదస్సుల్లో ఈ బొమ్మను ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు. మంచి స్పర్శ, చెడు స్పర్శతో పాటు లైంగిక వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలనపై చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, పరిరక్షణ అధికారి హరికృష్ణ, సోషల్ కోఆర్డినేటర్ సుమన్, సీనియర్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ప్రజావాణికి 86 దరఖాస్తులు - పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులకు ఆదేశం**
**సూర్యాపేట, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**



ప్రజల సమస్యల పరిష్కార వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

86 దరఖాస్తులు:
సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో భూ సమస్యలు, రెవెన్యూకు సంబంధించి 49, డిపిఓ 9, డిఎం అండ్ హెచ్ ఓ 3, డిఇఓ 2, మిగిలిన 23 శాఖలకు చెందినవని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్,

డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

## గండుగులపల్లి లో మంత్రి తుమ్మల ను కలిసిన పలువురు ప్రముఖులు



**సమస్యల పై పలువురు మంత్రి తుమ్మలకు వినతి పత్రాల సమర్పణ**
**దమ్మపేట అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సోమవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను అశ్వరావుపేట సత్తుపల్లి నియోజకవర్గాల సీనియర్ నాయకులు తుమ్మల అభిమానులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా రెండు నియోజకవర్గాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వారి సమస్యల పరిష్కారానికై మంత్రి తుమ్మలకి వినతి పత్రాలు సమర్పించారు

స్థానిక శాసనసభ్యుల సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని అంతే కాకుండా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి తుమ్మల తెలియజేశారు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికే టీజేఎంయూ సమావేశం



**8న జరిగే అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభను విజయవంతం చేయండి**
**ఏర్పాట్లను పరిశీలించిన యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్**
**అశ్వారావుపేట అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి) :**

భద్రాద్రి కొత్తగూడెం జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టజేఎంయు) నిరంతరం అండగా నిలుస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఇనపనూరి ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీన అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో జరగనున్న టీజేఎంయూ అశ్వారావుపేట నియోజకవర్గ ప్రథమ మహాసభ ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం స్థానిక యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇనపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తే ఏకైక మార్గమన్నారు.

రాష్ట్రంలో బలమైన సంఘాలుగా చెప్పుకుంటున్న పలు యూనియన్లు స్వార్థ ప్రయోజనాలు, వ్యక్తిగత కార్యకలాపాలకే ప్రాధాన్యతనిస్తూ జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. ఫలితంగా నేటికీ పాత్రికేయుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సొంతింటి కలను కూడా నెరవేర్చుకోలేక జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్ యు జె ఐ) అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ పాత్రికేయుల గొంతుకగా నిలిచి రాజీలేని పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 8వ తేదీన ప్రథమ మహాసభకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పాత్రికేయులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ రాఘవేంద్ర, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, అశ్వారావుపేట నాయకులు నూనె హనుమంతరావు, పెనుగొండ సత్యనారాయణ, నార్లపాటి సుబ్బారావు, రాము తదితరులు పాల్గొన్నారు

## పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను నిర్వహించాలి
### .జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**రైతులకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**
**ఖమ్మం, వుదయం బ్యూరో అక్టోబర్-05:**

202627 సీజన్‌లో పత్తి కనీస మద్దతు ధర కు కొనుగోళ్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 202627 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (MSP)ను క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించిందన్నారు. 202526 సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 8,110 ఉండగా, ప్రస్తుతం రూ. 557 పెంచినట్లు తెలిపారు. మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాక ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్ల పత్తి తిరస్కరణకు గురికాకుండా రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు.

టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం:
పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్, 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం, టోల్‌ఫ్రీ నంబర్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై:
202627 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, సిసిఐ, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ, పోలీస్, రవాణా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గంజాయి సాగుదారులపై పోలీసుల ఉక్కుపాదం..జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అక్రమ గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ నితికా పంత్, తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ డీఎస్పీ బి.అశోక్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా లింగాపూర్,సిర్పూర్ (యు), కెరమెరి పోలీస్ స్టేషన్ పరిధుల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 500 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న 5గురు నిందితులను అరెస్టు చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని అంచనా.

**2025లో గంజాయి సాగుపై చర్యలు**

2025 సంవత్సరంలో అక్రమ గంజాయి సాగుకు సంబంధించి 39 కేసులు నమోదు చేసి,35 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.1.13 కోట్ల విలువైన 1,134 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ గంజాయి సాగుల పాల్పొన్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందే ప్రయోజనాలను 20 మంది భూ యజమానులకు కలెక్టర్ గారి ఉత్తర్వుల మేరకు సంబంధిత లబ్ధులను నిలిపివేయడం జరిగింది.2026 సంవత్సరంలో ఇప్పటి వరకు అక్రమ గంజాయి సాగుకు సంబంధించి 23 కేసులు నమోదు చేసి,27 మంది నిందితులను అరెస్టు చేశారు.వారి నుంచి సుమారు రూ.2.36 కోట్ల విలువైన 2,366 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుల్లో నమోదైన నిందితుల భూ యజమానుల వివరాలను స్థానిక తహసీల్దార్ల ద్వారా సేకరించి,సంబంధిత సమాచారాన్ని జిల్లా కలెక్టర్ గారికి పంపిస్తాము. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధులను నిలిపివేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు. డ్రై గంజాయిపై ఉక్కుపాదం 2026లో ఇప్పటివరకు డ్రై గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి 32 కేసులు నమోదు చేసి, వారి నుంచి సుమారు విలువ సుమారుగా 3లక్షల విలువైన, 10 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం,68 మంది నిందితులను అరెస్టు చేశాము అని తెలిపారు. అక్రమ గంజాయి సాగు వల్ల యువత, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున,గంజాయి సాగుకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేత వంటి చర్యలు కూడా కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు.జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు, రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న పోలీస్ అధికారులను మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా నిరంతర తనిఖీలు,ప్రత్యేక దాడులు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## కార్మిక నాయకుడుగా కాకా సేవలు చిరస్మరణీయం

**నిరుపేదలకు గూడు కల్పించిన ఘనత కాకాదే**

**మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం. వెంకటస్వామి జయంతి వేడుకలు**

**మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**

కార్మిక నాయకుడుగా కాకా సేవలు చిరస్మరణీయమని,నిరుపేదలకు గూడు కల్పించిన ఘనత కాకాదే అని మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం మంత్రి క్యాంపుకార్యాలయంలో మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం. వెంకట స్వామి జయంతి పురస్కరించుకుని కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,వేడుకలు ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాక వెంకటస్వామి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానా యకుడని, పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికే తన రాజకీయ జీవితం అంకితం చేశారన్నారు.సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఆయన చూపిన కృషిఅమోఘం అని సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారార్థం ఆ సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావును కలసి నిధులు సమకూర్చి వేలాది కుటుంబాలకు అండగా నిలిచారన్నారు.హైదరాబాద్‌లో గుడిసెలలో నివసిస్తున్న సుమారు 70 వేల నిరుపేద కుటుంబాలకు గృహపట్టాలు మంజూరు చేయించిన ఘనత కాకాదే అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి విరాళాలు తీసుకోకుండా స్వంత నిధులతో అంబేద్కర్ విశ్వ విద్యాలయం నిర్మాణానికి తోడ్పడిన అరుదైన నాయకుడు కాక వెంకట స్వామి అని తెలిపారు.జెడ్పీటీసీ నుండి మంత్రి స్థాయికి ఎదగడానికి కారణం కాకా వేసిన విత్తనమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల. నాగలక్ష్మి,జిల్లా గ్రంధాలయం చైర్మన్ సంఘనబట్ల. దినేష్,జిల్లా కాంగ్రెస్ అద్యక్షుడు నందయ్య,మండల కాంగ్రెస్ అద్యక్షుడు చిలుముల.లక్ష్మణ్,ఉపాధ్యక్షుడు వేముల.రాజేష్,పట్టణ అధ్యక్షుడు చిపిరిశెట్టి.రాజేష్,కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు...



**జగిత్యాల అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బృందం సోమవారం పలు రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత పరిశుభ్రత శానిటరీ పరిస్థితులను అధికారులు పరిశీలించారు. తనిఖీల్లో కుళ్లిపోయిన ఆహార పదార్థాలు పరిశుభ్రత లోపాలు గుర్తించిన పీఎంఆర్ మండి కింగ్స్ మండి రెస్టారెంట్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుని 25 వేల రూపాయల వరకు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని రెస్టారెంట్లు హోటళ్లు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడం నిర్వాహకుల బాధ్యత అని పేర్కొన్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయడంతో పాటు కుళ్లిపోయిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను వినియోగించరాదని హెచ్చరించారు. పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే హోటళ్లు రెస్టారెంట్లపై మున్సిపల్ శాఖ తరఫున ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ రాము చందు జవాన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ రెవెన్యూ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

**ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి**

**అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై మంత్రులు జూపల్లి, పొంగులేటి సమీక్ష**




**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 5 అక్టోబర్ 2026**

నిర్మల్ జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక , ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని అంశాలపై కలెక్టర్లు, ఉన్నతాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**భూ సమస్యలపై దృష్టి:**

రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల అంశాలపై మంత్రులు సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

**ఇళ్ల నిర్మాణం వేగవంతం:**

ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై సమీక్ష:**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరు, జిల్లాల వారీగా కార్యక్రమాల పురోగతిని మంత్రులు తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్య దర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి, అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి)**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ్రి అజయ్ కుమార్ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గౌడ అశోక్ తన కుమార్తె గౌడ శ్రీవల్లికు 100% వికలాంగత్వం ఉందని తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ అనిత తాను బిఎస్సి నర్సింగ్ పూర్తి చేశానని తనకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టర్లో ఏదైనా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీ కి రాస్తూ ఔట్సోర్సింగ్ కింద అవకాశాలు వచ్చినప్పుడు పరిశీలించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రామగిరి మండలం రాజాపూర్గ్రామానికి చెందిన మల్లేశ్వరి తన ఇంటికి సింగరేణి ప్రాజెక్టు వారు ప్రాజెక్టు నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తదితరులు.

## దళితుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన

### నేత కాకా వెంకటస్వామి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్ అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఎస్ సి సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, మాజీ సి డబ్ల్యూసీ మెంబర్, దళిత ఉద్యమ నేత స్వర్గీయ గడ్డం వెంకట స్వామి (కాకా) జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా విచ్చేసి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తో కలిసి వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల సమర్పించి, పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ దివంగత నాయకులు వెంకటస్వామి అభిమానులందరూ 'కాకా' అని పిలుచుకునే వెంకటస్వామి జయంతి సందర్భంగా, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున, జిల్లా ప్రజల తరపున ఘనంగా నివాళులర్పిస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం అన్నారు. వెంకటస్వామి ఒక నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి, పార్లమెంటరీ వ్యవస్థలో ఢిల్లీ రాజకీయాలను శాసించిన గొప్ప నాయకుడని కొనియాడారు. పార్లమెంట్ సభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, డబ్ల్యూసీ సభ్యుడిగా, కాంగ్రెస్పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా, పిసిసి అధ్యక్షుడిగా రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీకి విశిష్ట సేవలు అందించారని తెలిపారు.1960, 70ల దశకంలో హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రాంతాల్లో పేదలకు, ఇల్లు లేని వారికి గుడిసెలు వేయించి 'గుడిసెల వెంకటస్వామి'గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కర్ర సత్య ప్రసన్నారెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, బానోతు శ్రావణ్ నాయక్, కల్వల రాంచందర్, వరాల నర్సింగం, శుకూర్, సరిల్ల రతన్ రాజు, విక్టర్, కొలగాని అనిల్, అనంతుల రమేష్, మాదాసు శ్రీనివాస్, కుర్ర పోచయ్య, మాలోతు మహాలక్ష్మి, జొన్నల రమేష్, చింతల కిషన్, మూల జైపాల్, స్వప్నశ్రీ, శిల్ప, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రంగనాయక, వీర దేవేందర్, పెంట శేఖర్, అందే శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర సైబర్ నిందితుడి అరెస్టు

**- మూడు రాష్ట్రాల్లో 150 మందికి టోకరా..**

**- రూ.95.33 లక్షల మేర మోసం**

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 5:**

మూడు రాష్ట్రాల్లో 150 మంది బాధితులకు టోకరా వేసి రూ.95.33 లక్షల మేర సైబర్ మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన చైతన్య ప్రమోద్ కుటె (25)ను ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు మహారాష్ట్రలో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.ఆదిలాబాద్ బ్రాహ్మణవాడకు చెందిన ప్రఫుల్ పాటిల్‌కు జూలై 23న నిందితుడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారినంటూ ఫోన్ చేశాడన్నారు. క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో నమ్మించి కార్డు వివరాలు, ఓటీపీలను తెలుసుకుని ఐదు లావాదేవీల ద్వారా రూ.73,279 బదిలీ చేసుకున్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 633/2026గా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.దర్యాప్తులో జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా లభించిన వివరాలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడి ఆచూకీ గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందం మహారాష్ట్రకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆదిలాబాద్‌కు తీసుకొచ్చిందన్నారు.గతంలో యాక్సిస్ బ్యాంకులో పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని కస్టమర్ల మొబైల్ నంబర్లను సేకరించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతరం వివిధ సిమ్‌కార్డులు, మొబైల్ ఫోన్లతో బ్యాంకు అధికారులమంటూ కస్టమర్లకు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలను తెలుసుకునేవాడని తెలిపారు. అనంతరం నగదును వివిధ యూపీఐ, అమెజాన్ ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు చెప్పారు.తెలంగాణ, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లో నిందితుడికి సంబంధించి సుమారు 150 ఫిర్యాదులు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించి మొత్తం రూ.95,33,651 మేర నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు.నిందితుడి నుంచి టయోటా హైరైడర్ కారు, యాపిల్ ఐఫోన్-13, మోటో జీ67 మొబైల్ ఫోన్, వివిధ సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మోసాలకు ఉపయోగించిన కొన్ని మొబైల్ ఫోన్లను ధ్వంసం చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు.బ్యాంకు అధికారులు, పోలీసులు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. ఓటీపీ, పిన్, సీవీవీ, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్‌కుమార్, ఎస్ఐలు గోపీకృష్ణ, అశోక్, సైబర్ క్రైమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.




## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి...

**పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 67**



**జగిత్యాల అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి)**

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తేది 5 10 2026 సోమ వారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు వినతు లు అందాయని వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అంది న ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ డిఆర్ఓ కెవై ప్రసాద్ ఆర్డీవో లు జీవాకర్ రెడ్డి నర్సింహ రావు జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## వార్డ్ మెంబర్ల హక్కుల పరిరక్షణ కు ప్రజావాణిలో వినతి







**ధర్మపురి, అక్టోబర్05 (వుదయం ప్రతినిధి):**

గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్ల సమస్యలు పరిష్కరించి,వారి హక్కు లు సంక్షేమానికి భద్రత కల్పించాలని కోరుతూ ధర్మపురి మండల వార్డ్ మెంబర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమ వారం ప్రజావాణిలో అధికారు లకు వినతి పత్రం సమర్పించా రు.గ్రామాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలుగా ఉంటున్న వార్డ్ మెంబర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.వార్డ్ మెంబర్లకు ప్రతి నెలా కనీస గౌరవ వేతనం చెల్లించాలి.గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల శిలా ఫలకాలపై సంబంధిత వార్డ్ మెంబర్ పేరు విధిగా ముద్రించా లి.విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రమాదవ శాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.వార్డ్ మెంబర్లందరికీ ప్రత్యేక ఆరోగ్య బీమాను వర్తింప జేయాలి.ఈ కార్యక్రమంలో ధర్మ పురి మండల వార్డ్ మెంబర్ ఇన్ చార్జ్ ద్యావనపల్లి కేదార్, బొంకో టి రాకేష్,పూదరి రజిత మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో తొలిసారిగా ఆయిల్‌పామ్ తోటలు...

**-మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ**



**మంచిర్యాల/ మందమర్రి/ అక్టోబర్ 05(వుదయం ప్రతినిధి)**

సింగరేణి చరిత్రలో తొలిసారిగా బొగ్గు గని భూముల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి మందమర్రి ఏరియాలో శ్రీకారం చుట్టారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుధ ప్రకాష్ జ్యోతి దిశానిర్దేశంలో, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు, జీఎం (ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్) బి. సైదులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు.మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ నాయకత్వంలో మూసివేసిన కె.కె-2 భూగర్భ గని ఆవరణలోని నర్సరీ వెనుక సుమారు రెండు హెక్టార్లలో 285 ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. బొగ్గు తవ్వకాలు పూర్తయిన భూములను పునరుద్ధరించి వ్యవసాయం, అగ్రో ఫారెస్ట్రీ, ఉద్యానవనాల పెంపకానికి వినియోగించాలనే లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జీఎం ఎస్ఓ జి.ఎల్. ప్రసాద్, శాంతిఖని గనుల ఏజెంట్ ఎస్. సంతోష్, కె.కె. గ్రూప్స్ ఏజెంట్ ఖాదిర్, కె.కె.ఓసీ ప్రాజెక్టు అధికారి డి. రాంబాబు, బెల్లంపల్లి రీజియన్ డీజీఎం (అటవీ) హరి నారాయణతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో ఇతర గని ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

## బెజ్జూర్ ఎస్సైగా కే రమేష్ బాధ్యతలు స్వీకరణ




**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ ఎస్సైగా కె. రమేష్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రమేష్ ను ఉన్నతాధికారులు బెజ్జూర్ ఎస్సైగా బదిలీ చేయడంతో సోమవారం పోలీస్ స్టేషన్లో పదవి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. శాంతి భద్రతలకు అందరు సహకరించాలని కోరారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలి

- **సామాజిక న్యాయం నియామకాల్లోనూ కనిపించాలి**
- **టీఎంజేఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పంగిడి చెరువు వెంకటేష్**



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 05 (వుదయం బ్యూరో)**

ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించేలా రొటేషన్ విధానాన్ని అమలు చేసి, మాదిగ, అనుబంధ ఉపకులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి పంగిడి చెరువు వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్సీఎస్టీ కమిషన్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన నేపథ్యంలో చేపట్టనున్న నూతన నియామకాల్లో జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న అర్హత, అనుభవం కలిగిన మాదిగ, అనుబంధ ఉపకులాల ప్రతినిధులను చైర్మన్, సభ్యులుగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో అణగారిన వర్గాల గొంతుకను ప్రభుత్వానికి చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన నియామకాలకు భిన్నంగా రొటేషన్ విధానాన్ని అమలు చేసి, అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించడం ద్వారా కమిషన్‌పై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ముఖ్యంగా మాదిగ, అనుబంధ ఉపకులాలకు చెందిన అర్హత, అనుభవం ఉన్న జర్నలిస్టులకు ఈసారి అవకాశం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా నియామకాల్లోనూ ప్రతిఫలించాలని వెంకటేష్ అన్నారు. ఈ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, నూతన కమిషన్ నియామకాల్లో మాదిగ జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ అంశాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## డీలర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే బండ్ల

- **గద్వాల జిల్లా డీలర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గానికి భరోసా**
- **సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న శాసనసభ్యుడు**
- **ప్రజాప్రాతినిధ్య క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఎమ్మెల్యే సత్కారం**

**గద్వాల, అక్టోబరు 5 (వుదయం బ్యూరో)**



ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న రేషన్ డీలర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సంపూర్ణంగా కట్టుబడి ఉన్నారని గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. డీలర్లు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఘంటాపథంగా హామీ ఇచ్చారు. గద్వాల జిల్లా డీలర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గద్దం మద్దిలేటి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నూతన కార్యవర్గ సభ్యులు శాలువా కప్పి, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, డీలర్ల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డీలర్ల సమస్యలపై సుదీర్ఘ చర్చ అనంతరం ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు, సర్వర్ సమస్యలు, కమీషన్ల పెంపుదల, మౌలిక వసతులు డీలర్ల ఆరోగ్య భద్రత తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. డీలర్లకు ఎలాంటి అవరోధాలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, తక్షణమే స్పందించి అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం: గద్దం మద్దిలేటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గద్దం మద్దిలేటి మాట్లాడుతూ... డీలర్ల హక్కుల పరిరక్షణ, వారి ఆర్థిక, సామాజిక భద్రతే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని పునరుద్ఘాటించారు. డీలర్లందరినీ ఏకతాటిపైకి తెచ్చి అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్‌నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు మధు, మన్యంతో పాటు డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

- **ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**
- **పశువుల శాంపిల్స్ సేకరణ, రవాణాకు ప్రత్యేక వాహనం ప్రారంభం**
- **వేగవంతమైన ల్యాబ్ పరీక్షలతో సకాలంలో వ్యాధి నిర్ధారణే లక్ష్యం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్**

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన పాడి రైతులకు అండగా నిలుస్తూ, మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ, శాంపిల్స్ సేకరణ, సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాహనం (TS09UC4288)ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి యెన్నం శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు అకస్మాత్తుగా వ్యాధులు సోకినప్పుడు వ్యాధి నిర్ధారణలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రత్యేక వాహనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. క్షేత్రస్థాయిలో పశువుల నుంచి రక్తం, మూత్రం, ఇతర నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, అవి పాడవకుండా ప్రయోగశాలకు తరలించడం ద్వారా సకాలంలో వ్యాధులను గుర్తించి, తక్షణ చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పశువుల ఆరోగ్య పరిరక్షణకు అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను ప్రయోగశాలలో వేగవంతంగా పరీక్షించి, పరీక్షా ఫలితాలను వెంటనే సంబంధిత పశువైద్యులకు చేరవేసేలా సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనివల్ల పశువులకు సకాలంలో సరైన చికిత్స అందించడంతో పాటు అంటు వ్యాధులు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా నియంత్రించేందుకు వీలవుతుందని అన్నారు. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజె బెనహర్, జిల్లా గొర్రెల కాపరులు సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, ఫయాజ్, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, ల్యాబ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## 41 రోజుల మండల పూజలకు ఘనంగా పూర్ణాహుతి

- **భక్తిశ్రద్ధలతో ఉమా మహేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు**

**హైదరాబాద్ /సంగారెడ్డి వుదయం**



మల్కాజిగిరి నేరేడ్‌మెట్ శివనగర్ కాలనీలోని శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో 41 రోజులుగా కొనసాగుతున్న మండల దీక్షా పూజలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఆగస్టు 26న అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ మరకత శివలింగ పంచాయతన యంత్ర ప్రాణప్రతిష్ఠ మహోత్సవం అనంతరం ప్రారంభమైన మండల పూజల ముగింపు సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.శివశ్రీ మహేష్ శాస్త్రి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచకలశ స్థాపన అనంతరం శ్రీ మరకత ఉమా మహేశ్వర స్వామివారితో పాటు పంచాయతన దేవతలకు విశేష మండలాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, బలిహరణం, కలశ ఉద్వాసన, కలశ జలప్రోక్షణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.
ఈ సందర్భంగా ఆలయ స్థలదాత, అధ్యక్షుడు ఆలూరి అప్పారావు మాట్లాడుతూ.. శ్రీ ఉమా మహేశ్వర స్వామివారి ఆశీస్సులతో 41 రోజుల మండల పూజలు విజయవంతంగా పూర్తికావడం ఆనందంగా ఉందన్నారు. ప్రాణప్రతిష్ఠ నుంచి మండల పూజల వరకు ప్రతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సహకరించిన భక్తులు, సమాజం సభ్యులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఆలయ నిర్మాణదాత, జనరల్ సెక్రటరీ ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. స్వామివారి ఆలయ నిర్మాణం, పూజా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తమకు ఎంతో పుణ్యకార్యమన్నారు. ఉమా మహేశ్వర స్వామివారి కృపతో భక్తులందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు ఇప్ప నరసింహులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ అధ్యక్షుడు ప్రసాది మధుశేఖర్, సమాజం సభ్యులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
శ్రీ ఉమా మహేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## కొల్లంపల్లిలో టీబీ ఏ సి ఎఫ్ క్యాంప్



**నారాయణపేట అక్టోబర్5 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామంలో సోమవారం టీబీ యాక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, పరీక్షలు చేయించుకోవడం, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సిద్ధప్ప వ్యాధి నివారణ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు.
అనంతరం ప్రోగ్రాం అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ టీబీ మందు లను క్రమం తప్పకుండా తీసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం చికిత్సను పూర్తిగా కొనసాగించడం వల్ల వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. తర్వాత టీబీ బాధితులకు ఫుడ్ బాస్కెట్ కిట్ లను పంపిణీ చేశారు.ఈ కార్య క్రమంలో సర్పంచ్ మన్నెమ్మ , ఉప సర్పంచ్ గోమాలి బజరంగ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీకాంత్, డాక్టర్ సాయిరాం, డాక్టర్ నరసింహారావు, ఎన్సిడి కోఆర్డినేటర్ విజయ్ కుమార్,టీవీ సూపర్వైజర్లు ప్రసాద్, దశరథ్ ల్యాబ్ టెక్నీషియన్ ఏఎన్ఎం ఆశలు వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఫోన్ నంబర్ ఇవ్వరు..!

- **సమాచారం కోసం అడిగినా స్పందించని కిందిస్థాయి సిబ్బంది.. ప్రజల్లో ఆవేదన**

**సంగారెడ్డి కలెక్టరేట్ వుదయం**




సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ కార్యాలయంలో అధికారుల పని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఫోన్ నంబర్‌ను సమాచారం కోసం అడిగితే కిందిస్థాయి సిబ్బంది ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా ఇంటర్మీడియట్ అధికారికి సమాచారం అందించేందుకు, అధికారిక పని నిమిత్తం ఫోన్ నంబర్ అడిగితే.. అది తన వ్యక్తిగత నంబర్ అని, ఎవరికీ ఇవ్వవద్దని అధికారి చెప్పారని సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారిని సంప్రదించేందుకు కనీసం అధికారిక సంప్రదింపు మార్గం కూడా అందుబాటులో లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గతంలో ఇదే కార్యాలయానికి సంబంధించిన ఓ అధికారి ఏసీబీకి పట్టుబడిన ఘటనలో ఫోన్ సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు, కిందిస్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, సమాచారం కోసం ఫోన్ నంబర్ అడిగితే ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, విద్యార్థులు, కళాశాలలకు సంబంధించిన విషయాల్లో అధికారులను ఎలా సంప్రదించాలన్నది స్పష్టం చేయాలని కోరుతున్నారు.ప్రభుత్వ కార్యాలయంలో అధికారిక సంప్రదింపు నంబర్ అందుబాటులో ఉంచి, ప్రజలకు అవసరమైన సమాచారం సులభంగా అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే టీపీటీఎఫ్ లక్ష్యం




- **తొగుటలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి :**

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) తొగుట మండల శాఖ నాయకులు తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.కాన్గల్, బండారుపల్లి, తొగుట, వెంకట్రావుపేట, గుడికందుల తదితర గ్రామాల్లోని పాఠశాలలను టీపీటీఎఫ్ నాయకులు సందర్శించి ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడు బి. రాములు, ప్రధాన కార్యదర్శి బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు నరసింహారెడ్డి, మల్లేశం, సీనియర్ కార్యకర్తలు లక్ష్మారెడ్డి, వేణు, అమరేందర్‌రెడ్డి, మోహన్, వెంకట నర్సింలు, విశ్వరూపం తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను క్రోడీకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని నాయకులు తెలిపారు.

## జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి



- **అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు అందించాలి**
- **పోస్ట్ కార్డు ఉద్యమంలో టీయూడబ్ల్యూజే-హెచ్143 రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా ఖాన్**

**నాగర్ కర్నూల్, అక్టోబరు 5 (వుదయం బ్యూరో):**

జర్నలిస్టులు అందరికీ హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు అందించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు నాయక్ లు డిమాండ్ చేశారు.
టీయూడబ్ల్యూజేహెచ్ 143 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ లో గల మహాత్మా గాంధీ విగ్రహం ముందు సోమవారం ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు అందించాలని కోరుతూ రాతపూర్వకంగా పోస్ట్ కార్డుల ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా అబ్దుల్లా ఖాన్, చందు నాయక్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. సమాజంలో నాల్గవ స్తంభంగా చెప్పుకునే మీడియా రంగంలో పనిచేసే జర్నలిస్టులకు కనీసం హెల్త్ కార్డు సౌకర్యం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని హెల్త్ కార్డులను ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా జారీ చేయాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. మీడియా వృత్తినే సర్వస్వంగా భావించి కొనసాగుతున్న వారికి ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వృత్తినే నమ్ముకొని పని చేస్తున్న వారికి కనీసం గూడు కూడా లేకపోవడం బాధాకరమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన నాలుగు ఎకరాలలో స్థలాలు కేటాయిస్తూ శాశ్వత పట్టాలు అందించాలని, ఇందుకోసం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.అదేవిధంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను వెంటనే జారీ చేసి జర్నలిస్టులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే హెచ్ 143 పోరాట ఫలితంగా మూడవ విడత అక్రిడేషన్ కార్డులను నాగర్ కర్నూల్ జిల్లాలో జారీ చేయడం జరిగిందని, అనేక ఉద్యమాల ఫలితంగా మూడవ విడత కార్డులు వచ్చాయని, కార్డులు వచ్చిన రోజే ప్రత్యర్థి యూనియన్ వారు తమ వల్లే అక్రిడేషన్ వచ్చినట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శేఖరాచారి, ఏటిగడ్డ వెంకటేష్, పులిజాల బాలస్వామి, మల్లిపెద్ది.రమేష్, అహ్మదుల్లా ఖాన్, యూనియన్ రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాస్ గౌడ్, జర్నలిస్టులు మహమ్మద్ సాదిక్, శేఖర్, రామకృష్ణ, జంగిటి రాజేష్, గంధం ప్రసాద్, సయ్యద్ రబ్బాని, వెంకటస్వామి, ఇర్ఫాన్ ఖాన్, విజయేందర్ రెడ్డి, అచ్చంపేటకు చెందిన జర్నలిస్టులు ప్రకాష్, గోపి, బాలీశ్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి)**



సోమవారం జిల్లా కలెక్టర్ పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో భూ రీసర్వేలో భాగంగా చేపడుతున్న విలేజ్ బౌండరీ(హద్దుల గుర్తింపు) పనులను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.
కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేయడంతో పాటు, గ్రామ పంచాయతీలో పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామంలో రీసర్వే పనులను అక్టోబర్ 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హద్దుల గుర్తింపు పనుల్లో జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం వీరాయపల్లి గ్రామంలో ఒంటరి మహిళా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రమీల అనే లబ్ధిదారురాలి ఇంటికి కలెక్టర్ వెళ్లి దరఖాస్తును పరిశీలించి, వివరాలను స్వయంగా తనిఖీ చేసి ధ్రువీకరించారు. పింఛన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దరఖాస్తుల వెరిఫికేషన్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
తదుపరి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి అవసరానికి మించి ఖర్చు చేయకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా బేస్‌మెంట్‌లను అనవసరంగా ఎత్తు పెంచి అదనపు వ్యయం చేయవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఈ విషయంలో అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ, నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం కోసం అర్హులైన లబ్ధిదారులకు గ్రామ స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.
అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జెడ్పి సీఈవో యాదయ్య, ఇతర అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

- **మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో 80మంది కాంగ్రెస్ లో చేరిక...**

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర దేవస్థానంలో సోమవారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పాలఅభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం గ్రామంలోని పోచమ్మ, మల్లన్నస్వామి ,పెద్దమ్మ దేవాలయాలలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కురుమ కులస్తులు గొంగడికప్పి గొర్రెపిల్లను అందించారు.అలాగే కల్వకుంట లో బీఆర్ఎస్ పార్టీకి మాజీ సర్పంచ్,వార్డు మెంబర్‌తో పాటు సుమారు 80మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
**ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ**
కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని అన్నారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే చల్మెడ రోడ్డుకు సంబంధించి 2023 లో రోడ్డు విషయంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాదయాత్ర చేస్తే హరీష్ రావు బంధువు అయినటువంటి కాంట్రాక్టర్ కిషన్ రావు జాప్యం వల్లనే రోడ్డు పనులు కావడం లేదని త్వరలో అతని కాంట్రాక్టర్ రద్దుచేసి మరో కాంట్రాక్టర్ కు అందించి రోడ్డు పనులను ప్రారంభిస్తామని మైనంపల్లి హనుమంతరావు హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో పురోహితులు శివ, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, రామాంపేట సొసైటీ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి,నసీరుద్దీన్, రవీందర్ రెడ్డి,రంగా రాజకిషన్,లింగం గౌడ్, మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సూర రాములు, సర్పంచులు బాబు నాయక్, రామ్ చందర్ నాయక్, అంజమ్మ లక్ష్మా గౌడ్, సుశీలసురేష్, ముత్యాల సరిత మధుసూదన్ రెడ్డి,ఉప సర్పంచ్ మహేందర్, కొమ్మాట సత్యనారాయణ, గ్రామస్తులు గ్రామ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, కోమ్మాట బాబు,రాజేష్,గన్నారం వెంకట గౌడ్, రంగా నర్సింలు ,కాస రాజేశం, లింగస్వామి, అజయ్, సామల మహేష్,శ్రీకాంత్ గౌడ్,బత్తుల మధు,సులేమాన్ పాల్గొన్నారు.



## ఈహెచ్‌ఎస్ కార్డు ఉన్నా వైద్యం అందదా?

- **ప్రైవేటు ఆస్పత్రుల నిరాకరణపై ప్రభుత్వం ఇంకా ఎందుకు మౌనం?**
- **జీతాల నుంచి కాంట్రిబ్యూషన్ వసూలు చేస్తూ.. అవసరమైన వేళ వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిప్పుతారా?**
- **ఉద్యోగి, ఉపాధ్యాయుడు, పెన్షనర్ ఆరోగ్య భద్రతపై నిర్లక్ష్యం ఎందుకు?**

**వికారాబాద్ అక్టోబర్ 5 (వుదయం బ్యూరో)**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం అమలు చేస్తున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) అమలు తీరు మరోసారి ప్రశ్నార్థకంగా మారుతోంది. చేతిలో ఈహెచ్ఎస్ కార్డు ఉన్నా.. అత్యవసర సమయంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు ఇబ్బందులు ఎదురైతే ఆ పథకం ఉద్దేశం ఏమిటన్న ప్రశ్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ వర్గాల నుంచి వినిపిస్తోంది. కొన్ని ఆస్పత్రులు ఈహెచ్ఎస్ కింద చికిత్స అందించేందుకు నిరాకరిస్తున్నాయనే ఆరోపణలు, ఫిర్యాదులు వెలువడుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఎందుకు వేగంగా స్పందించడం లేదన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**కార్డు ఉంది.. కానీ వైద్యం ఎక్కడ?**

ఈహెచ్ఎస్ పథకం ద్వారా ఉద్యోగి, ఉపాధ్యాయుడు లేదా పెన్షనర్‌కు అవసరమైన సమయంలో నగదు భారం లేకుండా మెరుగైన వైద్యం అందుతుందనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను అమలు చేస్తున్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లినప్పుడు ఈహెచ్ఎస్ కార్డును అంగీకరించకుండా ముందుగా నగదు చెల్లించాలని కోరితే.. పథకం ప్రయోజనం ఎక్కడ ఉందన్న ప్రశ్న తలెత్తుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆ సమయంలో డబ్బుల కోసం కుటుంబ సభ్యులను పరుగులు పెట్టించుకోవాల్సి వస్తే.. అది ఆరోగ్య భద్రతకు భరోసా ఎలా అవుతుంది?

**ప్రతి నెల కాంట్రిబ్యూషన్.. అవసరమైనప్పుడు నిరాకరణ?**



ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తమ వంతుగా క్రమం తప్పకుండా కాంట్రిబ్యూషన్ చెల్లిస్తున్నారు. జీతం నుంచి లేదా సంబంధిత విధానంలో కాంట్రిబ్యూషన్ వసూలు చేస్తున్నప్పుడు పథకంపై ప్రభుత్వానికి స్పష్టమైన బాధ్యత ఉంటుంది. అత్యవసర సమయంలో డబ్బులు అడిగితే.. బాధ్యత ఎవరిది?

**317 జీవో అనుభవం గుర్తు చేసుకోవాల్సిందే!**

**ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల ఆవేదనను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ ప్రభావం తప్పదా?**

ప్రభుత్వం చెప్పాల్సిన ప్రశ్నలు ఇవే ఈహెచ్ఎస్ కార్డు ఉన్నా చికిత్స ఎందుకు నిరాకరిస్తున్నారు? కాంట్రిబ్యూషన్ తీసుకుంటున్నప్పుడు వైద్య భరోసా ఎందుకు కనిపించడం లేదు?ప్రైవేటు ఆస్పత్రులపై పర్యవేక్షణ ఎవరిది?అత్యవసర సమయంలో డబ్బులు అడిగితే ఉద్యోగి ఎవరిని సంప్రదించాలి? ఫిర్యాదు పరిష్కారానికి రాష్ట్రస్థాయి వ్యవస్థ ఎందుకు ఉండకూడదు?ఈహెచ్ఎస్ సమస్యపై ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి?ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల నుంచి కాంట్రిబ్యూషన్ తీసుకుంటే.. అవసరమైన సమయంలో వారికి వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యతను కూడా అదే నిబద్ధతతో నిర్వర్తించాలి. 317 జీవో విషయంలో ఎదురైన అసంతృప్తి అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుని, ఈహెచ్ఎస్ సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా ఇప్పుడే పరిష్కరించాలి.ఈహెచ్ఎస్ పథకం ఉండటం కాదు ముఖ్యం.. అవసరమైన వేళ అది పనిచేయడమే అసలు పరీక్ష. ఉద్యోగి, ఉపాధ్యాయుడు, పెన్షనర్ ఆస్పత్రి గుమ్మం వద్ద నిలబడినప్పుడు "కార్డు ఉంది.. కానీ చికిత్స లేదు" అనే పరిస్థితి రాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

## దసరా ఉత్సవాల సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన దసరా ఉత్సవ కమిటీ.



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 5.**

దసరా ఉత్సవాల సందర్భంగా రాంగలీలా మైదాన్ (ఉర్సు గుట్ట), ఖిలావరంగల్‌కు చెందిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ వివరాలను కలెక్టర్‌కు కమిటీ సభ్యులు వివరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడు గోపాల్ నవీన్ రాజు కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, జనరల్ సెక్రెటరీ మేడిది మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న గౌడ్, సంయుక్త కోశాధికారి వెలిది శివమూర్తి, ఉత్సవ కన్వీనర్ వొద్నాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## ఈవీ ఎలక్ట్రిక్ స్కూటర్ షోరూం ప్రారంభం

**పీసీసీ సభ్యులు పెండెం రామానంద్.**



**నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 5.**

నర్సంపేట మున్సిపల్ పరిధిలోని మల్లంపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జగదాంబ ఎం జి 1 భూమ్ ఈవీ వెహికల్ షోరూంను తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్ సోమవారం ప్రారంభించారు. షోరూం ప్రొప్రైటర్లు చల్ల నిరంజన్ రెడ్డి, మోకిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ షోరూం ప్రారంభోత్సవానికి పెండెం రామానంద్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ఇంధన ధరలు, పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన ఎలక్ట్రిక్ వాహనాలను అందించేందుకు నూతన షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, ముత్తినేని వెంకన్న, బీరం భరత్ రెడ్డి, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, శ్రీరామోజు రోజా రాణి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల పెల్లి సందీప్, సొసైటీ డైరెక్టర్ మామిళ్ల రాజిరెడ్డి, 4వ వార్డు అధ్యక్షులు మంచినీళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



**నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 5.**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో నూతన విద్యార్థుల స్వాగతోత్సవం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలోని గ్రంథాలయం, ప్రయోగశాలలు, క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, సాంస్కృతిక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డా. బి. సత్యనారాయణ, స్టాఫ్ సెక్రటరీ ఎం.ఎం.కె. రహిముద్దీన్, కెరీర్ గైడ్ సెల్ ఇన్‌చార్జి డా. ఎం. సోమయ్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు,పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ఆడబిడ్డలకు 'కల్యాణ లక్ష్మి' వరం..



**పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి..**

**రాయపర్తి అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం నిరుపేదలకు వరంనీ పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తి క్యాంప్ ఆఫీసులో రాయపర్తి మండల చెందిన కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో కుమార్తెల వివాహం భారంగా మారుతున్న కుటుంబాలకు ఈ పథకం అండగా నిలుస్తోంది.ఆడబిడ్డల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, పేద కుటుంబాల సంక్షేమానికి కల్యాణ లక్ష్మి పథకం దోహదపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, బ్లాక్ అధ్యక్షులు హమ్యనాయక్,మండల పార్టీ అధ్యక్షు లు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నంగునూరు అశోక్, కుందూరు రామ్ రెడ్డి ,గబ్బెట బాబు, సర్పంచులు రాయిని యాకన్న, చెవ్వు హేమలత కాశీనాథ, శిల హేమలత రత్నాకర్ రెడ్డి, భూక్యా శ్రీలత సమ్మయ్య, సోముల నాయక్ , గోపాల్ , సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతారంలో కమ్యూనిటీ ఇంకుడుగుంటకు శ్రీకారం



**భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యం.**

**గ్రామ సర్పంచ్ తౌటి శ్రీలత - దేవేందర్**

**పర్వతగిరి , అక్టోబర్ 5 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండలం అనంతారం గ్రామంలో భూగర్భ జలాలను పరిరక్షించడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంచే లక్ష్యంతో అనంతారం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ ఇంకుడుగుంట ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సోమవారం సర్పంచ్ తౌటి శ్రీలత దేవేందర్ ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్‌లో నీటి సమస్యలను అధిగమించవచ్చన్నారు. కమ్యూనిటీ ఇంకుడుగుంటల ఏర్పాటుతో భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ రతన్ బాబు, పంచాయతీ కార్యదర్శి కవిత, ఈసీ రాజు, ఎఫ్ఏ తిరుపతి, వార్డు సభ్యులు జ్యోతి యుగంధర్, కుమారస్వామి, ఆలయ ఉపాధ్యక్షుడు చందర్ రావు, కార్యదర్శి మల్లికార్జున్, అనంతరావు, పురోహితులు లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం పోటీలు

**నర్సంపేట అటవీ శాఖ రేంజర్ నరేష్.**

**ఖానాపురం, అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**



వన్యప్రాణుల వారోత్సవాలలో భాగంగా మండలంలోని బుధరావుపేట ఆదర్శ పాఠశాలలో ని విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం పోటీలను నర్సంపేట అటవీశాఖ రేంజర్ నరేష్ ఆదేశాలను సారం మోడల్ స్కూల్ విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాధాన్యత, జీవవైవిధ్య పరిరక్షణ, ప్రకృతి సమతుల్యతలో వన్యప్రాణుల పాత్ర తదితర అంశాలపై పోటీలను నిర్వహించినట్లు అటవీశాఖ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు గీత, అజాలియా, అయేషా, గౌసియా ఆఫ్రిన్, సాయిప్రియ, శాలిని, మహేశ్వరి, బిందుప్రియలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పేరక సునీత, కాసుల రవికుమార్ తో కలిసి ఫారెస్ట్ సిబ్బంది వెంకటేష్ బహుమతులను విద్యార్థులకు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం ఫారెస్ట్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కాజీపేట్ దర్గా బంధం చెరువులో బతుకమ్మ సంబరాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**వినాయక విగ్రహాల అవశేషాలను వెంటనే తొలగించాలి**

**మున్సిపల్ అధికారులకు స్థానిక ప్రజల విజ్ఞప్తి**

**కాజీపేట్ అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి):-**



కాజీపేట దర్గా సమీపంలోని చారిత్రాత్మక బంధం చెరువు వద్ద వినాయక నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా ముగిసాయి. అయితే, నిమజ్జనం పూర్తయిన తర్వాత చెరువులో మిగిలిపోయిన విగ్రహాల పీఓపీ అవశేషాలు కర్రలు ఇనుప ఫ్రేము పూజ సామాగ్రి అలాగే పేరుకుపోయి ఉన్నాయి. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ అత్యంత సమీపంలో ఉండడంతో స్థానిక మహిళలు మరియు భక్తులు ఈ చెరువు వద్ద బతుకమ్మ సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు ఈ నేపథ్యంలో నీటిలో ఉన్న పదునైన ఇనుప రాడ్లు కర్రల ఫ్రేమ్లు వల్ల బతుకమ్మను నిమజ్జనం చేసే సమయంలో మహిళలకు చిన్న పిల్లలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తక్షణ చర్యలు చేపట్టాలి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు చెరువులో ఉన్న విగ్రహాల ఫ్రేములను వ్యర్థాలను పూర్తిగా పక్కకు తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు తద్వారా మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తిశ్రద్ధలతో బతుకమ్మ పండుగను జరుపుకునేలా చూడాలని స్థానిక కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు

# ప్రాణం ఖరీదు ఐదు లక్షల?

**అర్హత లేని వైద్యం వికటించి వ్యక్తి మృతి.?**

**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 05 (వుదయం ప్రతినిధి) :**

ఓ వ్యక్తి ప్రాణం ఖరీదు ఐదు లక్షల ఆ వ్యక్తి మీద ఆధారపడ్డ కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లిస్తే భర్తీ అవుతుందా అని కాటారం సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాలలో ప్రజలలో చర్చలు జరుగుతున్నాయి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఘోర నిర్లక్ష్యం వెలుగుచూసింది. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అర్హత లేని సిబ్బంది అందించిన వైద్యం వికటించి ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే కాటారం మండలం ఓ గ్రామానికి చెందిన కుమార్ (40) అనే వ్యక్తి శనివారం సాయంత్రం వ్యవసాయ పనుల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఛాతిలో తీవ్రమైన నొప్పితో బాధపడ్డాడు. కంగారుపడిన కుటుంబ సభ్యులు అతడిని తక్షణ చికిత్స కోసం కాటారంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు కుమార్ ఆసుపత్రికి వచ్చే సమయానికి అక్కడ బాధ్యతగల వైద్యులు ఎవరూ అందుబాటులో లేరు. కేవలం ఒక సిబ్బంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. అత్యవసర పరిస్థితిని అంచనా వేయడంలో విఫలమైన ఆ సిబ్బంది తనకు ఎలాంటి సర్టిఫైడ్ అధికారం లేకపోయినప్పటికీ సొంతంగా వైద్యం అందించి, ఇంజెక్షన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఇంజెక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే కుమార్ పరిస్థితి విషమించిందని ఊపిరి ఆడక విలవిలలాడుతున్న అతడిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యంలోనే కన్నుమూశాడు అని ప్రజలు అనుకుంటున్నారు.

వైద్యం వికటించి కుమార్ మృతి చెందడంతో ఆసుపత్రి యాజమాన్యం తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించిందని పోలీసు కేసు కాకుండా చూసేందుకు, బాధితుడి ప్రాణం ఖరీదును ఐదు లక్షల రూపాయలు గా కడుతూ బంధువులతో లోపాయికారీ బేరసారాలకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన కుమార్ మరణంతో అతని భార్య, పిల్లలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్ళిపోయారు. ఆసుపత్రి యాజమాన్యం, నిర్లక్ష్యం వల్లే కుమార్ ప్రాణాలు కోల్పోయాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు ఇదిలా ఉంటే ఓ వ్యక్తి ప్రాణం ఖరీదు ఐదు లక్షల రూపాయల అంటూ ఆ వ్యక్తి మీద ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు 5 లక్షలతో నష్టాన్ని భర్తీ చేయగలరా అంటు ప్రజల్లో చర్చలు జరుగుతున్నాయి సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి వైద్యం పేరుతో దోపిడీ చేసి నిర్లక్ష్య ధోరణి వహిస్తూ వైద్యం పేరిట ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతి నీ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు..?

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు భంగపాటు తప్పదు



**పట్టభద్రులు బీజేపీ అభ్యర్థి వైపే.. పల్లె కుమార్**

**రాయపర్తి అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి ):**

రాబోయే వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భంగపాటు తప్పదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె కుమార్ అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావి వర్గాలు బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. రాయపర్తి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన సోమవారం సేవా జ్యోతి యాత్ర, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లె కుమార్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు వెంటనే ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఎన్రోల్ చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటు హక్కు ఉన్న వారు సైతం మరోసారి ఎన్రోల్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు.మోదీ 25 ఏళ్ల సుపరిపాలనకు సేవా జ్యోతి యాత్ర ప్రధాని నరేంద్ర మోదీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఈ నెల 7వ తేదీతో 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా జ్యోతి యాత్ర నిర్వహిస్తున్నట్లు పల్లె కుమార్ తెలిపారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా, మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ సుదీర్ఘకాలంగా సుపరిపాలన అందిస్తున్న మోదీకి కృతజ్ఞతగా బీజేపీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రతి జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నరేందర్, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, రావుల అనిల్, మండల ప్రధాన కార్యదర్శులు మందపురి రాజు, నిమ్మల అనిల్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల సుమన్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు చిర్ర నాగరాజు, అబ్బోజు వీరబ్రహ్మం, మండల కార్యదర్శులు మందపురి రాజశేఖర్, కొంగ అశోక్, ఓబీసీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రసాలు రాకేష్, యువ మోర్చా మండల అధ్యక్షుడు జక్కుల సందీప్ యాదవ్, నాయకులు భాస్కర్, రాకేష్, సిద్ధు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోను నిర్వీర్యం చేయొద్దు తగ్గించిన బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలి వంగల రాగసుధ



**నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 5.**

నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి తగ్గించిన బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించి, డిపోను మరింత బలోపేతం చేయాలని ఏఐఎఫ్‌డీడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ, జిల్లా కార్యదర్శి కనకం సంధ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎఫ్‌డీడబ్ల్యూ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట-నిజామాబాద్‌తో పాటు ఆదిలాబాద్, శ్రీశైలం, భద్రాచలం తదితర మార్గాల్లో తగ్గించిన సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఇతర డిపోలకు తరలించిన బస్సులను తిరిగి తీసుకురావడంతో పాటు కొత్త బస్సులు కేటాయించాలని, డ్రైవర్లు, కండక్టర్ల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బస్సు సర్వీసులు తగ్గించడం వల్ల విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రజా రవాణాను బలోపేతం చేయకుండా ప్రైవేటు వాహనాలపై ఆధారపడే పరిస్థితి కల్పించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా రవాణా హక్కుల కోసం అవసరమైతే ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మార్త సుధ, జిల్లా కమిటీ సభ్యురాలు గణిపాక బిందు పాల్గొన్నారు.

## విహారి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 30 వ వార్షికోత్సవ వేడుకలు

**వరంగల్ టౌన్,అక్టోబర్ 5 (వుదయం) :**



వరంగల్ ఎస్వీఎన్ రోడ్డు బట్టల బజార్లో విహారి ఫ్రెండ్స్ అసోసియేష ను గత 30 సంవత్సరాల నుండి అంకిత భావం, సేవ భావంతో సమిష్టిగా సహాయ సహకారాలు అందిస్తూ 30 వ వార్షికోత్సవ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి గతంలో చేసిన స్వచ్ఛంద కార్యక్రమాలు మరియు భవిష్యత్తులో కార్యచరణ రూపం గురించి చర్చించి ముందుకు పోదామని అధ్యక్ష కార్యదర్శులు టి. అశోక్, గందె గోవిందరాజులు సభ్యుల సమక్షంలో ఏకగ్రీవ తీర్మానంతో నిర్ణయించడమైనది. ఈ సందర్భంగా వరంగల్ రామన్నపేట లోని డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్. ఏ . రాజేంద్రప్రసాద్ గత 26 సంవత్సరాల నుంచిరాజేంద్రప్రసాద్ చేస్తున్న స్వచ్ఛంద,సామాజిక, వైద్య, విద్య ఆర్థిక సహాయ సహకారంతో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలుఅందించడంలో ముందుకు సాగుతున్న సందర్భంగా గౌరవ సూచకంగా సభ్యులందరూ కలిసి ఘనంగా సన్మానించడం జరిగినది. మేనేజింగ్ ట్రష్టి మాట్లాడుతూ మీరు నాపై ఉన్న అభిమానంతో నమ్మకంతో ఆప్యాయంగా సన్మానించడం వల్ల నా బరువు బాధ్యతలు ఇంకా పెరిగిందని సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లాడి అప్పారావు, అల్లాడి కుమారస్వామి, రఘువీర్, పులిమాటి మనోహర్, టి.అశోక్ కుమార్ ఇంకా 30 మంది సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 5.**



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 248 దరఖాస్తులు అందగా, రెవెన్యూ శాఖకు 90, జీడబ్ల్యూఎంసీకి 61, డీఆర్డీవోకు 24, హౌసింగ్ శాఖకు 13, ఇతర శాఖలకు 48 దరఖాస్తులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో సంయమనం పాటించాలని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకుండా సహనం వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్, వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్‌వో డా. రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, హౌసింగ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగడం సిగ్గుచేటు

**జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో వెంటనే స్కూలుకు ప్రహరీ గోడ మంజూరు చేయాలి.**

**స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన.**

**ఖానాపురం, అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని నాజీతండా గ్రామపంచాయతీ పరిధిలోని రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని గుర్తుతెలియని వ్యక్తులు దేవాలయంగా భావించే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మద్యం సేవించడం సిగ్గుచేటని అట్టి వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ ను పోలీస్ శాఖను గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గ్రామంలోని రహదారి ప్రక్కనే పాఠశాల ఉండడం ఈ రహదారి గుండా గుంజేడు, కొత్తగూడ వెళ్లేవారు పగలనకా రాత్రనకా వెళ్తారని వెళ్లే వాళ్ల, గ్రామస్తుల ఇలాంటి సంఘటనకు పాల్పడ్డ వారిని గుర్తించి మరల ఏ ప్రభుత్వ పాఠశాల ఆవరణ ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలుపుతూ, జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేసే విధంగా నిధులు మంజూరు చేసి తక్షణమే ప్రహరీ కూడా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు విద్యను అభ్యసించే విధంగానే ఉండాలి తప్ప పాఠశాలకు వెళ్లగానే విద్యార్థులకు మద్యం బాటిల్ దర్శనమిచ్చే విధంగా ఉండకూడదని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జెతురాంను వివరణ కోరగా ప్రతిరోజు మాదిరిగానే పాఠశాలకు సోమవారం ఉదయం వచ్చేసరికి



పాఠశాల ఆవరణలో మద్యం సేవించిన కాళీ బాటిల్లు ప్లాస్టిక్ గ్లాసులు పాఠశాల ఆవరణలో ఉండడం వెంటనే వాటిని తీసివేయించి శుభ్రం చేయించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలుపుతూ, విద్యార్థులు దేవాలయంగా భావించే పాఠశాల ఆవరణలో మద్యం సేవించడం దురదృష్టకరమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలుపుతూ, గ్రామంలోని యువత రాత్రి వేళల్లో పాఠశాల వైపు కన్నేసి ఉంచాలని తెలిపారు.

## తప్పుడు బిల్లులపై సంతకాలు చేయం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



**ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకటి కరుణాకర్**

**రాయపర్తి అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**

గ్రామపంచాయతీల్లో తప్పుడు బిల్లులు, నిబంధనలకు విరుద్ధంగా రూపొందించిన ఖర్చుల వివరాలపై ఉప సర్పంచ్‌లు సంతకాలు చేసేది లేదని ఉప సర్పంచ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీకటి కరుణాకర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడు రోజుల పాటు సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, సంబంధిత బిల్లులకు పూర్తి ఆధారాలు, ఖర్చుల వివరాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. సోమవారం రాయపర్తిలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం బిల్లులపై సంతకాలు చేయడానికి ఉప సర్పంచ్‌లకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే సంతకం చేసే బాధ్యత అప్పగించినప్పుడు బిల్లులు, ఖర్చుల వివరాలను పరిశీలించే అవకాశం, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే అధికారం కూడా కల్పించాలని కోరారు.

తక్కువ ఖర్చుతో పూర్తయిన పనులకు అధిక మొత్తాలు చూపిస్తూ బిల్లులు తయారు చేసి సంతకాల కోసం ఒత్తిడి చేస్తే అంగీకరించబోమని వరంగల్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శి చెనబోయిన రవి యాదవ్ తెలిపారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా చోటుచేసుకుంటే ఆధారాలు సేకరించి కలెక్టర్‌ను కలిసి వాస్తవాలను వివరిస్తామని చెప్పారు.ప్రజాధనాన్ని కాపాడాలి గ్రామపంచాయతీ నిధులు ప్రజల సొమ్మని,

వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని రాయపర్తి మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు దుర్శెట్టి రమేష్ అన్నారు. అవినీతి, నిబంధనల ఉల్లంఘనకు ఉప సర్పంచ్‌ల ఫోరం ఎప్పటికీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. ఎలాంటి జీతం తీసుకోకుండా ప్రజాసేవ చేస్తున్న ఉప సర్పంచ్‌లపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బాధ్యతలు అప్పగించినప్పుడు అందుకు తగిన అధికారాలు, రక్షణ కూడా కల్పించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ

అయితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాయపర్తి ఉప సర్పంచ్ ఫోరం ప్రధాన కార్యదర్శి మునావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. తప్పులు నిర్ధారణైన సందర్భాల్లో నిబంధనల ప్రకారం సర్పంచ్ చెక్ పవర్‌పై ప్రభుత్వం సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కాటారి బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రవి, చిప్ప శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చీర నాగరాజు, కుంభం లలిత, సహాయ కార్యదర్శి బుక్య శ్రీనివాస్, నవీన్, అధికార ప్రతినిధి మచ్చ రమేష్, కోశాధికారి కల్మికొండ బొంద్యాలు, లక్ష్మణ్, మునావత్ ఈర్య నాయక్, హాలవత్ సుధాకర్, కుక్కల మహేందర్, మునిగళ్ళ శ్రీధర్, భూక్యా సర్వాన్, బానోతు బికోజి తదితరులు, వివిధ గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పర్వతగిరి ఎంపీడీఓ ఆఫీస్ ప్రజావాణిలో ఫిర్యాదు

**•వారసత్వ భూమిని గొల్లపల్లి మంజుల గొల్లపల్లి రమేష్ అనే వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్**

**•రూ.40 లక్షల బ్యాంక్ లోన్ పొందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వినతి...**

**పర్వతగిరి, అక్టోబర్ 5 ( వుదయం ప్రతినిధి ):**



తమ వారసత్వ భూమిని అక్రమంగా, తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకులో రూ.40 లక్షల రుణం (లోన్) పొందిన వ్యక్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మండలానికి చెందిన ఇజ్జిగిరి గణేష్, బాధితులు అధికారులను కోరారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... తమకు సంప్రదాయబద్ధంగా వస్తున్న వారసత్వ భూమి సర్వే నెంబర్లు 691/B లో ఒక ఎకరం, 688 లో 10 గుంటలు, 689 లో 29 గుంటలు, 575 లో ఒక ఎకరం, 576/బి లో 6 గుంటలు, 591 లో 18 గుంటలు మరియు 593 లో 12 గుంటల భూమి పహానీలో ఉంది. ఈ భూమి తమ పూర్వీకుల నుంచి తమ ఆధీనంలోనే ఉంటూ,ప్రస్తుతం తామే సాగు చేసుకుంటున్నామని బాధితుడు తెలిపారు. అయితే, తమ కుటుంబ వారసులకు తెలియకుండా తమ భూమిని అక్రమంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, మార్టిగేజ్ (Mortgage) ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇండియా (BOI) నుండి 2016వ సంవత్సరంలో పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మంజుల గొల్లపల్లి రమేష్ అనే వ్యక్తులు రూ. 40 లక్షల లోన్ తీసుకున్నారని ఆరోపించారు. రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సదరు భూమిని వేలం/అటాచ్ చేస్తామని 2020లో నోటీసులు ఇవ్వడానికి వచ్చినప్పుడే ఈ అక్రమం వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. తప్పుడు మార్గంలో చేయించుకున్న ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేసేలా సిఫారసు చేయాలని,ఘటనపై సమగ్ర పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు ఇజ్జగిరి గణేష్ గొల్లపెల్లి కనుకయ్య, బైరి వెంకటస్వామి, రాచకోండ అల్లోరు, ముక్కెర భోజరాజు లు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ విషయంలో తమకు న్యాయం జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను వేడుకున్నారు. అధికారులు ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు భవిష్యత్తులో జరగకుండా నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు.

## ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారంటూ యువతి ఆందోళన

**మున్సిపల్ చైర్మన్ కుమారుడు శ్రీకాంత్‌పై తుమ్మల శ్రీదేవి ఆరోపణలు...**

**చైర్మన్ ఇంటి ఎదుట ధర్నా..**

**ఎమ్మెల్యేను ఆశ్రయించినా న్యాయం జరగలేదని ఆవేదన...**

**వర్ధన్నపేట అక్టోబర్ 5 (వుదయం ప్రతినిధి):**



ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ తుమ్మల శ్రీదేవి సోమవారం వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. చైర్మన్ చిన్న కుమారుడు శ్రీకాంత్ తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆమె ఆరోపించింది.కుల సంఘాలు, ప్రతిపక్ష నాయకులతో కలిసి చైర్మన్ ఇంటి ఎదుట శ్రీదేవి ధర్నా చేపట్టింది. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని శ్రీకాంత్ నమ్మించారని, కొంతకాలం తర్వాత తనకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించింది. ఈ వ్యవహారానికి సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని శ్రీదేవి పేర్కొంది.తనకు జరిగిన అన్యాయంపై ఇప్పటికే సంబంధిత అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేను సైతం ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని శ్రీదేవి కుటుంబ సభ్యులు తెలిపారు.తనకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని శ్రీదేవి స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి

న్యాయం చేయాలని ఆమె, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.కాగా, శ్రీకాంత్‌పై శ్రీదేవి చేసిన ఆరోపణలపై ఆయన లేదా చైర్మన్ కుటుంబ సభ్యుల స్పందన తెలియాల్సి ఉంది.

# చక్కని ఆరోగ్యం

## భోజనం చేశాక తరచూ ఛాతిలో నొప్పి లేదా మంట వస్తున్నాయా..



భారీగా భోజనం చేసిన తర్వాత ఛాతిలో నొప్పి, మంట లేదా అసౌకర్యం కలిగితే చాలామంది దాన్ని సాధారణంగా గ్యాస్, ఎసిడిటీ లేదా అజీర్తిగా భావిస్తారు. అయితే ప్రతి సందర్భంలోనూ ఇది కేవలం జీర్ణ సమస్యే అని నిర్ధారించలేం. కొన్ని సందర్భాల్లో ఛాతి నొప్పి గుండెపోటుకు తొలి సంకేతంగా కూడా ఉండే అవకాశం ఉంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో అడ్డంకి ఏర్పడడం వల్ల గుండె కండరాలకు ఆక్సిజన్ అందక గుండెపోటు సంభవిస్తుంది. మరోవైపు, జీర్ణాశయంలోని ఆమ్లం అన్నవాహికలోకి పైకి రావడం వల్ల గుండెల్లో మంట, ఛాతి అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. రెండు సమస్యలు ఛాతి ప్రాంతంలోనే అనిపించడం వల్ల వాటిని గుర్తించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. సాధారణంగా గుండెల్లో మంట వచ్చినప్పుడు రొమ్ము ఎముక వెనుక భాగంలో మంటగా అనిపించి, అది గొంతు వరకు వ్యాపిస్తుంది. నోటిలో పుల్లని లేదా చేదు రుచి రావడం, ఆహారం పైకి రావడం, త్రేన్పులు, కడుపు నిండినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా ఎక్కువగా భోజనం చేసిన తర్వాత లేదా భోజనం చేసిన వెంటనే పడుకున్నప్పుడు ఈ సమస్య ఎక్కువ అవుతుంది. అయితే అన్నవాహికలో ఆమ్లం పైకి రావడం వల్ల ప్రతిసారీ మంటగానే అనిపించదు. అందుకే ఛాతిలో అసౌకర్యాన్ని కేవలం ఎసిడిటీగా భావించి పదేపదే మందులు వేసుకోవడం కంటే, సమస్య తరచూ వస్తుంటే వైద్యుల సలహా తీసుకోవడం అవసరం. గుండెకు సంబంధించిన ఛాతి నొప్పి సాధారణంగా ఛాతి మధ్యలో ఒత్తిడి, బిగుతు, బరువుగా లేదా నొక్కుతున్నట్లుగా అనిపిస్తుంది. కొద్దిసేపు ఉండి తగ్గిపోయి మళ్లీ వస్తుంది లేదా క్రమంగా తీవ్రత పెరుగుతుంది. ఈ నొప్పి చేతులు, వీపు, మెడ, దవడ, భుజాలు లేదా పొత్తికడుపు పైభాగానికి వ్యాపించే అవకాశం ఉంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లని చెమటలు, వికారం, వాంతులు, తల తిరగడం, అసాధారణ అలసట లేదా గుండె వేగంగా లేదా అసమానంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా మహిళల్లో ఛాతి నొప్పికి బదులుగా అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం లేదా వీపు, భుజం, దవడ ప్రాంతాల్లో అసౌకర్యం కనిపించే అవకాశం ఉంది.

ధూమపానం, అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, గతంలో గుండె సంబంధిత సమస్యలు లేదా కుటుంబంలో చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారు ఛాతి నొప్పిని మరింత తీవ్రంగా పరిగణించాలి. అయితే ఎలాంటి ప్రమాద కారకాలు లేని వారిలోనూ గుండె సంబంధిత సమస్యను పూర్తిగా తోసిపుచ్చలేం. తొలిసారి వచ్చిన ఛాతి నొప్పి, కారణం తెలియని నొప్పి, కొన్ని నిమిషాల పాటు కొనసాగడం లేదా తగ్గి మళ్లీ రావడం, చేతి, దవడ, వీపు లేదా పొత్తికడుపుకు వ్యాపించడం వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లని చెమటలు, వికారం, తల తిరగడం లేదా బలహీనతతోపాటు ఛాతి అసౌకర్యం ఉంటే ఆలస్యం చేయకూడదు. ఆసుపత్రిలో సాధారణంగా ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (ఈసీజీ), గుండె కండరాలకు నష్టం జరిగిందో లేదో తెలుసుకునేందుకు ట్రోపోనిన్ వంటి పరీక్షలు నిర్వహిస్తారు. గుండెపోటు అయితే రక్తప్రసరణను వీలైనంత త్వరగా పునరుద్ధరించడం కీలకం కాబట్టి చికిత్సలో ఆలస్యం ప్రమాదకరంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## సెప్సిస్ అంటే ఏమిటి.. ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

ఛాతీ ఇన్ఫెక్షన్, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ లేదా కొన్ని రోజులుగా కొనసాగుతున్న జ్వరం వంటి సమస్యలు సాధారణంగా సరైన చికిత్సతో తగ్గిపోతాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్‌కు శరీరం స్పందించే విధానం అదుపు తప్పి ఇతర అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఈ పరిస్థితినే సెప్సిస్ అంటారు. ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్న అత్యవసర పరిస్థితి. ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి చికిత్స తీసుకుంటున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడకుండా మరింత క్షీణిస్తే, ఇన్ఫెక్షన్ తీవ్రత పెరిగిందా లేదా ఇతర సమస్యలు ఏర్పడ్డాయా అనే విషయాన్ని వైద్యులు మరోసారి పరిశీలించాల్సి ఉంటుంది. మొదట గుర్తించిన ఇన్ఫెక్షన్ నిజమైనదే అయినప్పటికీ, అది మొత్తం సమస్యకు కారణం కాదని నిపుణులు చెబుతున్నారు. సెప్సిస్ ప్రారంభ దశలో లక్షణాలు సాధారణ ఇన్ఫెక్షన్‌ల మాదిరిగానే కనిపిస్తాయి. అధిక జ్వరం లేదా శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా తగ్గడం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగం పెరగడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. అలాగే అకస్మాత్తుగా గందరగోళానికి గురికావడం, ఎక్కువగా నిద్ర రావడం లేదా మెళకువగా ఉండడం కష్టంగా మారడం, చర్మం పాలిపోయినట్లు లేదా చల్లగా మారడం, కొన్ని గంటల వ్యవధిలో మూత్రం గణనీయంగా తగ్గిపోవడం, ఇన్ఫెక్షన్ తీవ్రతకు మించినట్లు అనిపించే తీవ్రమైన బలహీనత వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తిలో ఈ లక్షణాలు ఒకేసారి కనిపించినప్పుడు లేదా పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించినప్పుడు అత్యవసర వైద్య సహాయం అవసరమవుతుంది. సెప్సిస్ వచ్చే ప్రమాదం అందరిలో ఒకేలా ఉండదు. నవజాత శిశువులు, వృద్ధులు, మధుమేహం లేదా మూత్రపిండాల వ్యాధి వంటి ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రోగ నిరోధక వ్యవస్థను అణిచివేసే మందులు వాడుతున్నవారిలో కూడా ఇన్ఫెక్షన్ తీవ్రంగా మారే అవకాశం ఉంటుంది. డెంగ్యూ, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్ వంటి ఇన్ఫెక్షన్లు కూడా కొన్ని సందర్భాల్లో తీవ్రమైన అనారోగ్యానికి కారణం అవుతాయి. అయితే సెప్సిస్ ఒకే అవయవానికి లేదా ఒకే రకమైన ఇన్ఫెక్షన్‌కు పరిమితం కాదు. శరీరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పడే ఇన్ఫెక్షన్ల నుంచి ఇది అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇన్ఫెక్షన్‌కు చికిత్స తీసుకుంటున్నప్పటికీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గందరగోళం, అసాధారణంగా ఎక్కువ నిద్ర, తీవ్రమైన బలహీనత, రక్తపోటు తగ్గడం లేదా మూత్రం గణనీయంగా తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే పరిస్థితిని సాధారణ ఇన్ఫెక్షన్‌లో భాగంగా భావించకూడదు. సెప్సిస్‌ను ఇంట్లోనే నమ్మకంగా గుర్తించడం సాధ్యం కాదు.



## రోలర్ కోస్టర్ రైడ్ వల్ల తీవ్రమైన మెదడు సమస్యలు వస్తాయా..

రోలర్ కోస్టర్ రైడ్లు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించినప్పటికీ, వాటి వేగం, ఆకస్మిక మలుపులు, ఒక్కసారిగా వేగం పెరగడం లేదా తగ్గడం వంటి కదలికలు శరీరంపై ఒత్తిడిని కలిగిస్తాయి. ముఖ్యంగా తల, మెడ, వెన్నెముకపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఇటీవల అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒక వినోద ఉద్యానవనంలోని వేగవంతమైన రోలర్ కోస్టర్‌పై ప్రయాణించిన కొందరు తీవ్ర మెదడు గాయాలకు గురయ్యారని ఆరోపిస్తూ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రోలర్ కోస్టర్ రైడ్ల వల్ల ఎలాంటి గాయాలు సంభవించవచ్చనే అంశం మరోసారి చర్చకు వచ్చింది. అయితే ఇలాంటి నాడీ సంబంధిత గాయాలు చాలా అరుదుగా నమోదవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. రోలర్ కోస్టర్‌లో ఒక్కసారిగా వేగం పెరగడం, తగ్గడం వల్ల తల వేగంగా కదులుతుంది. శరీరం సీటు, భద్రతా పట్టీలతో స్థిరంగా ఉన్నప్పటికీ తల ముందుకు, వెనక్కి లేదా పక్కలకు వేగంగా కదలడం వల్ల మెడపై ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా తలలో జరిగే భ్రమణ కదలికలు మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని రైడ్లలో సీట్లు లేదా బోగీలు కూడా తిరుగుతుండడంతో ఈ కదలికలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా మెడ, వెన్నెముకతోపాటు తలకు కూడా గాయాలు సంభవించే అవకాశం ఉంటుంది. అయితే సాధారణంగా ఇలాంటి తీవ్రమైన గాయాలు చాలా అరుదుగానే కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోలర్ కోస్టర్ ప్రయాణం తరువాత మెదడులో లేదా మెదడు చుట్టూ రక్తస్రావం జరిగినట్లు వైద్య నివేదికల్లో నమోదైంది. రక్త నాళాలకు నష్టం కలిగితే తలలో ఒత్తిడి పెరిగి అత్యవసర చికిత్స అవసరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. తీవ్రమైన తలనొప్పి, పదేపదే వాంతులు, తికమక, మగత, స్పృహ కోల్పోవడం, ఫిట్స్, చేతులు లేదా కాళ్లలో బలహీనత, మాట్లాడడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. అరుదైన సందర్భాల్లో మెడలోని రక్తనాళాలకు చీలిక ఏర్పడి రక్తం గడ్డ కట్టడం, దాని ప్రభావంతో మెదడుకు రక్తప్రసరణకు అంతరాయం కలగడం వంటి సమస్యలు కూడా నమోదయ్యాయి. గుండె లేదా రక్తనాళాల సమస్యలు, గతంలో నాడీ సంబంధిత సమస్యలు, మెడ లేదా వెన్నెముక సమస్యలు ఉన్నవారు, ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నవారు అధిక వేగంతో కూడిన రైడ్ల విషయంలో ముందుగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ప్రతి వినోద ఉద్యానవనంలోనూ వయసు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితులకు సంబంధించిన భద్రతా సూచనలు ఉంటాయి. వాటిని తప్పకుండా పాటించాలి. ముఖ్యంగా రైడ్ తర్వాత తలనొప్పి, తల తిరగడం లేదా వికారం వంటి లక్షణాలు తీవ్రంగా ఉండటం లేదా తగ్గకుండా కొనసాగితే సాధారణమేనని భావించకూడదు. తీవ్రమైన లేదా పెరుగుతున్న తలనొప్పి, పదేపదే వాంతులు, స్పృహ కోల్పోవడం, ఫిట్స్, బలహీనత, తిమ్మిరి, మాట్లాడడంలో లేదా చూపులో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.



## గుండె సమస్య ఉంటే ఈ అసాధారణ శబ్దమే ముందుగా వైద్యులకు వినిపిస్తుంది..



గుండెకు సంబంధించిన సమస్యలు ఉన్నా ప్రతి ఒక్కరికీ వెంటనే ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపించాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు సాధారణ ఆరోగ్య పరీక్షల్లో వైద్యుడు స్టెతస్కోప్‌తో గుండెను పరిశీలిస్తున్నప్పుడు వినిపించే ఒక అసాధారణ శబ్దమే గుండెకు సంబంధించిన సమస్యకు తొలి సంకేతంగా ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు. గుండె కొట్టుకునే ప్రతిసారీ రక్తం గుండె గదుల గుండా ప్రవహిస్తుంది, గుండె కవాటాలు తెరుచుకుని మూసుకుంటాయి. సాధారణంగా ఈ ప్రక్రియ ఒక క్రమబద్ధమైన శబ్దాన్ని కలిగిస్తుంది. అయితే రక్తప్రవాహం సజావుగా కాకుండా కొంత అస్తవ్యస్తంగా మారినప్పుడు సాధారణ గుండె చప్పుళ్లకు అదనంగా ఒక ప్రత్యేకమైన శబ్దం వినిపిస్తుంది. దీనినే గుండె మర్మర్‌గా పిలుస్తారు. గుండె మర్మర్ వినిపించినంత మాత్రాన గుండెకు తీవ్రమైన సమస్య ఉందని అర్థం కాదు. కొన్ని మర్మర్లు పూర్తిగా ప్రమాదరహితంగా ఉంటాయి, ఎలాంటి సమస్యలకు దారితీయవని నిపుణులు చెబుతున్నారు. అయితే మరికొన్ని గుండె కవాటం సన్నబడడం లేదా సరిగ్గా మూసుకోకపోవడం, గుండె నిర్మాణంలో లోపాలు, రక్తప్రవాహంలో అసాధారణ మార్పులు, పుట్టుకతోనే ఉన్న కొన్ని గుండె సమస్యలకు సంబంధించినవిగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల మర్మర్ అనేది స్వయంగా ఒక వ్యాధి నిర్ధారణ కాదు. గుండెను మరింతగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించే ఒక సంకేతంగా దీనిని చూడాలి. ముఖ్యంగా గతంలో గుండె సమస్యలు ఉన్నవారు లేదా కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు ఇలాంటి అసాధారణ శబ్దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.

గుండె కవాటం సరిగ్గా పనిచేయకపోయినా లేదా రక్తప్రవాహంలో స్వల్ప మార్పులు ఉన్నా, గుండె కొంతకాలం అదనపు శ్రమతో తన పనిని కొనసాగిస్తుంది. అందువల్ల సమస్య ఉన్నప్పటికీ కొందరికి సంవత్సరాల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించవు. సమస్య క్రమంగా పెరిగినప్పుడు సాధారణం కంటే ఎక్కువగా అలసటగా అనిపించడం, గతంలో ఇబ్బంది కలిగించని పనులు చేసినా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, తల తిరగడం, గుండె వేగంగా లేదా అస్తవ్యస్తంగా కొట్టుకున్నట్లు అనిపించడం, చీలమండలు లేదా కాళ్లలో వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు బయటపడే సమయానికి గుండెకు సంబంధించిన సమస్య కొంతకాలంగా ఉండి ఉండే అవకాశం ఉంది. అందుకే లక్షణాలు వచ్చే వరకు వేచి ఉండకుండా సాధారణ ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు. వైద్యుడు కొత్తగా లేదా అసాధారణమైన గుండె శబ్దాన్ని గుర్తించినప్పుడు, ముఖ్యంగా దానికి తోడు ఏవైనా లక్షణాలు ఉన్నా లేదా కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నా, తదుపరి పరీక్షలు అవసరం అవుతాయి. పరిస్థితిని బట్టి ఎకోకార్డియోగ్రామ్ ద్వారా గుండెను అల్ట్రాసౌండ్‌తో పరిశీలించే అవకాశం ఉంది. అలాగే గుండె విద్యుత్ కార్యకలాపాలను తెలుసుకోవడానికి ఈసీజీ చేస్తారు. అవసరమైతే మరికొన్ని గుండె సంబంధిత పరీక్షలను కూడా వైద్యుడు సూచిస్తారు. అనారోగ్యంగా అనిపించకపోయినా గుండెలో సమస్య ఉండే అవకాశం ఉన్నందున సాధారణ శారీరక పరీక్షలు ఇప్పటికీ ముఖ్యమే. గుండె నుంచి వినిపించే అసాధారణ శబ్దాన్ని తగిన పరీక్షలతో వైద్యుడు పరిశీలించడం ద్వారా కొన్ని సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## దృఢత్వాన్ని పెంచే... చతురంగ దండాసనం

చేసే విధానం: ముందుగా యోగా మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. నెమ్మదిగా మోకాళ్ల మీదకు వచ్చి అరచేతులను భుజాల వెడల్పులో నేలపైన అదిమి ఉంచాలి. తర్వాత కాళ్ల వేళ్లపైన శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ రెండు మోకాళ్లను పైకి లేపి శరీరాన్ని ఫలకంలాగా ఉంచండి. భుజాలు నిటారుగా ఉన్న స్థితి నుంచి నెమ్మదిగా



ఫొటోలో చూపిన విధంగా మోచేతులను వంచే ప్రయత్నం చేయాలి. ఛాతీని నేలకు దగ్గరగా తీసుకువెళ్లాలి. అదే సమయంలో నడుము కిందకు దిగకుండా జాగ్రత్తపడాలి. తల నుంచి మడమల వరకు శరీరాన్ని ఒక సరళరేఖపైన ఉన్నట్టుగా నిలిపి సాధారణ శ్వాసలు చేయాలి. ఇలా 10–15 సెకన్లు ఉన్నాక నెమ్మదిగా ఆసనం విడవాలి. ఆపై విశ్రాంతి పొందాలి.

ఉపయోగాలు: పొట్ట తగ్గడానికి సహకరిస్తుంది. కోర్ మజిల్ ఉదర కండరాలు బలోపేతం అవుతాయి. చేతులు, మణికట్టు, భుజాలు దృఢమవుతాయి. మొత్తంగా బలాన్ని పెంచుతుంది.

జాగ్రత్తలు: మణికట్టు, మోచేతి భుజాలు గాయాలు అయినవాళ్లు చేయరాదు. మెడ, నడుము, సమస్యలున్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

## డిజిటల్ తెరలను ఎక్కువ సేపు వీక్షిస్తున్నారా..

స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర డిజిటల్ తెరలు నేటి జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. రోజులో ఎక్కువ సమయం వీటిని చూస్తూ గడపడం, తగినంత నిద్ర లేకపోవడం, ఎక్కువసేపు దగ్గరగా ఉన్న వస్తువులనే చూడడం, శారీరక శ్రమ తగ్గడం, పోషకాహారం తీసుకోకపోవడం, బయట గడిపే సమయం తగ్గిపోవడం వంటి అలవాట్లు కళ్లపై అదనపు భారాన్ని పెంచుతున్నాయి. వయసు పెరిగే కొద్దీ చూపు మందగించడం సహజమేనని చాలామంది భావిస్తారు. అయితే ప్రస్తుత జీవనశైలి కారణంగా చిన్న వయస్సులోనే కళ్ల అలసట, పొడిబారడం, మంట, చికాకు, చూపు సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే తెరలను చూడడం వల్ల కళ్లు ఒక్కసారిగా వృద్ధాప్యానికి గురవుతాయని కాదు. జీవనశైలిలోని కొన్ని అలవాట్లు కళ్లపై ఒత్తిడిని పెంచుతాయి. ఎక్కువసేపు తెరలను చూస్తూ పనిచేసేటప్పుడు మనం సాధారణం కంటే తక్కువగా రెప్పలు వేస్తాం. కొన్నిసార్లు పూర్తిగా రెప్పలు మూయకపోవడం వల్ల కంటి ఉపరితలాన్ని తేమగా ఉంచే పొర అస్థిరంగా మారుతుంది. దీంతో కళ్లు పొడిబారడం, మంట, చికాకు, నీరు కారడం లేదా కంట్లో ఏదో ఉన్నట్లుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే ఎక్కువసేపు దగ్గరగా ఉన్న వస్తువులపై దృష్టి పెట్టడం వల్ల కళ్లకు అలసట కలుగుతుంది. దగ్గర వస్తువుల నుంచి దూరంలోని వస్తువులను చూసేటప్పుడు దృష్టిని మార్చుకోవడంలో తాత్కాలిక ఇబ్బంది ఏర్పడుతుంది. పిల్లలు, యువతలో ఎక్కువసేపు దగ్గరగా చదవడం లేదా తెరలను చూడడం, బయట తగినంత సమయం గడపకపోవడం వంటి అంశాలు హ్రస్వదృష్టి సమస్య పెరగడంతో సంబంధం కలిగి ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. కళ్ల ఆరోగ్యానికి నిద్ర కూడా ఎంతో ముఖ్యం. పని, రాత్రివేళ ఫోన్ వినియోగం లేదా ఎక్కువసేపు వినోద కార్యక్రమాలు చూడడం కోసం నిద్రను తగ్గించుకోవడం వల్ల కళ్లు పూర్తిగా కోలుకునే సమయం తగ్గుతుంది. తరచూ సరిగా నిద్రపోని వారికి కళ్లు పొడిబారడం, అలసట, వెలుతురును తట్టుకోలేకపోవడం, దృష్టిని కేంద్రీకరించడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాగే పొగతాగడం, నియంత్రణలో లేని మధుమేహం, అధిక రక్తపోటు, అనారోగ్యకరమైన ఆహారం వంటి అంశాలు కొన్ని కంటి వ్యాధుల ముప్పును పెంచే అవకాశం ఉంది. కూరగాయలు, పండ్లు, గింజలు వంటి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, ముఖ్యంగా పిల్లలు బయట ఎక్కువ సమయం గడపడం కళ్ల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే స్క్రీన్ లను చూడడం పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. వాటిని సరైన విధానంలో ఉపయోగించడం ముఖ్యం. ఎక్కువసేపు స్క్రీన్ ను చూసేటప్పుడు 20-20-20 విధానాన్ని పాటించాలి. అంటే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి సుమారు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడాలి. తెరను కళ్లకు సౌకర్యంగా ఉండే దూరంలో ఉంచడం, గది వెలుతురు, తెర ప్రకాశాన్ని సరిచేయడం, తరచూ రెప్పలు వేయడం వంటి చిన్న మార్పులు కళ్లపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే చూపు నిరంతరం మసకబారడం, కంటి నొప్పి, కాంతి మెరుపులు, కళ్ల ముందు తేలియాడే మచ్చలు, తీవ్రమైన ఎర్రదనం లేదా చూపులో అకస్మాత్తుగా మార్పు వంటి లక్షణాలను కేవలం తెరల వల్ల వచ్చిన అలసటగా భావించకూడదు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే కంటి వైద్య నిపుణుడిని సంప్రదించడం అవసరం. కళ్ల ఆరోగ్యం కేవలం తెరల వినియోగాన్ని తగ్గించడంపైనే కాకుండా తగిన నిద్ర, పోషకాహారం, శారీరక చురుకుదనం, బయట గడిపే సమయం, క్రమమైన వైద్య సంరక్షణ వంటి మొత్తం జీవనశైలిపై ఆధారపడి ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు.



## మెడని నిర్లక్ష్యం చేస్తున్నారా?



ముఖం అందంగా కనిపించడం కోసం ఎన్నో రకాల క్రీములు, ప్యాక్‌లు వాడతాం. కానీ మెడ భాగానికొచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇరవైల్లో పెద్దగా తేడా తెలియకపోయినా.. వయసు పెరిగే కొద్దీ ఆ ప్రభావం మెడ మీద బాగా కనిపిస్తుంది. మెడ చుట్టూ నల్లటి వలయం, సన్నటి ముడతలు, చిన్న చిన్న పొక్కులతో క్రమంగా చర్మం కాంతి విహీనంగా తయారవుతుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెడ సౌందర్యాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందామా మరి..!

ముఖంపై ఉండే చర్మం కన్నా మెడ చర్మం చాలా పల్చగా, సున్నితంగా ఉంటుంది. అందుకని ఎక్కువ గాఢత కలిగిన సబ్బులను వాడకూడదు. వీలైనంత వరకు రసాయనాలు లేని సబ్బు/ బాడీ వాష్‌లను వాడాలి. అంతేకాదు.. ముఖాన్ని శుభ్రం చేసుకునే ప్రతిసారీ మెడను కూడా శుభ్రపరచుకోవడం అలవాటు చేసుకోవాలంటున్నారు నిపుణులు. చెమట వల్ల మెడపై చాలా త్వరగా మురికి చేరుతుంది. అంతేకాదు నిత్యం మనం ధరించే ఆభరణాల వల్ల కూడా మెడ పైన మురికి పేరుకునే అవకాశం ఉంది. సబ్బుతో పైపై మురికి పోయినా, చర్మ రంధ్రాల్లో పేరుకున్న మలినాలు పోవాలంటే స్క్రబ్బర్ తప్పనిసరి. ఇలా జరగకుండా ఉండాలంటే మనం వేసుకునే ఆభరణాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి రెండుసార్లు స్క్రబ్బర్ వాడాలి. ఫేస్ ప్యాక్ వాడుతున్న ప్రతిసారీ మెడకి కూడా ప్యాక్ వేసుకోవడం తప్పనిసరి. బాగా పండిన అరటి పండు, లేదా గుమ్మడి పండు, బొప్పాయి గుజ్జుతో ప్యాక్ వేసుకుని 20 నిమిషాల తర్వాత కడగడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ముఖంపై చర్మానికి టోనర్ వాడేటప్పుడు మెడకు కూడా టోనర్ అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. కానీ మెడకి టోనర్ రాసుకునేప్పుడు నేరుగా చేతి వేళ్లతో కాకుండా దూదిని వాడాలని సూచిస్తున్నారు నిపుణులు. అలాగే సన్‌స్క్రీన్‌ను కేవలం ముఖానికే కాకుండా మెడకు కూడా అప్లై చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అయితే కొన్ని సందర్భాలలో కొంతమందికి ఇతర ఆరోగ్య సమస్యల వల్ల కూడా మెడ నల్లగా మారుతుంటుంది. అలాంటివారు అందుకు తగిన చికిత్స తీసుకోవడం మేలంటున్నారు.

## మస్కారా నచ్చట్లేదట

కళ్లని తీర్చిదిద్దకుండా అలంకరణ పూర్తవ్వదంటే కాదనలేం కదా! కళ్లకి కాటుక, రెప్పలకు మస్కారా అయితే తప్పక ఉండాల్సిందే. కనురెప్పల వెంట్రుకలు విల్లులా వంగి, మస్కారాతో మందంగా కనిపిస్తోంటే చూపరులను కళ్లే ఆకర్షించేవి. అయితే ఇదంతా ఒకప్పుడు. కనురెప్పలకు ఇన్ని హంగులు వద్దు బాబోయ్ అంటున్నారు ఈ తరం అమ్మాయిలు. అంతేనా 'స్కినిమలిజం'కే మా ప్రాధాన్యం అంటున్నారు. అంటే ఏమీలేదు. ఒకప్పుడు మేకప్ వేస్తేనే అందం అనుకునేవారు. కానీ ఇప్పటి అమ్మాయిలు క్లీన్ గర్ల్ లుక్ కావాలంటున్నారు. అంటే మేకప్ లేని లుక్‌కే ఓటేస్తున్నారు. ముఖానికైనా బీబీ, సీసీ క్రీములు, మచ్చలు దాచడానికి కన్సీలర్లు వాడుతున్నారేమో! కళ్లకి మాత్రం మహా అయితే సన్నటి గీతగా కాటుక అంతే! మస్కారా మాత్రం వద్దే వద్దు అంటున్నారు. అవి మందంగా వెంట్రుకలకు అతుక్కోవడం, చెమటకీ, వేడికీ కరిగిపోయి కళ్లంతా నల్లగా కావడం... కొన్నైతే ఇన్‌ఫెక్షన్‌కీ దారి తీస్తుంటాయి. అన్నింటికీ మించి దీన్ని తొలగించడం పెద్ద ప్రసహనం. ఈ చిక్కులన్నీ వద్దు బాబోయ్ అంటూ చక్కగా సహజంగా మెరిసే కళ్లే చాలంటున్నారు. దీనికి నో మస్కారా ఎరా అనీ పేరు పెట్టుకుంటున్నారు.

మరి మీ సంగతేంటి?



## సహజ వాయువు ధరల పరిమితి పెంపు

అత్యంత క్లిష్టమైన ప్రాంతాల నుంచి వెలికితీసే సహజవాయువు (గ్యాస్)కు ధరల పరిమితిని ప్రభుత్వం పెంచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బీపీ సంస్థలు కేజీ–డీ6 వంటి ప్రాంతాల్లో ఉత్పత్తి చేస్తున్న గ్యాస్‌కు ఇది వర్తిస్తుంది. ఈ గ్యాస్ మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంఎంబీటీయూ)కు ధర 8.90 డాలర్లుగా ఉండగా, అక్టోబరు 1 నుంచి ప్రారంభమైన 6 నెలల కాలానికి 9.89 డాలర్లకు పెంచింది. సంప్రదాయ క్షేత్రాల నుంచి ప్రభుత్వ రంగ సంస్థలు ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్) ఉత్పత్తి చేసే సహజ వాయువుకు ధరల పరిమితిని ఎంఎంబీటీయూకు 7 డాలర్ల వద్దే కొనసాగించింది.




## భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌కు పీటముడి: నిర్మలా సీతారామన్



భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా అవి కొలిక్కి రాలేదు. ఈ పరిణామాల వేళ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వాణిజ్య చర్చలు ఇక స్తంభించిపోయినట్లుగా కన్పిస్తున్నాయని అన్నారు. ఈ డీల్‌తో ఇరుదేశాలు మరిన్ని రాయితీలు పొందడం దాదాపు అసాధ్యంలాగే ఉందన్నారు. దిల్లీలో జరిగిన ఓ బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్న నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ప్రస్తావించారు.
'ట్రేడ్ డీల్ కోసం ఇంకా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ.. ఇరుపక్షాల మధ్య పీటముడి పడినట్లుగా అనిపిస్తోంది. చర్చల పురోగతి నిలిచిపోయే స్థితికి పరిస్థితులు చేరుకున్నట్లుగా ఉన్నాయి. ఇక, ఈ దశ దాటి.. పరస్పరం రాయితీలు ఇవ్వడం, తీసుకోవడం చాలా కష్టమైన పని. అయితే, ఇరు పక్షాలూ అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తే.. చర్చలు ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉండొచ్చని భావిస్తున్నా'' అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. భారత్‌తో వాణిజ్య లోటును పూడ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అయితే, దాన్ని సంప్రదాయ చర్చలతో పరిష్కరించుకోకుండా.. టారిఫ్‌లను ఆయుధంలా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆరంభంలో జరిగిన భారత్–ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ప్రస్తావించారు. అది ఒక విజయవంతమైన డీల్ అని అన్నారు. దాని వల్ల భారత్‌లోని సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.
భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌పై నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో భారత స్టాక్ మార్కెట్లు ఊగిసలాడాయి. సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠ స్థాయి నుంచి ఒక్కసారి 450 పాయింట్లకు పైగా పతనమైంది. ప్రస్తుతం 11.30 గంటల సమయంలో సెన్సెక్స్ 323 పాయింట్ల లాభంతో 72,232 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు పెరిగి 22,507 వద్ద కొనసాగుతున్నాయి. ఈ ఉదయం ఆరంభంలో సెన్సెక్స్ ఒక దశలో 750 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది.

## వరుస నష్టాలకు బ్రేక్.. రాణించిన సూచీలు



దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం రాణించాయి. క్రూడాయిల్ ధరలు, బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు కాస్త చల్లారడం, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై అంచనాలు కాస్త తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ ఉదయం 72,340.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 71,909.70) లాభాల్లో ప్రారంభమైంది. రోజులో చాలా వరకు లాభాల్లోనే కదలాడిన సూచీ ఓ దశలో 700 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివరికి 472.77 పాయింట్లు లాభపడి 72,382.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 133.80 పాయింట్లు పెరిగి 22,555.75 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.29గా ఉంది. సెన్సెక్స్ –30లో ఐటీసీ, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడాయి. హెచ్‌సీఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 102.43 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,157.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఓపెన్ ఏఐ సేఫ్టీ సిస్టమ్ అధిపతి రాజీనామా

వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏఐ (AI) సాంకేతికతను నియంత్రించకుండా వదిలేస్తే.. అది మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని పలువురు టెక్ అధినేతలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ అభివృద్ధికి కృషి చేసిన పలువురు కీలక సంస్థల నిపుణులు పదవుల నుంచి వైదొలుగుతున్నారు. ఈ జాబితాలో



తాజాగా ఓపెన్ ఏఐ (Open AI) సేఫ్టీ సిస్టమ్ అధిపతి డేవిడ్ రాబిన్సన్ చేరారు. ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం సరైనది కాదని ఆరోపిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. 'ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం ఆమోదయోగ్యం కాదని భావించిన OpenAI లోని మాజీ సహోద్యోగులు, పరిశ్రమలోని ఇతర అధికారుల వరుసలో ఇప్పుడు నేను కూడా చేరుతున్నాను. ఏఐ (AI) భవిష్యత్తు.. దానిని నిర్మించే కంపెనీలపై ఆధారపడి ఉంది. ఆ విషయంలో కంపెనీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రమాదకరమైన టెక్నాలజీని ఎలా ఎదుర్కోవాలనే వివేకం వాటికి ఉండట్లేదు. ఇందు కోసం కొంత వినయం అవసరం. అయితే.. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే వ్యక్తులకు సహజంగా వివేకం ఉండదు. ఏఐ భద్రత పట్ల మరింత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. సమస్యలు వచ్చిన తర్వాత రక్షణ చర్యలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేపట్టడం సరైన చర్య కాదు. ఇటీవల పలు ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించాయి. 'హగ్గింగ్ సేఫ్' డేటాను హ్యాక్ చేసిన సమయంలో ఓపెన్ ఏఐ పొరపాటున ఏఐ ఏజెంట్ల సమూహాన్ని బయటకు వదిలింది. దీంతో శిక్షణలో ఉన్న మోడల్ ఇంటర్నెట్ యాక్సెస్ పరిమితులను దాటింది.

## ఇంధన సర్‌ఛార్జీలను పెంచిన ఇండిగో



దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై ఇంధన సర్‌ఛార్జీలను పెంచింది. వరుసగా మూడు నెలలుగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరలు పెరిగాయి. దాంతో నిర్వహణ వ్యయాలు భారం కావడంతో ఈ ఛార్జీలను పెంచినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. అక్టోబర్ 6 నుంచి జరిగే కొత్త బుకింగ్‌లకు ఈ ధరలు వర్తిస్తాయని చెప్పింది. ఈ పెంపుతో విమాన ప్రయాణాలు భారం కానున్నాయి. దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు ఈ పెంపు రూ. 100 నుంచి రూ. 350 వరకు ఉంటుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాంతో ఏటీఎఫ్ (ATF) వ్యయం గత దశాబ్ద కాలంలోనే అత్యధిక స్థాయికి చేరిందని ఇండిగో వెల్లడించింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ ఖర్చులదే గణనీయమైన వాటా ఉండటంతో.. ఈ ధరల పెరుగుదల తమతో సహా అన్ని విమానయాన సంస్థల ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

## హిమాలయ బేబీకేర్ గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్ పోటీ విజేతలు

హిమాలయ బేబీకేర్ నిర్వహించిన 'గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్' పోటీలో దేశవ్యాప్తంగా 12 మంది విజేతలను ప్రకటించింది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాల నుంచి విజేతలను ఎంపిక చేశారు. నలుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.లక్ష విలువైన బంగారం, మరో ఎనిమిది మందికి రూ.10 వేల విలువైన వెండి బహుమతులు అందనున్నాయి. ఈ బహుమతులను టనిష్క్ లేదా కళ్యాణ్ బంగారు నాణేలుగా పొందే అవకాశం ఉంది. పసి పిల్లలతో మధుర జ్ఞాపకాలుపిల్లలతో తల్లిదండ్రులు పంచుకునే మధుర జ్ఞాపకాలను జరుపుకునే ఉద్దేశంతో ఈ పోటీని నిర్వహించారు. ప్రత్యేకంగా రూపొందించిన హిమాలయ బేబీ గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్‌లోని కరపత్రంపై ఉన్న ప్రత్యేక సంకేతాన్ని గుర్తించి, అందులోని సంకేత చిత్రాన్ని స్కాన్ చేసి తమ చిన్నారితో ఉన్న మధుర జ్ఞాపకాన్ని పంపాల్సి ఉంటుంది.పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రూ.500 విలువైన 'మై బేబీ అండ్ మీ' డిజిటల్ పుస్తకాన్ని ఉచితంగా అందించారు. ఈ పోటీ ద్వారా తల్లిదండ్రులు, కుటుంబాలు తమ చిన్నారులతో గడిపిన ప్రత్యేక క్షణాలను పంచుకున్నారు.ఈ ప్రకటనలో భాగంగా వినోతిని లియో, సుశ్రీ సంగీత బెరువా, జయంతి దేవి, డేవిడ్ రాజ్ దేవరకొండ, సర్ఫరాజ్ అహ్మద్ విజేతలుగా ఉన్నారు.కుటుంబాలతో అనుబంధం పెంపొందించుకోవడమే లక్ష్యంహిమాలయ వెల్‌నెస్ బేబీకేర్ విభాగం డైరెక్టర్ చక్రవర్తి ఎన్.వి. మాట్లాడుతూ.. తల్లిదండ్రుల జీవితంలోని ప్రతిరోజూ ప్రత్యేకమైన క్షణాలను గుర్తుచేసుకునే అవకాశం ఈ పోటీ ద్వారా లభించిందన్నారు. చిన్నారులతో తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్న విజేతలను అభినందించారు. కుటుంబాలతో మరింత సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకునేలా భవిష్యత్తులోనూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.విజేత సుశ్రీ సంగీత బెరువా మాట్లాడుతూ.. 'గోల్డెన్ గిఫ్ట్ ప్యాక్' పోటీ తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, తల్లిదండ్రుల జీవితంలోని మధుర క్షణాలను జరుపుకునే ఇలాంటి ప్రత్యేక అవకాశాన్ని కల్పించిన హిమాలయ బేబీకేర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.తల్లిదండ్రుల రోజువారీ జీవితంలోని మధుర క్షణాలను గుర్తిస్తూ, కుటుంబాలతో సన్నిహిత అనుబంధాన్ని పెంపొందించేందుకు ఈ పోటీని నిర్వహించినట్లు హిమాలయ బేబీకేర్ తెలిపింది.







## స్లో ఓవర్ రేట్.. టీమ్‌ఇండియా, విండీస్ మ్యాచ్ ఫీజుల్లో కోత



వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత్, విండీస్ జట్లకు ఐసీసీ (ICC) జరిమానా విధించింది. నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన ఓవర్ల కంటే భారత జట్టు నాలుగు ఓవర్లు, వెస్టిండీస్ రెండు ఓవర్లు తక్కువగా వేసినట్లు మ్యాచ్ రిఫరీ గుర్తించారు. దీంతో టీమ్‌ఇండియా మ్యాచ్ ఫీజులో 20 శాతం, విండీస్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు.
మూడో వన్డేలో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 351 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్ 48.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. ఇప్పటికే రెండు వన్డేల్లో విజయం సాధించిన భారత్ 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

## ఫామ్‌లో ఉన్నా వెయిట్ చేయాల్సిందే.. వైభవ్‌కు అర్థమయ్యేలా చెప్పా: గంభీర్

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా.. మంగళవారం నుంచి టీ20 సిరీస్ ఆడనుంది. ఈ క్రమంలో మరోసారి భారత ఓపెనింగ్ భాగస్వామ్యంపై చర్చ మొదలైంది. స్వదేశంలో ఆడనున్న ఈ సిరీస్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఛాన్స్ ఇస్తారా? అనేది సందేహమే. ఈ నేపథ్యంలో జట్టు కూర్పుపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ గురించి ప్రస్తావిస్తూ.. ఫామ్‌లో ఉన్నప్పటికీ అతడికి అవకాశాలు కల్పించడం కష్టమవుతోందని అన్నాడు.



''ఇది నాక్కూడా కాస్త కొత్త అనుభవమే. వైభవ్ మంచి ఫామ్‌లో ఉన్న మాట వాస్తవమే. కానీ, జట్టులోకి ఎందుకు తీసుకోవడం లేదనేది అతడికి అర్థమయ్యేలా వివరించా. కొన్నిసార్లు ఉత్తమ ప్రదర్శన చేసే ఆటగాడైనా సరే.. అవకాశాల కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఇక, తుది జట్టులో ఎవరు ఉండాలి అనేది సోషల్ మీడియా చర్చతోనో.. అవతలి వ్యక్తి అభిప్రాయాల మీదనో ఆధారపడి ఉండదు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఎవరు ఉన్నారు? పరిస్థితులు ఎలా ఉన్నాయి? మ్యాచ్‌ను ఎవరు గెలిపించగలరు?అనే అంశాలను పరిగణనలోకి తీసుకుని కెప్టెన్, కోచ్ నిర్ణయం తీసుకుంటారు'' అని జియోస్టార్ 'ఫాలో ది బ్లూస్' ఈవెంట్‌లో గంభీర్ వెల్లడించారు.
'ఒకవేళ ఇప్పుడు వైభవ్‌ను ఆడిస్తే.. అభిషేక్, సంజులలో ఎవరిని తప్పించాలనే దానిపై నిర్ణయం తీసుకోవడం కష్టమవుతుంది. గత కొంతకాలంగా మంచి ప్రభావం చూపిస్తున్న కాంబినేషన్‌ను ఉన్నట్టుండి మార్చేయలేం. రెండు, మూడు వైఫల్యాలు కన్పించగానే.. సీనియర్ల స్థానంలో టాలెంట్ పేరుతో యువ ఆటగాళ్లను తీసుకోవడం కూడా పద్ధతి కాదు. పాపులర్ అయ్యే నిర్ణయాలు తీసుకోవడం సులువే. కానీ, సరైన నిర్ణయం తీసుకోవడం చాలా కష్టమైన పని. సంజు–అభిషేక్ జోడీని కొనసాగించి మేం మంచి నిర్ణయమే తీసుకున్నామని అనిపిస్తోంది'' అని హెడ్ కోచ్ వివరించాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌తో అంతర్జాతీయ టీ20ల్లోకి అడుగుపెట్టాడు వైభవ్ సూర్యవంశీ. అయితే, స్వదేశంలో అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఈ యువఆటగాడికి ఛాన్స్ దక్కలేదు. ఇటీవలే ఆసియా గేమ్స్‌లో వైభవ్ టీమ్‌ఇండియా తుది జట్టులో చోటుదక్కించుకున్నాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్‌లో 21 బంతుల్లో 38 పరుగులు చేశాడు. ఇక, ఈ టోర్నీలో పాక్‌తో జరిగిన ఫైనల్‌లో 15 పరుగులు చేశాడు.

## వెస్టిండీస్‌తో టీ20 సిరీస్: అర్ష్‌దీప్ ఇన్?

వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను నెగ్గిన టీమ్‌ఇండియా.. ఇప్పుడు టీ20 సిరీస్‌పై దృష్టి పెట్టింది. ఐదు టీ20ల సిరీస్ రేపటి నుంచే ప్రారంభం కానుంది. ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం లఖ్‌నవూలో జరిగే తొలి టీ20లో అతడికి చోటు ఖాయంగా కనిపిస్తోంది. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడంతో పేస్ దళాన్ని అర్ష్‌దీప్ నడిపించనున్నాడు. అర్ష్‌దీప్ సెప్టెంబరు 22న జపాన్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఆడాడు. అయితే వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. ఆసియా క్రీడల్లో శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ల్లోనూ అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. దీంతో తాజాగా వెస్టిండీస్‌తో జరిగే టీ20 సిరీస్‌లో అతడు బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అతడితో పాటు మయాంక్ యాదవ్ లేదా ప్రిన్స్ యాదవ్‌లో ఒకరికి చోటు దక్కే అవకాశముంది.



ఇక ఆసియా క్రీడల ఫైనల్లో పాకిస్థాన్‌పై రవి బిష్ణోయ్ మూడు ఓవర్లలో 44 పరుగులిచ్చి వికెట్ సాధించలేకపోయాడు. దీంతో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే భారత జట్టు ఎంపిక కోసం ఈ వారం జరిగే కీలక సమావేశానికి ప్రజ్ఞాన్ ఓజా అధ్యక్షత వహించనున్నాడు. అజిత్ అగార్కర్ పదవీ కాలం ముగియడంతో ఓజా కొంత కాలం పాటు తాత్కాలికంగా సెలక్షన్ కమిటీకి నాయకత్వం వహించనున్నాడు. అక్టోబరు 22 నుంచి నవంబరు 27 వరకు సాగే ఈ పర్యటనలో టీమ్‌ఇండియా ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు ఆడనుంది.

## ప్రయోగాలకు సమయం లేదు

వన్డే ప్రపంచ కప్‌కు ఎక్కువ సమయం లేదని, ఇకపై ప్రయోగాలు చేయమని టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ప్రపంచకప్ జట్టులో ఉండే అవకాశమున్న ఆటగాళ్లకే వచ్చే సిరీస్ నుంచి రెగ్యులర్‌గా అవకాశాలు కల్పిస్తామని అతడు స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో టీమ్‌ఇండియా అనేక మంది ద్వితీయశ్రేణి ఆటగాళ్లతో బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. అయితే బుమ్రా, అర్ష్‌దీప్, కుల్‌దీప్, అక్షర్ పటేల్ గైర్హాజరీలో జట్టు బౌలింగ్ బలహీనంగా కనిపించింది. పైగా రెండో వన్డే సందర్భంగా పేస్‌బౌలర్ ప్రసిద్ధ్‌కృష్ణ గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో విండీస్‌తో మూడో వన్డే అనంతరం గిల్ స్పందించాడు.
''ప్రయోగాలకు పెద్దగా సమయం లేదు. వచ్చే సిరీస్ నుంచి ఆటగాళ్లందరూ అందుబాటులో ఉంటారని ఆశిస్తున్నా. ఇక ప్రపంచకప్‌లో ఆడే జట్టుతోనే ఆడడం ప్రారంభించాలనుకుంటున్నాం'' అని అతడు చెప్పాడు.



ప్రధాన బౌలర్లు తరచూ తుది జట్టులో లేకపోతుండడం అసహనం కలిగిస్తోందని అతడు అన్నాడు. కోరుకున్న బౌలింగ్ లైనప్‌తో బరిలోకి దిగలేకపోతుండడం దురదృష్టకరమని గిల్ చెప్పాడు. అయితే ప్రధాన బౌలర్ల గైర్హాజరీ వల్ల.. కొత్త బౌలర్లకు సత్తా చాటుకునేందుకు అవకాశం లభిస్తుందని అభిప్రాయపడ్డాడు.

## రెస్టారంట్ క్యూలో శ్రేయస్, తిలక్‌వర్మ..



ఆసియా క్రీడల్లో గోల్డ్ గెలిచిన తర్వాత టీమ్ ఇండియా స్టార్ ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ కాస్త రిలాక్స్ అయ్యారు. జపాన్ ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. ఓ రెస్టారంట్‌లో ఆహారం రుచిచూసేందుకు వారు క్యూలో వేచి ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
''ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ అందరిలాగే డిన్నర్ క్యూలో ఓపికగా వేచి ఉన్నారు. ఆ దృశ్యం చూడటానికి ఎంతో బాగుంది. వీఐపీ హంగులు, ప్రత్యేక సదుపాయాలు లేకుండా ఇద్దరు అంతర్జాతీయ క్రికెటర్లు తమ వంతు కోసం వేచి చూశారు. వారితో క్యూలో నిల్చోవడం మాకు ప్రత్యేక అనుభూతిని అందించింది'' అంటూ ఓ నెటిజన్ పోస్టు పెట్టారు.

వుదయం సినిమా MOVIE TIME!

# మెగాస్టార్ విశ్వంభర.. రిలీజ్ అప్పుడేనా ?



**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి హీరోగా వస్తోన్న సోషియో ఫాంటసీ మూవీ విశ్వంభర. ఈ సినిమాకు బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించారు. ఈ ఏడాది రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. దసరాకు రిలీజ్ అవుతుందని భావించినప్పటికీ అలా జరగలేదు. దీంతో మెగా ఫ్యాన్స్ ఇంకెప్పుడా అని అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు.ఈ నేపథ్యంలోనే విశ్వంభరకు సంబంధించిన ఓ క్రేజీ టాక్ ప్రస్తుతం టాలీవుడ్‌లో వైరల్‌గా మారింది. తాజాగా వినిపిస్తోన్న బజ్ ప్రకారం ఈ సినిమా వచ్చే ఏడాదిలోనే రిలీజ్ కానుందని తెలుస్తోంది. సంక్రాంతి బరిలో ఉన్న కాకా తర్వాతే విశ్వంభర రానుందని గట్టిగా టాక్ వినిపిస్తోంది.వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి బరిలో కాకా రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత వచ్చే శివరాత్రికి విశ్వంభర రిలీజ్ చేయనున్నట్లు కనిపిస్తోంది. మొదట ఈ ఏడాది దీపావళికి నవంబర్‌లో వస్తుందని అభిమానులు భావించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. అందుకే వచ్చే ఏడాది శివరాత్రిపైనే మేకర్స్ గురిపెట్టారని తెలుస్తోంది. అయితే దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. అప్పుడైనా రిలీజ్ అయితే మెగా ఫ్యాన్స్ పండగే పండగ.

# 'JAILER 2' ట్రైలర్ విడుదల



**వుదయం సినిమా:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్ విడుదలైంది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై–వోల్టేజ్ యాక్షన్, రజనీకాంత్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన క్విర్కీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'జైలర్' ప్రపంచాన్ని మరింత పెద్దదిగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'జైలర్'లో ప్రేక్షకులను ఎంత గానో అలరించిన ఐకానిక్ క్యారెక్టర్ ముత్తువేల్ పాండియన్ గా సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి తనదైన స్టైల్, మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో మెప్పించనున్నారు. సీక్వెల్ లో మరింత పెద్ద సంఘర్షణ, భారీ స్థాయి సవాళ్లు, విస్తృతమైన ప్రపంచాన్ని ట్రైలర్ పరిచయం చేస్తోంది. అదే సమయంలో 'జైలర్'ను బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టిన హ్యూమర్, మ్యాడ్‌నెస్, ఎంటర్‌టైన్‌మెంట్ ను కూడా కొనసాగిస్తూ 'జైలర్ 2'పై మరింత ఆసక్తిని పెంచుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో పాటు ఎస్.జె. సూర్య, విద్యా బాలన్, శివరాజ్ కుమార్, మోహన్ లాల్, రమ్యకృష్ణ, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు, మిర్నా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పవర్‌ఫుల్ యాక్షన్, వినోదం, గుర్తుండిపోయే పాత్రలతో 'జైలర్ 2' ఒక భారీ ఎంటర్‌టైనింగ్ యాక్షన్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఆర్. నిర్మల్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 'జైలర్ 2'ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది.

# #KA13 టైటిల్ 'రియాలిటీ'



**వుదయం సినిమా:** హీరో కిరణ్ అబ్బవరం వరుస విజయాల తర్వాత మరో విభిన్నమైన ప్రయత్నంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'క', 'కె–రాంప్' చిత్రాల విజయాల తర్వాత ఆయన తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా #KA13 చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు కూడా కిరణ్ అబ్బవరం స్వయంగా చేపట్టడంతో పాటు హీరోగా నటిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. మచిలీపట్నంలో చిత్రీకరణ జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన క్విర్కీ ఫస్ట్ లుక్ అనౌన్స్‌మెంట్ ఆసక్తిని పెంచగా, ఆ తర్వాత వచ్చిన బీహైండ్ ది సీన్స్ వీడియో షూటింగ్ సెట్‌లోని సందడి వాతావరణాన్ని చూపించింది. తాజాగా మేకర్స్ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఈ సినిమాలో ఆనందం అనే బాధ్యతగల యువకుడిగా కిరణ్ అబ్బవరం కనిపించనున్నారు. ఎంతో అంకితభావంతో ఆనందం హోటల్ నడుపుతూ, తన చేతులతో వండిన ఆహారాన్ని అందరికీ వడ్డించడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటుంటాడు. జీవితంలో తనకు నిజమైన హై ఎప్పుడు వస్తుందో కూడా అతను చాలా సింపుల్‌గా చెబుతాడు. తన కుటుంబానికి ఉన్న అప్పులన్నీ తీర్చిన రోజే తనకు అసలైన హై అని అంటాడు. ఈ ఆలోచన మధ్యతరగతి కుటుంబాల జీవితాలకు ఎంతో దగ్గరగా అనిపిస్తుంది. అందుకే సినిమాకు 'రియాలిటీ' అనే టైటిల్ కూడా కథకు చక్కగా సరిపోయేలా ఉంది.ఫ్యామిలీ ఆడియన్స్ పల్స్‌ను బాగా అర్థం చేసుకున్న కిరణ్ అబ్బవరం, నిత్య జీవితంలోని సాధారణ పరిస్థితుల ఆధారంగా కథను రూపొందించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. సింపుల్‌గా కనిపించే సన్నివేశాల్లోనే బలమైన ఎమోషన్‌ను చూపించారు. తన అప్పులన్నీ తీర్చేశానంటూ స్నేహితులతో ఆనందాన్ని పంచుకునే సన్నివేశం, ఆ తర్వాత టెర్రస్‌పై కుటుంబ సభ్యులతో కలిసి అప్పడాలు చేసుకుంటూ గడిపే సన్నివేశాలు కుటుంబ బంధాలు, ఆనందం, అనుబంధాల విలువను హైలైట్ చేస్తున్నాయి. నటుడిగా కూడా కిరణ్ అబ్బవరం తన పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. కుటుంబాన్ని చూసుకునే బాధ్యతగల యువకుడిగా ఆయన పాత్ర సహజంగా, ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉంది. దేవికా భట్ కథానాయికగా నటిస్తుండగా, శరత్ కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుధర్శన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సినిమాటోగ్రాఫర్ విశ్వాస్ డేనియల్ కథా ప్రపంచాన్ని ప్రేక్షకులు లీనమయ్యేలా చిత్రీకరిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకొస్తోంది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించిన భజ గోవిందం ట్రాక్ గ్లింప్స్‌లోని ఫీల్‌గుడ్ మూమెంట్స్‌ను మరింత ఎలివేట్ చేసింది. జాయ్ ఫిల్మ్స్ నిర్మాణ విలువలు కథకు తగినట్టుగా ఉన్నతంగా ఉన్నాయి. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సంతోష్ నాయుడు ఎడిటర్‌గా, రాజేష్ కామర్సు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

# వంద శాతం సంతృప్తి చెందేలా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'

**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 – AK47'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టాల్సిన 'ఆదర్శ కుటుంబం' చిత్రం, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఆలస్యం కావడంతో వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్రెస్ మీట్ నిర్వహించి అధికారికంగా ప్రకటించారు.సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "మూడు నాలుగు రోజుల క్రితం కూడా అక్టోబర్ 9నే సినిమా విడుదలవుతుందని మేమందరం ఎంతో నమ్మకంగా ఉన్నాం. అందుకే ఓవర్సీస్ లో బుకింగ్స్ కూడా ఓపెన్ చేయించాము. కానీ, నిన్న ఉదయానికి కూడా ఓవర్సీస్ సెన్సార్ కి కంటెంట్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాము. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పరంగా మూడు నాలుగు రోజులు వెనకబడి పోయాము. ఈ పరిస్థితుల్లో కంగారుగా సినిమాను విడుదల చేసేకంటే.. ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని, క్వాలిటీ అవుట్ పుట్ తో మీ ముందుకు రావాలనే ఉద్దేశంతోనే ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నాము. పైగా, ప్రమోషనల్ కార్యక్రమాలకు కూడా సమయం లేకుండా పోయింది. రెండు మూడు వారాల తర్వాత సరైన తేదీ చూసుకొని, వెంకటేష్ గారితో చర్చించి, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాము. మిగతా పాటలను, ట్రైలర్ ను విడుదల చేసి రాబోయే రెండు మూడు వారాల పాటు ప్రమోషనల్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి.. వీలైనంత త్వరగా మీ ముందుకు వస్తాము. 'ఆదర్శ కుటుంబం' కాస్త ఆలస్యంగా వచ్చినా..వెంకటేష్ గారి అభిమానులంతా నూటికి నూరు శాతం సంతృప్తి చెందేలా సినిమా ఉంటుంది." అన్నారు.ఇప్పటికే విడుదలైన 'ఆదర్శ కుటుంబం – AK47' టీజర్‌కు మంచి స్పందన లభించింది. వెంకటేష్ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా కనిపించడంతో పాటు.. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ, యాక్షన్‌తో టీజర్ ఆసక్తిని పెంచింది. ఈ టీజర్ ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో 20 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది.త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.థమన్ ఎస్ సంగీతం అందిస్తున్న 'ఆదర్శ కుటుంబం' నుంచి ఇటీవల మొదటి గీతంగా విడుదలైన 'నారాయణమ్మ' శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. త్వరలోనే మిగతా పాటలు, ట్రైలర్ తో ప్రమోషనల్ కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి.



# 'పోతిరెడ్డిపల్లి' మూవీ ప్రారంభం



**వుదయం సినిమా:** చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా, మౌనిక, సిరి హీరోయిన్లు నటిస్తున్న నూతన హారర్ థ్రిల్లర్ చిత్రం 'పోతిరెడ్డిపల్లి' హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఆరాధ్య క్రియేషన్స్ బ్యానర్‌పై జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశోక్ రోయ్య దర్శకత్వం వహిస్తున్నారు.అక్టోబర్ 5న ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ చిత్ర పూజా కార్యక్రమానికి అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, సీనియర్ నటుడు బాబుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చిత్రం తొలి షాట్‌కు సీనియర్ నటుడు బాబు మోహన్ హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు, కొరియోగ్రాఫర్ 'అమ్మ రాజశేఖర్' కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తెలుగు మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. దర్శకుడు వి. సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ వేడుకలో పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా హీరో చాక్లెట్ స్టార్ పవన్ మాట్లాడుతూ, కథకు అనుగుణంగా ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందని తెలిపారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.దర్శకుడు అశోక్ రోయ్య మాట్లాడుతూ, "ఇది నా రెండో సినిమా. ఈ చిత్రాన్ని మరింత వైవిధ్యంగా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాను. సినీ ప్రముఖులు, ప్రేక్షకుల ఆశీర్వాదాలు, ఆదరణ మాకు ఉండాలని కోరుకుంటున్నాను" అన్నారు.దర్శకుడు అమ్మ రాజశేఖర్, హీరోయిన్ తదితరులు చిత్ర విశేషాలను వెల్లడిస్తూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో రుగ్మతలు, మిస్టరీ, హారర్, సస్పెన్స్ అంశాలను మేళవిస్తూ ఈ కథను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. కథలోని మలుపులు, పాత్రల స్వభావం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఉంటాయని పేర్కొంది.

# 'కామ్రేడ్ కళ్యాణ్'తో తెలుగులో డెబ్యు చేయడం చాలా హ్యాపీగా ఉంది..



హీరోయిన్ మహిమా నంబియార్

**వుదయం సినిమా:** 'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్' తో అలరించబోతున్నారు. ఈ సందర్భంగా హీరోయిన్ మహిమా నంబియార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఇది మీ తొలి తెలుగు సినిమా కదా.. తెలుగులో నటించడం ఎలా అనిపించింది?** తెలుగులో నటించడం సరికొత్త అనుభవం. నేను ఏదైనా భాషని త్వరగా నేర్చుకోగలను.

**శ్రీ విష్ణు గారితో నటించడం ఎలా అనిపించింది?**
శ్రీవిష్ణు గారు చాలా స్పాంటేనిటీ ఉన్న యాక్టర్. షూటింగ్ స్పాట్‌లో చాలా ఇంప్రొవైజ్ చేస్తుంటారు. **ఈ అవకాశం ఎలా వచ్చింది?**
–డైరెక్టర్ గారు నేను చేసిన తమిళ్, మలయాళ సినిమా చూసి కాల్ చేసి కథ చెప్పారు. చాలా నచ్చింది. శ్రీవిష్ణు గారి సిగ్నేచర్ స్టైల్‌లో ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఇంతకుముందు శ్రీవిష్ణు గారితో నేను 'సామజవరగమన' సినిమా చేయాల్సింది.

# డీప్‌ఫేక్, ఆన్‌లైన్ వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు పరిశ్రమవ్యాప్తంగా వ్యవస్థ అవసరం: విష్ణు మంచు

**వుదయం సినిమా:** తెలుగు చిత్ర పరిశ్రమలో ఇటీవల కలకలం రేపిన కృత్రిమ మేధస్సు ద్వారా రూపొందించిన నకిలీ వీడియోల వ్యవహారంపై డైనమిక్ స్టార్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు మంచు తీవ్రంగా స్పందించారు.ఎన్టీఆర్, జాన్వీ కపూర్ నటించిన 'చుట్టమల్లె' పాటను కృత్రిమ మేధస్సుతో మార్ఫింగ్ చేసి దుర్వినియోగం చేసిన ఘటనను కేవలం ఒక సంఘటనగా చూడకూడదని, అదుపులేని డిజిటల్ దుర్వినియోగం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలకు ఇది హెచ్చరిక అని అన్నారు.రామ్ పోతినేని చేసిన ట్వీట్, "వాళ్లకు ముఖాలు లేవు.. అందుకే భయం లేదు" అనే వ్యాఖ్యను ప్రస్తావించిన విష్ణు మంచు, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తుల గుర్తింపులకు ఆధార్ అనుసంధానంతో జవాబుదారీతనం తీసుకురావాలనే ప్రతిపాదనను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాల్సిందేనని, అయితే అనామకత్వం పేరుతో ఇతరులను వేధించడం, పరువు తీయడం, అసభ్యకరంగా దాడి చేయడం లేదా ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడం జరగకూడదని స్పష్టం చేశారు.డీప్‌ఫేక్‌లకే పరిమితం కాకుండా సినిమాలు, నటీనటులు, దర్శకులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వ్యవస్థీకృత ప్రతికూల ప్రచారంపైనా విష్ణు మంచు ఆందోళన వ్యక్తం చేశారు.విమర్శలు, సమీక్షలు, ట్రోలింగ్, భిన్నాభిప్రాయాలు సినీ ప్రపంచంలో సహజమేనని, అయితే ప్రేక్షకులు సినిమా చూసే అవకాశం రాకముందే దాన్ని దెబ్బతీసేలా సమన్వయంతో ప్రతికూల ప్రచారం చేయడాన్ని మాత్రం అంగీకరించలేమని అన్నారు.సందీప్ కిషన్ తనపై, తన సినిమాపై జరుగుతున్న లక్షిత ప్రతికూల ప్రచారం గురించి చేసిన వ్యాఖ్యలను, అలాగే 'ది ప్యారడైజ్' సినిమా విడుదలకు ముందు పరువు నష్టం కలిగించే కంటెంట్ నుంచి రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు."ప్రతి సినిమా వెనుక ఎన్నో ఏళ్ల కష్టం, వందల కుటుంబాల జీవితం, భారీగా డబ్బు పెట్టుబడి పెట్టే నిర్మాతలు ఉంటారు." అని విష్ణు మంచు పేర్కొన్నారు. సినిమాపై అభిప్రాయం ఏర్పరుచుకునే ముందు ప్రతి ఒక్కరూ దాన్ని చూడాలని, సినిమా నచ్చినా, నచ్చకపోయినా, విమర్శించినా ప్రేక్షకులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని అన్నారు. అయితే ముందుగా సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి అవకాశం ఇవ్వాలని స్పష్టం చేస్తూ "ముందుగా సినిమా విడుదల కానివ్వండి" అని పిలుపునిచ్చారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.